# తరాలు - అంతరాలు



ఆచార్య శేషయ్య కందమూరు, పిహెచ్.డి.,

# తరాలు అంతరాలు

**ఆచార్య శేషయ్య కందమూరు, పిహెచ్.డి.,పిహెచ్.డి.,**

ప్రతులు : 1000

ప్రచురణ : డిసెంబర్, 2018

ప్రతులకు :

ఆచార్య శేషయ్య కందమూరు

**Kashyapa Academy of Leadership**

201, నారాయణ విహార్ అపార్ట్‌మెంట్స్

నెహ్రూనగర్, తిరుపతి - 517 507

ఫోన్ : 0877-2240998

98481 10196

Email : seshaiahk@yahoo.co.in

# అంకితం

దైవసమానులైన తల్లిదండ్రులనుండి పొందిన సేవలకు, త్యాగాలకు తమ ఋణం విధి ధర్మం కర్తవ్యం అన్న భావనతో, చిన్న అవకాశాన్ని కూడా జారవిడుచుకోకుండా సద్వినియోగపరచుకుని సఫలీకృతులవుతున్న సంతతికి అభినందనలతో...

– ఆచార్య శేషయ్య కందమూరు

# స్వకీయము

నేటి మానవ జీవితంలో సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త సామాజిక వాతావరణం స్థితిగతులు, ప్రమాణాలు, అలవాట్లు ఆచార వ్యవహారాలతో చిత్ర విచిత్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

నేటి కంప్యూటర్ యుగంలో సమాచార ప్రసార వినియోగంతో అందరికీ అన్నీ అందుబాటులోకి వస్తున్నాయి. అయితే సుగుణాలు, దుర్గుణాలు జంటగా వచ్చి చివరకు చెడ్డ గెలిచి వ్యక్తుల జీవిత అవసరాలకు, ఆశయాలకు గండికొడుతున్నాయి.ఆ కారణంగా స్వార్థం మొదటి మెట్టు, చివరి మెట్టు కూడా అవుతున్నది. ఆశ దురాశగా , ఆలోచన ఆవేశంగా, ఉద్రేకం పగగా స్వరూపాలను సంతరించు కొంటున్నాయి. ఫలితం ప్రేమకు, త్యాగానికి, కరుణకు, దయకు, అహింసకు, సత్యానికి, ధర్మానికి స్థానం లేకుండా పోతున్నది.

ఏ సమాజంలోనైనా కుటుంబ వ్యవస్థలోని వ్యక్తుల మధ్య ప్రేమాను రాగాలు, నీతి నియమాలు, కర్తవ్య నిర్వహణకు గండి పడి, వ్యక్తుల, కుటుంబాల సమాజాల పతనానికి పాడె కట్టినట్టవుతున్నది అన్నది నిత్యసత్యం.

చేతిలోని ఐదువేళ్ళు సక్రమంగా పనిచేస్తేనే పట్టు చిక్కుతుంది. శరీరం మనసు ఆత్మ ఒకే స్థాయిలో నడిచినప్పుడే ఆనందానికి అర్హులవుతారు. అందరూ ఒకే లక్ష్యం వైపు నడిస్తే సుఖసంతోషాలకు కొదువవుండదు. అలాగాక నీకు ఒక నీతి, నాకు వేరొక నీతి అంటే వ్యతిరేకతకు, పగకు, ప్రతీకారానికి, ఘర్షణలకు బాటను ఏర్పరచుకొన్నట్టు అవుతుంది.

ఒక తరం తల్లిదండ్రులు, పై తరం తల్లిదండ్రులను ఒక దృష్టితో, క్రింది తరం సంతానాన్ని వేరొక దృష్టితో చూచినపుడు అది రకరకాల రుగ్మతలకు శంఖుస్థాపనలుగా తయారవుతాయి. అనేక మంది తల్లిదండ్రులు తాము జీవితంలో తమ అసమర్థతల కారణంగా పొందలేనివి, పోగొట్టుకున్నవి పిల్లల ద్వారా సాధించాలనుకోవడం మొట్టమొదటి మానసిక దౌర్భల్యం. ఆ కారణంగా అనేకులు అసమర్థులుగా జీవితాలకు ముగింపు పలుకుతున్నారు.

అంతటితో ఆగక నీకు లేనిది నీవు ఇతరులకు ఇయ్యలేవు. నీకు చేతకానిది నీ సంతతికి సంక్రమింపచేయడం దుర్లభం అన్న నిజాన్ని తెలుసు కోలేకపోవడం పరమ మూర్ఖం. అయితే ఇతరుల తృప్తి కొరకు సృష్టిలో అక్కడక్కడ జరిగే యాదృచ్ఛికాలను ఆధారం చేసుకొని 'పండిత పుత్ర శుంఠః' అని సర్దిచెపుతారు. అలాగా 'శుంఠ పుత్ర పండితః' గా కావచ్చు కదా! అది వెయ్యికి ఒకరు ఉండవచ్చు, ఉండకపోవచ్చు మిగతా అంతా సాదాసీదానే. పుట్టడం చావడం, సుఖం దుఃఖం, రాత్రి పగలు, చీకటి వెలుగు ఒకదాని తరువాత ఒకటి పయనిస్తాయి. కాని ఒకదాని తర్వాత మరల అదే రావడం యాదృచ్ఛికం.

మంచి ఎండాకాలంలో తుఫాను వచ్చి చెరువులు నిండి కట్టలు తెంచుకోవచ్చు. కాని అలాంటి యాదృచ్ఛికాన్ని ఒక సిద్ధాంతంగా మలచుకొని ఆ గాడిలో ఇమడాలనుకోవడం జీవితాలను తప్పుత్రోవలో నడిపించడమే. దేశంలో అందరూ ఐ.ఏ.ఎస్.లు, కలెక్టర్లు, పి.ఎం.లు, సి.ఎం.లు అయితే ఎవరిని ఎవరు పరిపాలించాలి? అది జరగని పని దాని జోలికిపోవడం నిప్పుతో చెలగాటం ఆడడమే. ఈత రాకుండా సముద్రంలో ఈదాలని ప్రయత్నం చేయడమే.

విజ్ఞత అంటే మన శారీరక, మానసిక స్థితిగతులకు అనుగుణంగా మనవైఖరిని దృక్పథాన్ని తగిన విధంగా మలచుకొని, తీర్చిదిద్దుకొని ఆనందమయంగా సుందరమయంగా చేసుకొని ఉన్నదానితో తృప్తిపడి, తమకు తాము ఉపయోగపడి ఇతరులకు ఉపయోగపడడం క్షేమం, సౌఖ్యం, ఆనందం. ఎవడో ఒక అనామకుడు మహానుభావుడు కావడం ఒక వింత. అలాగే మనకు కూడా జరిగితే దానికి నీ ప్రయత్నం అప్రయత్నంగా దోహదపడుతుంది. అలా జరిగితే జరగనియ్. అంతేగాని పాము ఎగరాలని, పక్షి పాకాలని, మనిషి చేపలా నీళ్ళలోనే కాపురం చేయాలని ట్రైనింగ్ తీసుకుని ప్రయత్నించడం అవివేకం.

హరిశ్చంద్రుడు 'రాజే కింకరుడగు, కింకరుడే రాజగు కాలాను కూలంబుగా' ఇది అందరికీ కాదు. హరిశ్చంద్రుని లాంటి వారికి మాత్రమే.

పైగా దీంట్లో మొదటిదానిమీదనే అనగా 'రాజే కింకరుడు, కింకరుడే రాజు', మీదనే దృష్టి సారిస్తాము. కాని రెండవభాగం 'కాలానుకూలంబు'ను గుర్తించం.

ప్రతివాడూ వాల్మీకి, వ్యాసుడు, ఏకలవ్యుడు అవుతారా? నేటి సమాజంలోని తల్లిదండ్రుల పిల్లల విషయానికి వస్తే, తల్లిదండ్రులు పిల్లలకు ఇష్టములేని వాటిని చాలా ఎక్కువగా అందించి, ఇష్టమైన వాటిని కొద్దిగా ఇచ్చి, కష్టాన్ని ఇష్టంతో సరిచేయాలని (కాంపెంజేట్ చేయాలని) ప్రయత్నిస్తున్నారు. దీంతో పిల్లలు తల్లిదండ్రులు చేసిన మంచిని మరిచిపోయి చెడును మాత్రం గుర్తుపెట్టుకొని, పగను ప్రతీకారాన్ని పెంచుకొని చివరకు తల్లిదండ్రులను ప్రధమ శత్రువులుగా గుర్తించి వాళ్ళను హింసించేందుకు వెనుకాడడం లేదన్నది ప్రస్తుత సమాజ స్థితి, మనస్తత్వ శాస్త్రంలోని సూత్రం. ఈ పరమ సత్యాన్ని అర్థంచేసుకోవడం మేధావులకు కూడా అతీతం. దీన్ని అవగాహన చేసుకోవడానికి మాయను జయించాలి.

తల్లిదండ్రులైన తమ బిడ్డల్ను కోరుకోతగినది, ఉపాధ్యాయుల శిక్షణ ద్వారా అలవరచుకోగలిగినది జీవితంలో జీవనోపాధికి అర్హతను సంపాదించు కొని తద్వారా తాము కుటుంబానికి సమాజానికి ఒక పౌరునిగా, బిడ్డగా, తల్లిగా, తండ్రిగా, సోదరునిగా, సోదరిగా తమ పాత్రను చక్కగా పోషించు కుంటూ చేయగలిగినప్పుడే సమాజాలు కనీసం జంతువులు, వృక్షాల క్రమ శిక్షణా పద్ధతులకు ఋతు క్రమణకు సరి సమానంగా ఉండడానికి వీలవుతుంది. లేని యెడల స్వార్థానికి క్రూరత్వానికి దగ్గరలో ఉంటూ, మనిషి అన్నదానికి అర్థంలేకుండా పోతుంది. అందువలన 'మనిషి' 'మనీషి' కాలేకపోతున్నాడు. ఆ స్థితిలో దేవుడు, వేదాంతం, ధర్మం, ప్రేమ, త్యాగం, జ్ఞానం, తపస్సు, ముక్తి మోక్షం లాంటివి కేవలం మాటల వరకే పరిమితమైపోతాయి. అలాంటి సమాజాలు వాటిని తయారుచేసే కుటుంబ వ్యవస్థలు, విద్యావ్యవస్థలు, సామాజికి ఆర్థిక రాజకీయ వ్యవస్థలు ఉంటే ఎంత? లేకుంటే ఎంత?

ఇలాంటి వ్యవస్థలను పెంచిపోషించే మనందరిపై, ఏదో ఒక శక్తి భగవంతుడు లేదా సైంటిస్టు, ప్రస్తుతం కుప్పలుతిప్పలుగా ఉన్న అణుబాంబు

లన్నింటిని ఒకేసారి ప్రయోగించి, ఈ భూమి మీద గడ్డిపోచకు కూడా స్థానం లేకుండా చేస్తే ఎంతబాగుంటుందో, అన్న ఆలోచన ఈ ఆవేశం నుండి ఉద్భవిస్తుంది. చివరగా ఇతరులను బాధపెడుతు, ఇతరుల బాధను చూచి చలించని వ్యక్తులు, బ్రతికి ఉన్నా చచ్చినవాళ్ళ క్రింద జమకట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హిరణకశ్యపుడు కొడుకుకు సర్వసుఖాలు కలిగించడమే కాక అమితంగా ప్రేమించి ఎలాంటి కష్టాన్ని కలిగించకూడదని ఆలోచించాడు, ప్రయత్నించాడు. అయితే తాను కుమారుడి నుండి కోరిందల్లా 'హరి' అని అనకూడదు. కాని ప్రహ్లాదుడు తండ్రిమాట వినలేదు. ఆ కారణంగా ప్రహ్లాదుడిని అనేక రకాలైన కష్టాలకు లోను చేశాడు. అయినా ప్రహ్లాదుడు తండ్రిమాటలు పెడచెవిని పెట్టాడు. చివరకు ఫలితం హిరణ్యకశిపుడి మృత్యువుకు ప్రహ్లాదుడే కారణమైనాడు. అనగా పిల్లలకు ఇష్టమొచ్చినవి ఇవ్వాలి కాని, ఇష్టంలేనిది ఇవ్వకుండా ఉండడం శ్రేయస్కరం అన్న నీతిని తెలిపాడు ప్రహ్లాదుడు.

కేవలం పెద్ద చదువులు చదివి, ఇంజనీర్లు, డాక్టర్లు అయితేనే తమ సంతానం సుఖంగా ఉంటారు అన్న భ్రమనుండి బయటకు వచ్చి అందుకు వ్యతిరేకంగా జ్ఞానాన్ని, ధనాన్ని సంపాదించుకొని కీర్తిప్రతిష్ఠలతో జీవితాల్ని గడుపు తుండేవారు చాలామంది ఉన్నారు అన్న సత్యాన్ని దర్శించగలిగితే అనేక మంది తల్లదండ్రులు సంతానానికి ఆనందాన్ని పంచినవారవుతారు. లేని యెడల తల్లిదండ్రులు తమ ఆత్మహత్యలకు, పిల్లలు హత్యలకు, ఆత్మ హత్యలకు తెరతీసినవారు అవుతారు.

ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని, "తరాలు అంతరాలు" కథా వస్తువుగా ఎన్నుకొని నవల వ్రాయడం జరిగింది. దీనిద్వారా ఎవరో ఒకరు ఆలోచించి తమ ప్రవర్తనను మార్చుకోగలరని నా ఆశయం.

తిరుపతి — ఆచార్య శేషయ్య కందమూరు

27-11-2018

# ఆప్తవాక్యము

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆచార్య శేషయ్య కందమూరు గారు తన నవల 'తరాలు అంతరాలు'లో మన సమాజంలోని మానవ సంబంధాల రుగ్మతలు, ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలోని మూడుతరాల వారిపై సమస్యల ప్రభావమును స్పష్టంగా చిత్రీకరించారు.

'తరాలు అంతరాలు' కథావస్తువు ప్రస్తుత సమాజపు నిజస్వరూప ప్రతిబింబింబమని చెప్పవచ్చును. ఇది ఒక జరిగిన కథగానే చదువరుల కనులముందు కదలాడుతుంటుంది – ఇది ఒక సందేశాత్మక నవల.

చేసిన తప్పిదములను సరిదిద్దుకొనుట, మాతృత్వాభిలాష, సేవకుల, యజమానుల కృతజ్ఞతాభావము, అననుకూల పరిస్థితులు, పిన్నవయస్సులోనే వ్యక్తిత్వ పరిణితిని పొందేట్లు ఎలాచేస్తాయో, ఆస్తులు సోదరసోదరీ సంబంధాలను ఎలా దెబ్బ తీస్తాయో, మోహతాపము, శృంగారావేశముల దుష్ఫలితాలు, వృద్ధుల యెడల సంతానపు నిరాదరణ, వృద్ధుల నిస్సహాయ స్థితి ప్రభావము, జీవితముపై ఆశను పెంపొందింప జేసే స్నేహితుల ప్రోత్సాహ సహకారములు, నేటిసమాజంలో ప్రాక్ పశ్చిమ సంస్కృతుల మధ్య విజృభింస్తున్న ఆధిపత్య పోరు, విదేశాలలోని మన సంతతి, అభిలాషవున్నా, స్వదేశానికి తిరిగి రాలేని సంకటస్థితిలో తల్లిదండ్రుల అభిప్రాయములను తృణీకరించుట మొదలగు విషయములన్నింటిని పాత్రలలో ప్రస్ఫుటంగా యిమిడ్చి, మూర్తీభవింపజేసి, సమాజం కొరకు, భావితరాల కొరకు 'తరాలు అంతరాలు' అనబడే ఎగ్జిబిషన్‌లో ఉంచారు రచయిత గారు. 'తరాలు అంతరాలు' ఖచ్చితంగా సాహిత్య ప్రయోజన సిద్ధిని పొందగలదని నా ప్రగాఢ నమ్మకము.

శేషయ్య గారి రచనా విధానము చదువరుల మనస్సులను హృదయాలను స్పందింపచేసి, వారిలో సంస్కరణాభిలాషను కలిగింపజేస్తుంది కూడా. ముఖ్యంగా ఒక సన్నివేశము నుండి మరొక సన్నివేశవర్ణనకు ఉపక్రమించేముందు వారు,

తార్కికంగా, విశ్లేషణాత్మకంగా ప్రెజంట్ చేసే ముగింపు లేదా ముక్తాయింపు వాక్యాలు చదువరులలో, సమాజ పరిశీలన మరియు సంస్కరణాభిలాషా స్ఫూర్తిని కలిగిస్తాయనుటలో అతిశయోక్తి లేదు.

'తరాలు అంతరాలు' చదివిన ప్రతివ్యక్తి, ముఖ్యంగా తన కుటుంబములోని మూడుతరాల మధ్య నెలకొన్న మానవ సంబంధాల నెలా మెరుగుపర్చుకోవాలో, సమస్యలుంటే వాటిని సున్నితంగా ఎవరి మనసు నొప్పించకుండా ఎలా పరిష్కరించుకోవాలో ఆలోచింప జేస్తుంది.

ప్రధానంగా మధ్య తరం తల్లితండ్రులు మిగతా తరాలకు వారధి అవుతారు. పై తరాన్ని, క్రింది తరాన్ని సమతౌల్యంతో, ఆదరాభిమానాలతో చూడగల్గుతున్నామా అని, తమను తాము ప్రశ్నించుకునేలా చేస్తుంది 'తరాలు అంతరాలు'.

కందమూరు గారి శైలి పిన్నలకు పెద్దలకు రుచికరంగానే వుంటుంది.

కవుల నుండి, పూర్వగాథల నుండి సామెతల నుండి వీరు గ్రహించిన ఉపమానములు, ఉదాహరణములు 'తరాలు అంతరాలు'కి ప్రత్యేక ఆకర్షణను అందిస్తున్నాయి.

శ్లాఘనీయమైన సంస్కృతి, సచ్ఛీలతతో నిండిన సంస్కారము, తగిన జీవనోపాధి, కుటుంబ కుటుంబేతర వ్యక్తులపై ఆప్యాయత, మమకారము, ప్రేమ, జన్మభూమిపై గౌరవాభిమానముల మేళవింపులో మెరిసిపోయే సమాజాన్ని కళ్ళారా చూడాలనుకొనే రచయిత ప్రొఫెసర్ ఎస్. కె. గారి ప్రగాఢమైన కోరిక త్వరలో ఫలించాలని కోరుకుంటున్నాను.

రచయితతో పరిచయమున్న పాఠకులకు చదువరులకు, 'తరాలు అంతరాలు' చదివినంత తడవు, ప్రతిపేజీలో, 'నేను చెప్పింది నిజమా, కాదా?', 'సమాధాన మేమిటి?' అన్నట్టుగా సైలెంట్ (silent) గా ప్రశ్నార్థకంగా చూచే శేషయ్యగారు చిరునవ్వుతో కనిపిస్తుంటారు.

**సి.వి.ఆర్. క్రిష్ణమూర్తి,** ఎం.ఎ.(ఇంగ్లీషు),బి.ఇడి.,
రిటైర్డ్ ప్రిన్సిపాల్, హైదరాబాద్

# మున్నుడి

ఆదిమ మానవుడు కొండ గుహల్లో, చెట్టు తొ్రల్లో, మాతృవ్యవస్థలను ఆసరా చేసుకుని జీవితాన్ని సాగించేవాడు. ఆనాడు ప్రకృతి లోని పంచభూతాల, క్రూరజంతువుల ద్వారా కలిగే అనూహ్య సంఘటనలు మనిషికి భయాన్ని బాధను కలిగిస్తుండేవి. ఆ కారణంగా నాటి మానవ జీవితం ప్రకృతితో యుద్ధం చేస్తుండేది.

స్త్రీకి ప్రకృతి ప్రసాదించిన వరం బిడ్డలను కనడం. ఆ బిడ్డలు అభివృద్ధిలోకి రావాలని కోరడం సహజం. అయితే ఆనాడు తమ బిడ్డలు, తమకళ్ళముందు జంతువుల బారిన పడి చనిపోతుంటే చూచి కనీసం కన్నీరు కార్చకుండా, జంతువుల్లా జీవితాలను నడిపిన మాతృ వ్యవస్థ చరిత్రకు అవగతమే. ఇలాంటి విషయాలు తెలుసుకోవాలంటే రాహుల్‌సాంకృత్యాయన్ 'ఓల్గా నుండి గంగాతీరం వరకు' లాంటి పుస్తకాలు చదవాలి.

మానవ జీవన ప్రయాణంలో అంతా సవ్యంగా జరిగితే ఎప్పుడూ మూడుతరాలు కలిసి నడుస్తాయి. రెండవ తరం తల్లిదండ్రులు, క్రింద తరం కుమారులు, కుమార్తెలు, పెద్ద తరం తాతయ్యలు, అమ్మమ్మలు, నాయనమ్మలకు, అనగా పై తరానికి క్రింది తరానికి వారధి అవుతారు. అయితే ప్రతి తరం మూడుతరాల పాత్రలను పోషించవలసి వస్తుంది. కాని ప్రతి తరం మరొక తరానికి పునాది రాళ్ళు అయి వరం కావచ్చు లేదా శాపం కావచ్చు. ఈ 'తరాలు అంతరాలు' జీవితాలను ఏ దిక్కుకు నడిపిస్తుందో తెలియదు. 'తరాలు అంతరాలు' నవల పూర్వ తరానికి తరువాత తరానికి మధ్యతరం ఒక వంతెన లాంటిది. అది సరిగా లేకుంటే జీవిత గమ్యాన్ని చేరుకోలేక జనం చతికిలబడతారు. ఒకతరం చేసిన తప్పుల వల్ల అన్నితరాలు భ్రష్టుపట్టి పోతాయి. అసలు మొదట ఈ నవలకు 'వారధి' అని పేరుపెట్టి మరలా 'తరాలు అంతరాలు' అని మార్చబడినది.

అయితే ప్రతితరానికి తప్పు ఒప్పు చేసే అవకాశం ఉంటుంది. తప్పుచేసిన వారు కష్టాల, కన్నీళ్ళపర్యంతమైన జీవితాన్ని గడపడం, ఒప్పుచేసిన వాళ్ళు సుఖమయంగా జీవితాలను గడుపుకోవడానికి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం అని అనిపిస్తుంది. ప్రతి తరం వాళ్ళ ఫలితం ఎలా వుంటుందంటే ఏ విత్తనం వేస్తే ఆ ఫలం చేతికి అందుతుంది. తరాల మధ్య వారధి శ్రీరాముడు కట్టిన వారధి అయితే సుఖసంతోషాలకు కొదువ ఉండదు.

# కృతజ్ఞతలు

మానవ జీవితంలో దురాశకు హింసకు క్షోభకు గురిచేసే తత్త్వానికి దూరంగా ఉండడానికి వలసిన కర్తవ్యాన్ని ప్రేరణను నేటి పిన్నవయస్కులకు తెలియజేయ వలసిన అవసరం ఉందనిపించిన ఆలోచనా ప్రతిరూపమే ఈ రచన సారాంశం.

మిత్రులు, శ్రేయోభిలాషులు సర్వశ్రీ ఆదాల ప్రభాకర రెడ్డి, శ్రీ మురళీ కృష్ణారెడ్డి, వంశీ కృష్ణా రెడ్డి గార్లకు హృదయ పూర్వక కృతజ్ఞతాభి వందనములు.

మంచికి, నైపుణ్యానికి, వ్యక్తిత్వానికి మారుపేరు అని చెప్పుకోగల్గిన మహోన్నత వ్యక్తి విజయ హాస్పిటల్లో ఆర్థోపీడిక్ సర్జన్, డాక్టర్ సి.రాజశేఖర్‌రెడ్డి గారికి తరగని కృతజ్ఞతలు.

నా ఉన్నతికి నిరంతరం చేయూతనిచ్చే ఆప్తులు, శ్రేయోభిలాషులు డా॥ ఎన్. వేణుగోపాల్ (కర్నూలు), డా॥ కె.వి.ఎం. ప్రసాద్ (విజయవాడ), డా॥ ఎన్. ఆదికృష్ణయ్య డా॥ ఎన్.అనిల్ కుమార్ (స్విమ్స్, తిరుపతి), డా॥ మానేపల్లి వి.వి. ఎస్.ఎన్. మూర్తి, శ్రీ ఎ. రాజారెడ్డి, శ్రీఆర్.నారాయణ రావు, ప్రొ॥ ఎం.ఎస్.ఎన్. రెడ్డి, ప్రొ॥ ఆర్.వి. సత్యనారాయణ, డా॥ వి.ఎస్. రమేష్‌బాబు (తిరుపతి), శ్రీ ఎస్. సుభాష్‌చంద్రుడు, డా॥ ఎల్. విజయకుమార్ శెట్టి, డా॥ ఎస్.వి.ఎస్. కిషోర్, శ్రీ పి. కోదండరామయ్య (హైదరాబాద్), ప్రొ॥ లక్ష్మీపతి రాజు (విశాఖపట్టణం), శ్రీ జి. సతీష్‌బాబు గార్లకు మెండుగా నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ముఖ్యంగా నా కర్తవ్యాన్ని నిరంతరం గుర్తుచేసే శ్రీయుతులు నా అగ్రజుడు కందమూరు శివనారాయణరావు, నా శ్రీమతి కె. పద్మావతి, శ్రీమతి. ఎం. గిరిజ, మరియు నా కందమూరు సోదరులు నారాయణ రావు, గోపాలరావు, హనుమంతరావు, రంగారావు, నందనవనం సోదరులు డా॥ రఘుపతి రావు (హైదరాబాద్), ప్రభాకరరావు, సర్వశ్రీ కె. సీతారామయ్య, ఎన్. సుబ్రమణ్యం, ఎం. రాజగోపాల రావు, ఎన్.వి. నరసింహరావు (తిరుపతి), శ్రీ రామచంద్రుని వెంకట రవికుమార్, శ్రీ ములుమూడి వెంకట ఉపేంద్ర నాథ్, శ్రీ పోణంగి శ్రీనివాస్ (హైదరాబాద్), శ్రీమతి. ఆర్. మీనా, శ్రీమతి కె.అనూరాధ (కుమార్తెలు) మన్నేపల్లి సోదరులు శ్రీ వెంకటశివ ప్రసాద్, శ్రీ శివ సుబ్రమణ్యం, శ్రీ వెంకట రాధాకృష్ణమూర్తి, శ్రీ కాగొలను యజ్ఞనారాయణశర్మ, శ్రీ మద్దాళి నాగరాజారావు (నార్త్‌మోపూరు), శ్రీ చెరుకుమూడి ప్రభాకరరావు (నెల్లూరు).

ఈ వ్రాతప్రతిని సునిసితంగా పరిశీలించి తప్పుఒప్పులను సరిదిద్దినందుకు ప్రొ॥ మునిరామి రెడ్డి, శ్రీమతి కె. వసంత (కుమార్తె), డా॥ కె. జగ్గారావులకు నా జిలుగు రాతను కంప్యూటర్ మీదికి ఎక్కించిన శ్రీఎస్.చంద్రశేఖర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు.

# 1

రాజశేఖరం మంచం మీద కూర్చుని పడమట దిక్కున అస్తమించే సూర్యుడు, ఎర్రని పండులా నిండుగా పండి తొడిమ నుండి విడివడిపోయే విధంగా ఉన్న దృశ్యాన్ని చూస్తున్నాడు. నిజానికి తనకూ, అస్తమించే సూర్యునికీ అట్టే తేడాలేదనిపిస్తున్నది. ఉదయాన్నే తూర్పు దిక్కున ఉదయించి పై పైకి ఎగ్రబాకి తన పరిమాణాన్ని తగ్గించుకుంటూ చల్లదనాన్ని కడుపులో నింపుకొని వేడిని బయటికి వెదజల్లుతూ, నేరుగా ప్రయాణించి ఆకాశంలో నడినెత్తికి వచ్చి మొత్తం వేడిని కుమ్మరిస్తూ మరల కొద్ది కొద్దిగా తగ్గించుకుంటూ, అస్తమించడం చూస్తే తన జీవితం తనకు గుర్తుకువస్తున్నది. తాను జన్మించిన నాటి నుండి యవ్వనాన్ని దాటి నడిమివయసులో శక్తినంతా సొంతం చేసుకొని ఆ తర్వాత కొద్దికొద్దిగా దిగజారడం కూడా సూర్యగమనంలా అనిపిస్తున్నది. కాని సూర్యుడు ఉదయించేటప్పుడు, అస్తమించేటప్పుడు కూడా ఎర్రగా పెద్ద బింబంగా ఒకటే పద్ధతిలో ఉంటాడు. కాని మానవుడు దీనికి వ్యతిరేకంగా పుట్టినప్పుడు చిన్నగా ఉండి మరణించేటప్పుడు పెద్దగా ఉంటాడు.

గంట ఏడు అయ్యింది. రాజ్యం సంచిలో నుండి రెండు క్యారియర్లను బల్లమీద పెట్టింది.

"రెండు క్యారియర్లు తెచ్చావే" విశేషమేమిటి అన్నట్టు పైకి చూచాడు రాజశేఖరం.

అందుకు రాజ్యం "రెండో క్యారియర్లో పులిహోరా వుంది. ఉదయం మీ మనవడి పుట్టినరోజుకు కట్ చేసిన కేక్ కూడా పంపారు" అన్నది. "ఓహో! అవున్లే! రాకేష్ పుట్టినరోజు కదా! అందుకని కేక్ కట్‌చేసి వుంటార్లే" అన్నాడు.

కొంచెంసేపు ఆగి "అవును! సాయంత్రం ఏమీ హంగామా లేదా!" అని అడిగాడు రాజశేఖరం.

రాజ్యం అందుకొని "లేకేం నాయనా! రైన్‌బో హొటల్‌లో మరలా కేక్ కోస్తారట. చుట్టాలకూ, స్నేహితులకూ అక్కడే విందు భోజనం" అన్నది. కొంచెం సేపు నిశ్శబ్దం. "అంతేలే." వాళ్ళదేంపోయింది. ఎన్ని కేకులైనా కోస్తారు. ఎంతమందినైనా పిలుస్తారు. సొమ్ము ఒకరిది, సోకు మరొకరిది" అని సన్నాయి శృతిలా ఏదో గొణుక్కున్నాడు రాజశేఖరం. ఆయన మాట్లాడే మాటలు రాజ్యానికి వినబడడం లేదు.

అంతలో రాజ్యం "ఇంతమందిని పిలిచి పుట్టినరోజు జరుపుకుంటున్నారు కదా? మిమ్మల్ని కూడా తీసుకుపోవచ్చు కదా? నేనంటే బావుండదు. కాని వీళ్ళకు పెద్దా చిన్నా లేదు నాయనా.నాకే ఇంత బాధగావుంటే, మీకు ఇంక ఎలా వుంటుంది!" అన్నది.

ఎక్కడో గుండెల్లో కలుక్కు మన్నది రాజశేఖరానికి. తనకు పుట్టిన ఆ బిడ్డలకు లేని ప్రేమ రాజ్యంకు ఉండడంతో తనను వాళ్ళు తిరస్కరిస్తుండడం కొట్టొచ్చినట్టు కనబడుతున్నది. అయినా రాజ్యం పూర్వాపరాలు తనకు మాత్రమే తెలుసు కాని వాళ్ళెవరికీ, చివరకు రాజ్యానికి కూడా తెలియదు కదా అని ఆలోచిస్తున్నాడు. రాజ్యం, తనకు భగవంతుడు ఇచ్చిన వరప్రసాదం కదా అని ఆలోచిస్తున్నాడు.

వాళ్ళకు ఉన్న అధికారం తాను సంపాదించిన డబ్బు ఆస్తితో కలిగింది. వాళ్ళకూ రాజ్యంకు తేడా ఆస్తి మీద ఉన్న అధికారమే. రాజశేఖరం మనసులో సంఘటనలు ముసురుకొంటున్నాయి.

రాజ్యం "గంట ఏడు దాటింది భోజనం వడ్డించమంటారా నాయనా!" అన్నది.

"నీకేమైనా పని వుంటే చూసుకో. మీ నాయన ఎక్కడికి వెళ్ళాడు. నా మనసు ఏం బాగాలేదు. కొంచెంసేపు తరువాత తింటానులే. నీ పని చూసుకో. అవసరమొస్తే నేనే పిలుస్తాను" అని అన్నాడు.

రాజ్యం దగ్గరికి వచ్చి "ఏమయ్యా బాధగా వుందా. తల పట్టేదా?" అన్నది. "అక్కర్లేదులే!" అన్న రాజశేఖరానికి గతం గుర్తుకొచ్చింది.

* * * * *

సాయంత్రం ఐదు గంటలయ్యింది. ఎప్పుడూ లేనిది ఇంటికి త్వరగా వెళ్ళాలనిపించింది రాజశేఖరానికి. సాధారణంగా ఆరు గంటలపైన తప్ప ఇంటికి వెళ్ళడం అలవాటు లేదు. పైగా చేయాల్సిన పని చాలా ఉంది. కాని ఈరోజు ఒకవైపు సంతోషం, మరోవైపు తప్పుచేసినానన్న భయం బిడియం రెండూ పెనవేసుకొని మనసు ఇరకాటంలో పడ్డది. ఎవరైనా తాను అడక్కుండా డబ్బులిస్తే తీసుకోవడం సహజం. కాని మధ్యాహ్నం కొంచెం పెద్ద పనైనందున వాళ్ళు ఆత్రుతతో పెద్ద మొత్తంలో డబ్బు ఎరచూపేందుకు సంసిద్ధం కావడంతో వెనకాముందు ఆలోచించకుండా వాళ్ళు అందించిన పొట్లాన్ని కంగారుగా తనచేతులోకి తీసుకోవడం క్షణాల్లో జరిగిపోయింది.

ఆ సందిగ్దంలో వాళ్ళపని త్వరగా పూర్తిచేసి పంపించేసాడు. జీవితంలో అంత పెద్ద మొత్తాన్ని ఇతరుల నుండి తీసుకోవడం అదే మొదటిసారి. ఆ కారణంగా కూడా తాను ఆఫీసులో ఎక్కువసేపు ఉండడానికి మనస్కరించక ఇంటికి వెళ్ళాలని తొందరపెట్టే మనసుకు సమాధానంగా ఫైల్సు సర్ది ప్యూనును పిలిచి ఇంటికి బయలుదేరాడు రాజశేఖరం.

ప్రతిక్షణం తన హ్యాండ్‌బ్యాగులో పెట్టుకున్న డబ్బు ప్యాకెట్ గుర్తుకువస్తున్నది. తలుపులు వేసుకోమని చెప్పి ప్యూన్‌తో బయటపడ్డాడు. తనకు ఊరికే వచ్చిన డబ్బు కాబట్టి ప్యూన్‌కు కొంచెం డబ్బు ఇద్దామనిపించింది. కాని ఎందుకు ఇబ్బంది కొని తెచ్చుకోవడం. వాడికి అనేక రకాలుగా ఆలోచించేందుకు అవకాశాన్ని ఇవ్వడం మంచిది కాదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. వాకిట్లో ఒకరిద్దరు పలకరించినా పని ఉందని ఆగకుండా స్కూటర్ దగ్గరికి వచ్చి డిక్కీలో బ్యాగు పెట్టి ఇంటికి చేరాడు.

భార్య తెచ్చిన నీళ్ళు తాగి ఫ్రెష్‌అప్ అయ్యి ఇంటికంటే గుడి పదిలం అన్నట్టు, తోట దగ్గరికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

భార్య “ఏమండీ ఆఫీసు నుండి ఇంత త్వరగా వచ్చారు” అన్నది.

"తోటలో మామిడి, సపోటా, టెంకాయ మొక్కలు నాటేదానికి  లారీలో రేపు తెస్తారు, తూర్పువైపున అయిదు ఎకరాల్లో కూడా మొక్కలు వేస్తే మొత్తం ఇరవై ఎకరాల తోటవుతుంది. దాని మందల కోటయ్యకు చెప్పిరావాలి. రేపు నాకు ఆఫీసులో ఒక ముఖ్యమైన మీటింగు ఉంది. పొద్దుపోతుంది. అందుకని రేపు కుదరదు కాబట్టి ఈరోజు అన్నివివరాలు చెప్పాలి" అంటూ వాకిట్లోకి బయలుదేరాడు.

రాజశేఖరం తోటలో వున్న మూడు రూములతో వున్న గెస్ట్‌హౌస్‌కు వచ్చి, ముందు రూములో కుర్చీలో కూర్చున్నాడు. "కోటయ్యా! రాణీ!" అని కేకవేశాడు. ఇంతలో గ్లాసుతో నీళ్ళు తీసుకొని వచ్చింది రాణి .

"ఆయన లేరు అయ్యగారూ! రేపు మొక్కలు వస్తాయట, ఆ విషయం మాట్లాడాలని లారీ ఆఫీసు దగ్గరికి పోయాడు" అన్నది.

"సరేలే!" అన్నాడు.

రాజశేఖరం కుర్చీలో కూర్చొని గజిబిజిగా ఉన్న మనస్సును దారిలో పెట్టడానికి ప్రయత్నిస్తూ, మాటా పలుకూ లేకుండా కూర్చున్నాడు. రాణికి ఏమిచేయాలో పాలుపోలేదు. ఎప్పుడూ చెట్లను గురించి లేదా కూరలు పండ్ల విషయాలు మాట్లాడే ఆసామి కదలకుండా మెదలకుండా మౌనంగా  కూర్చోవడం వింతగా తోచింది రాణికి.

రాణి తనంతట తానే కల్పించుకొని "ఏమయ్య గారూ అలా ఉన్నారు! ఒంట్లో సరిలేదా! తలనొప్పిగా ఉందా! అని అడిగింది. ఏం లేదు, ఏదో ఆలోచిస్తున్నాను.

"టీ పట్టుకురానా!" అన్నది రాణి. జవాబు లేదు.

"అమృతాంజనం రాసి, తల పట్టేదా?" అన్నది.

రాజశేఖరం అప్పుడు ఈ లోకం లోకి వచ్చాడు. తను ఎప్పుడూ అలా ఉండడం జరగలేదు.

రాణి కూడా ఎప్పుడూ అలా అడగలేదు. "ఉండండి. రెండు నిమిషాల్లో నొప్పిని తీసేస్తా" అంటూ బయటకి వెళ్ళి పక్కనే వున్న వాళ్ళ రేకుల ఇంటిలో నుండి అమృతాంజనం సీసాతో ప్రత్యక్షమైంది.

సీసాలో నుండి కొంచెం అమృతాంజనం తీసి తలకు పట్టించేలోగా రాజశేఖరం గాబరాగా "నీవు ఎందుకు, ఫర్వాలేదు, వద్దులే" అని అంటున్నాడు.

రాణి "ఉండండి అయ్యగారు. ఒక్క నిమిషం దిండుకు ఆనుకోండి" అని అమృతాంజ్జనాన్ని  నుదుటిమీద కణతలకు పట్టించి, కుర్చీ వెనుకకు వెళ్ళి అతి సున్నితంగా మునివేళ్ళతో ఒత్తుతూ నెమ్మదిగా రుద్ద సాగింది.

రాజశేఖరానికి చాలా హాయిగా అనిపించింది. తన భార్య నుండి ఎన్నడూ అలాంటి అనుభవాన్ని పొందలేదు. ఇంత కాలంగా రాణిని చూస్తున్నాడు. చూడడానికి చక్కగా వుంటుంది. పైగా ముప్పై పదుల్లో పొంకంగా ఉన్నది. తాను వేరే స్త్రీ చేత సేవ చేయించుకుంటున్నానన్న స్పృహ ఉంది. అయినా శరీరం మనస్సు, మొద్దుబారిపోతున్నాయి. స్త్రీ స్పర్శ ఇలాంటి గగుర్పాటును కలిగిస్తుందని తాను ఎన్నడూ ఊహించలేదు. శరీరంలోని ఇంద్రియాలన్నీ ఒక్కసారి విజృంభించి తెలియని ఉన్మత్తత ఆవరించింది. పైగా రాణి శరీరం నుండి తన ముక్కు పుటలకు తగులుతున్న ఒకరకమైన విచిత్రమైన మదపు వాసన మత్తెక్కిస్తున్నది.

రాజశేఖరం తన తలను నిమురుతున్న చేతులలో ఒక చేతిని బలంగా పట్టుకొని వెనుక నుండి రాణిని ముందుకు లాక్కొని తన దగ్గరకు తీసుకొని రెండు చేతులతో పెనవేసుకొన్నాడు. అంతా క్షణంలో జరిగిపోయింది.

"అయ్యగారూ! అయ్యగారూ!" అంటున్నది రాణి. కాని విదిలించుకొని విడిపోయే ప్రయత్నం చేయలేదు. రాణి జుత్తు రాజశేఖరం ముఖాన్ని కప్పివేయడంతో, ఆరోజే తలస్నానం చేసినందున వర్ణనకు వీలుకాని మత్తెక్కించే ఒక విచిత్రమైన వాసన గుప్పుమంటుంటే, రాజశేఖరం చేతులు మరింత గట్టిగా, గాఢంగా పెనవేసుకుంటున్నాయి. రాణి చేతులు కూడా రాజశేఖరం చేతులతో వంతపాడు తున్నాయి. అది ఒక బిగి కౌగిలి. దాంట్లోకి గాలికూడా జొరబడే వీలు లేదు.

అంగాంగం పరిధులు దాటి పట్టు తప్పుతున్నాయి. రాణి సిగ్గుతో తలవొంచుకుంది. రాజశేఖరం కూడా అదే దిగుడు బావిలో ఉన్నాడు. రాణి అక్కడనుంచి బయటకువచ్చి తన ఇంట్లోకి వెళ్ళిపోయింది. రాజశేఖరం చాలాసేపు అక్కడే కూర్చొని వున్నాడు. కోటయ్య ఇంకా రాలేదు.

రాణి అలికిడి కూడా లేదు. రాజశేఖరం వెలుపలికి వచ్చి, ఏంచేయాలో తోచక స్కూటర్ స్టార్ట్ చేసి కదిలి పది అడుగులువెళ్ళి స్కూటర్ ఆపి స్టాండ్ వేసి రాణి వాళ్ళ ఇంటి వాకిలి దగ్గరకి పది అడుగులు వేశాడు. కాని తనకు రాణిని చూచే ధైర్యం చాలక, వెనుకకు వచ్చి స్కూటర్ స్టార్ట్చేసి బయలుదేరాడు. ఆ శబ్దం విని ఆమె ఇంట్లో నుంచి వచ్చేటప్పటికే రాజశేఖరం స్కూటర్ దాటిపోయింది.

రాత్రి 9 గంటలయ్యింది. కోటయ్య ఇంట్లోకి వచ్చాడు. బయట లైటు వెలుగుతున్నది. లోపల బెడ్లైట్ వెలుగుతున్నది. రాణి అలికిడి లేదు.

"రాణీ! రాణీ! ఎక్కడా!" అన్నాడు.

మంచంమీద పడుకుని ఉన్న రాణి "నాకు ఆకలిగా లేదు, తలనొప్పిగా ఉంది. అన్నం పెట్టుకొని తిను" అన్నది. కోటయ్య దగ్గరకు వచ్చి జ్వరంగా వుందేమోనని తలమీద చెయ్యిపెట్టి చూచాడు. కొంచెం వెచ్చగా ఉన్నట్టు అనిపించింది.

"మాత్ర ఏమైనా వేసుకున్నావా?" అన్నాడు. "అవసరం లేదులే తగ్గిపోతుంది" అన్నది.

"అయ్యగారు వచ్చారా!" అన్నాడు. "వచ్చి వెళ్ళారు" అన్నది.

పొయ్యిమీద కాగివున్న నీళ్ళ తపేలాను బక్కెట్లో వంచుకొని స్నానాలగదిలోకి వెళ్ళి స్నానం ముగించాడు.

కంచంలో అన్నంపెట్టుకొని, తినడం పూర్తిచేశాడు. రాణికి నిద్రాభంగం అవుతుందని మెల్లగా తలపు గడియపెట్టి, మంచం వాల్చుకొని దుప్పటి పర్చుకొని తలవాల్చి నిద్రకుపక్రమించాడు. ఉదయాన్నుండి తిరిగి తిరిగి అలసిపోయిన శరీరం క్షణంలో నిద్రలోకి జారుకుంది.

రాణి కళ్ళుమూసుకొని ఉంది. సాయంత్రం జరిగిన సంఘటన పదే పదే గుర్తుకువస్తున్నది. నిద్ర పట్టడం లేదు. రకరకాల ఆలోచనలు. తప్పు చేశానన్న భయం. జరిగిన సంఘటన తల్చుకుంటే తలతిరిగిపోతున్నది. కోటయ్య చిన్న వయస్సు నుండి రాజశేఖరం నాన్నగారి దగ్గర పెరిగాడు. ఆయనే కోటయ్యకు రాణికి పెళ్ళిచేసింది. పెళ్ళి అయి పదిహేనేళ్ళు దాటుతున్నాయి. అప్పటి నుండి కోటయ్య రాణి ఇక్కడే వుంటున్నారు. అప్పుడు ఐదు ఎకరాలు వున్న భూమి, ఇపుడు ఇరవై ఎకరాలు అయ్యాయి. అప్పుడు ఒక్క బోరుబావి వుండేది.

ఇప్పుడు ఆరు బోరులతో విస్తరించబడింది. నాలుగు నెలల క్రిందటనే ఆరు ఎకరాలు కొన్నారు. దాంట్లో పండ్ల చెట్లు వేయిస్తున్నారు. వరి పైరు నుండి కూరగాయలు, అన్నిరకాల పండ్లు పండుతున్నాయి. మొత్తం అజమాయిషీ కోటయ్య చూస్తుంటాడు. కోటయ్యను తలమనిషి అంటారు. అతనితో కూడా సంవత్సర జీతాలకు పనిచేసేవాళ్ళు ఇంకొక నలుగురు వున్నారు. అరకిలోమీటరు దూరంలో వుండే గంగులపల్లెలో కాపురం వుంటారు. ఉదయాన్నే పనిలోకి వచ్చి సాయంత్రం వెళ్ళిపోతారు. వీళ్ళకు మధ్యాహ్నం భోజనాలు వండడానికీ రాణికి సహాయంగా వుండేందుకు ఒక ఆడమనిషి కూడా వస్తుంది. అవసరాన్ని బట్టి కూలీలను పిలుచుకుని పనిచేయించుకుంటారు.

పది సంవత్సరాల క్రిందటి వరకు సేద్యపు పనులు రాజశేఖరం నాయన ఆంజనేయులు చూచేవారు. వారు కాలం చెందిన ప్పటినుండి ఒకే ఒక కొడుకు అయిన రాజశేఖరం అజమాయిషీ చేస్తున్నాడు. నిజానికి కోటయ్య రాజులా, రాణి నిజంగా రాణిలా బ్రతుకుతున్నారు. వాళ్ళను ఒకమాట అనేవాళ్ళు లేరు. పెత్తనమంతా వాళ్ళదే. ఏ పనైనా చేసినతర్వాతైనా, చేయక ముందైనా ఆసామితో చెప్పడం కోటయ్యకు ఆనవాయితీ అయిపోయింది. కోటయ్యకు మంచి జీతం, కావల్సినంత ధాన్యం, కూరలు, పండ్లు సమృద్ధిగా కలిగి జీవితం హాయిగా గడుస్తున్నది. అయితే వీటన్నిటినీ మించి రాణి కడుపున ఒక కాయ కాయలేదన్నదే ఒక కొరత ఉండిపోయింది. మందులు వాడినా, మంత్రాలు, యంత్రాలు, తంత్రాలు చేయించినా ఫలితం లేకుండాపోయింది.

ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఎన్నడూ లేనిది ఈరోజు సాయంత్రం జరిగినది ఒక విచిత్రం. నిజానికి రాజశేఖరం కానీ రాణి కానీ కలలో కూడా ఊహించని సంఘటన. అది ఇద్దరి మనసుల్లో కలకలం రేపుతున్నది. సాయంత్రం సంఘటన తాలూకూ ఆలోచనలతో సతమతమైన మనస్సు తెల్లవారి ఝామున నిద్రలోకి జారుకుంది. రోజూ ఐదు గంటలకు నిద్రలేచే రాణి ఆరు గంటలకు కోటయ్య లేపితే గాని మెలకువ రాలేదు. రాణికి నిన్న సాయంత్రం నుండి జరిగినది సినిమా రీలులా తిరగడం మొదలయ్యింది. ఏమీ ఎరగనట్టు లేచి దైనందిన కార్యక్రమంలో నిమగ్నమైపోయింది.

* * * * *

రెండు రోజులు అయ్యింది. తోటవైపుకు వెళ్ళడానికి, సిగ్గుతో కూడిన జంకు, తప్పుచేసానన్న భయం రాజశేఖరాన్ని వెనుకకు లాగుతున్నాయి. కాలం ఎంతపెద్ద గాయాన్ని, భయాన్ని, జంకును, బెరుకునైనా ఇట్టే నమిలి మింగేస్తుంది. మూడవరోజు సాయంత్రం ధైర్యం చేసుకొని తోటకు వెళ్ళాడు. వరండాలో కుర్చీలో కూర్చొన్నాడు. కోటయ్య ఏదో పనిమీద బయటికి వెళ్ళాడు. రాణి తన ఇంటి వాకిట గడపమీద కూర్చొని ఉంది. రాజశేఖరాన్ని చూడగానే లేచి లోపలికి వెళ్ళింది. వరండా నుండి హాలులోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. తను రాగానే మంచినీళ్ళు తెచ్చి గౌరవంగా అయ్యగారూ అని పలకరించే పలకరింపు రాలేదు.

ఏం చేయాలో తెలియడం లేదు. ఎలాగో ధైర్యం తెచ్చుకొని లేచి రాణి ఇంటి వాకిట్లో నుండి లోపలికి వెళ్ళాడు. రాణి మంచం అంచున కూర్చొని ఉంది. రాజశేఖరాన్ని చూచి గభాలున లేచి నిలబడింది.

రాజశేఖరం “నన్ను క్షమించు రాణీ, నేను ఏనాడూ నీ మీద అలాంటి ఆలోచన పెట్టుకోలేదు. అయినా అలాంటి ఆవేశం నాలో ఎందుకు కలిగిందో అర్థంకావడం లేదు. బహుశా మనిద్దరి మధ్య అలాంటి సంబంధం ఏర్పడాలని రాసిపెట్టి ఉందనుకుంటాను. అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఆలోచనకు చీకటి కమ్మింది” అని ఆగాడు. రాణి ఒక్కమాట కూడా మాట్లాడే స్థితిలో లేదు.

"భగవంతుడు ఏమి చేసినా అది మన మంచికే అనుకోవాలి. అయినా మన తలరాతను ఎవరు తప్పించగలరు" అన్నాడు.

రాణి "నేను మా మామకు ద్రోహం చేశాను. నన్ను భగవంతుడు కూడా క్షమించడు" అని వెక్కి వెక్కి ఏడవసాగింది.

రాజశేఖరం ఆమె దగ్గరకు పోయి చేతిలోకి చేయి తీసుకొని, "నేను ఉన్నాను ఏమి జరగదు, నీకు ఏ లోటు రానియ్యను. నేను నామీద నీ మీద ప్రమాణం చేసి చెప్పుతున్నాను, దేవుడి సాక్షిగా నీ ప్రాణానికి నా ప్రాణం" అని ఉద్వేగంగా అన్నాడు.

రాణి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది. శరీరం, మనస్సు ఆవిరైపోతున్నట్టు అనిపించిన రాజశేఖరం గబగబా గ్లాసుడు నీళ్ళు తాగేశాడు. కొద్దిసేపు అక్కడే ఉండి "నేను ఆ ఆనందాన్ని నా మనసులోనుంచి తుడిచేయలేక పోతున్నాను, ఇంట్లో, ఆఫీసులో నీవే గుర్తుకు వస్తున్నావు, ఇంతకాలం నేను ఎందుకు గుడ్డివాడిగా ఉండిపోయాను. ఇన్నేళ్ళుగా చూడలేని అందం, ఆనందం ఇప్పుడు ఎలా అనుభవంలోకి వచ్చాయో అర్థంకావడం లేదు. నిన్ను విడిచి ఉండలేనని నాకు బాగా అర్థమౌతున్నది. నా సర్వస్వాన్ని నీకు ధారపోయడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని అంటూ అక్కడ నుండి చరచరా వాకిలి దాటి ఒక్క అంగలో అక్కడి నుండి బయటకు వెళ్ళిపోయాడు.

రాణికి కూడా ఇంతకాలం తను ఎరుగని ఒక కొత్తలోకాన్ని చూచినట్టు, రాజశేఖరంకు కలిగిన భావనలే తనకు కూడా కలుగుతున్నాయి. కానీ దానికి మనసు అంగీకరించడం లేదు. ఒకవైపు భయం. రెండోవైపు పాపం. మూడోవైపు ఏదో తెలియని తెగింపు. అంతా అయోమయంగా ఉంది రాణికి.

మూడు లేదా నాలుగు రోజులకు వచ్చిపోయే రాజశేఖరం ఇప్పుడు ప్రతిరోజు రావడం, తన చేతినుండి ఒక గ్లాసు నీళ్ళు, టీ త్రాగడం ఆనవాయితీ అయిపోయింది. కోటయ్య ఉంటే కొద్దిసేపు ఆమాటా ఈమాటా మాట్లాడుతూ మధ్య మధ్యలో రాణితో మాటలు కలపడం జరుగుతున్నది.

* * * * *

రెండు వారాలు అలానే జరిగిపోయాయి. ఒకరోజు మల్లెచెండు తీసుకొని వచ్చాడు రాజశేఖరం. ఆరోజు కోటయ్య ఊళ్ళో ఉండడని తాను పురమాయించిన పనిమీద ఊరు వెళ్ళాడని తెలుసు. వచ్చిన వెంటనే వెళ్ళి తన రూములో కుర్చీలో కూర్చొన్నాడు. ఈ పదిరోజుల్లో ఇద్దరి మధ్య చాలావరకు బెరుకు సన్నగిల్లింది. ఆమె తెచ్చిన నీళ్ళు తాగి మల్లెచెండును ఇచ్చాడు రాజశేఖరం. కానీ ఆమె తీసుకోలేదు.

"పూలు తీసుకోకపోతే పోనీలే, టీ ఇస్తావా" అని అడిగాడు. వెంటనే అక్కడినుంచి వెళ్ళి పది నిమిషాలలో టీ తీసుకొని వచ్చింది. టీ త్రాగడం పూర్తి అయిన తర్వాత మరలా పూల చెండును తీసుకోమని చేయి చాపాడు. కానీ తీసుకోలేదు.

"నేను పూలు పెట్టుకోవాలంటే మన తోటలో లేని పూవులా!" అన్నది.

"ఓహో, నన్నే పెట్టమంటున్నావని కూడా అర్థంచేసుకోలేని అమాయకుడిని. అర్థమయ్యింది, నేనే పెడతాను" అన్నాడు.

అసలే పెద్ద కళ్ళు. మరీ పెద్దవిగా చేసి రాణి భయంతో తలూపింది. కోరిక దృఢత్వం పెరిగే కొద్దీ, భయం సిగ్గు లజ్జ వెలిసిపోతాయి. రాజశేఖరం ఆవేశం తనని నిలబడనీయడంలేదు. చివాలున కుర్చీలోంచి లేచి ఒకచేతితో తనను వాటేసుకొని వెనక్కి తిప్పి మరొక చేత్తో పూలు పెట్టాలని ప్రయత్నం చేశాడు. కానీ అది కుదరలేదు. పూలశరాన్ని మెడలో వేసి, రెండో చేత్తో కూడా తనని పొదివి పట్టుకున్నాడు. తాను గట్టిగా పట్టుకోవడం, రాణి తప్పించుకోవడానికి చేసిన పెనుగులాట రెండువైపులా బలహీన పడిపోయి ఇద్దరూ దగ్గరై ఒకటి కావడం జరిగిపోయింది.

అంతే! ఆ రోజు నుండి ఇద్దరి మధ్య దూరం తగ్గిపోయి, అవకాశం కోసం పరితపించడం అలవాటైపోయింది.

* * * * *

రెండు నెలలు దాటాయి. యథాప్రకారం రాజశేఖరం గెస్ట్‌హౌస్‌కు వచ్చాడు. రాణి తలుపులు తెరచి వరండాలో స్తంభానికి ఆనుకొని కూర్చుని

ఉంది. రాజశేఖరాన్ని చూడగానే ఎదురుపోయి మెడకు చేతులువేసి నెలదాటి ఇరవైఐదు రోజులు అయ్యిందనీ తనకు అనుమానంగా ఉందనీ భయంతో, బెరుకుతో, ఆనందంతో అన్నది.

"ఇందుకే కాబోలు భగవంతుడు ఈవిధంగా మనల్ని కలిపాడు" అన్నాడు రాజశేఖరం.

నేను డాక్టరుకు ఫోన్ చేసి చెబుతాను. రేపు కోటయ్య, నీవు కలసి వెళ్ళి ఆమెకు చూపించుకుంటే విషయం తెలిసిపోతుంది" అన్నాడు.

మరుసటి దినం డాక్టర్ దగ్గరికి పోవడం తాను గర్భవతి అని తీర్మానం చేయడం జరిగిపోయింది.

ఆ సాయంత్రం రాజశేఖరం రావడం, ఆ శుభవార్తను చెప్పడం జరిగింది. తప్పు, ఒప్పు, మంచి చెడ్డ, పాపం పుణ్యం, ద్రోహం సహాయం అన్నీ మాతృత్వపు ఆనందం ముందు మసిబారిపోయాయి. రాణిలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా భర్తను, ప్రపంచాన్ని ఎదుర్కొనే తెంపు తెగువ వచ్చాయి.

కోటయ్యకు ఎక్కడో ఒక మూల సందిగ్ధం ఏర్పడింది. అనుమానం రాకూడదు, కాని వచ్చిందంటే, నిజం తెలుసుకున్న దాకా స్థిమితంగా ఉండనీయదు మనస్సు. అయితే రోజులు గడుస్తున్న కొద్దీ కోటయ్యకు విషయం అర్థమైంది. మనస్సు బాధ పడ్డది. ఎంతో సర్దిచెప్పుకోవాలని ప్రయత్నం చేశాడు. అయినా ఎక్కడో కొరత ఏర్పడుతున్నది. ఈ ఆలోచన కోటయ్యకు ఎంతోకాలం నిలబడలేదు. తాను ఆమెకు మాతృత్వాన్ని ఇవ్వలేక పోయిన కారణంగా, ఇలా అయినా తనను తృప్తి పరచగలిగానని సర్దుబాటు చేసుకునే ప్రయత్నంలో సఫలీకృతుడయినాడు. దీనికంతటికీ కారణం రాణి యొక్క ప్రవర్తనే. జరిగిన సంఘటనల తాలూకు ఎలాంటి లోపాన్ని కోటయ్య ఎడల ప్రదర్శించకుండా పైపెచ్చు తనమీద ప్రేమ ఎక్కువయ్యిందని అనిపించేట్టు రాణి ప్రవర్తన నడుస్తున్నది. ఆ కారణంగా మనస్సు తను తప్పును సరిదిద్దుకొన్న విధంగా సర్దుబాటు చేసుకున్నది. అందుచేత అనేకసార్లు

తాను ఏమి ఎరుగని అమాయకుడిలా యధాప్రకారం నడుచుకోవడంతో సంతోషపడ సాగాడు. తన వల్ల పొందలేని మాతృత్వాన్ని రాణి ఇలా పండించుకున్నందుకు ఒకరకంగా సంతోషపడ్డాడు.

రాణికి రాజశేఖరం దేవుడయ్యాడు. తనకు మాతృత్వ భిక్ష పెట్టినందుకు మనసంతా ఆనందంతో నిండిపోయింది. రోజులు గడుస్తున్నాయి. జరుగుతున్న వైనం కోటయ్యకు అర్థమౌతున్నది. రాణి రాజశేఖరం మాట్లాడుకోవడం, వాకిట్లో స్కూటర్ చెప్పులు వంటి సంకేతాలతో దూరంగా వెళ్ళిపోవడం అలవాటు చేసుకున్నాడు. మొదట్లో బాధ అనిపించినా తనకు సంతాన సంపద చేకూరుతుందన్న ఆనందం స్వాంతన కలిగిస్తున్నది. రాజశేఖరం మందులతో సహా రాణి అవసరాలన్నీ ప్రత్యేక శ్రద్ధతో తీరుస్తున్నాడు. పండ్లు, కూరలు, పాలు పుష్కలంగా వాళ్ళ ఆధీనంలోనే ఉన్నాయి. అందువల్ల రాణి రోజు రోజుకు ఆరోగ్యంగా కనబడుతున్నది. తన అవసరాలకు అప్పుడప్పుడు వచ్చే పని మనిషిని కూడా పర్మనెంటుగా ఉంచడం జరిగింది. రాణికి కూడా కోటయ్యకు అసలు విషయం తెలిసిపోయిందని అర్థమయ్యింది. అయినా ఆయనలో ఎలాంటి మార్పూ లేదు. ఆ కారణంగా ఏనాడూ ఎలాంటి ఘర్షణ తలెత్తలేదు.

జరగబోయే మంచి తన పాపాన్ని తరిమేస్తున్నది. రాజశేఖరం కూడా తన ఇంట్లో ఎవ్వరికీ ఏమీ తెలియకుండా, అనుమానం రాకుండా, తద్వారా ఎలాంటి కొత్త సమస్యలు ఎదురవకుండా ఉండేందుకు వలసిన ప్రణాళికలు, వ్యూహాలు ఆలోచనలతో మనస్సును పదును పెట్టుకుంటున్నాడు. అయినా ఒకవైపు భయం అప్పుడప్పుడూ తలుపుతడుతున్నది.

రాణి ప్రసవించడం జరిగిపోతే తనతో ఉన్న శారీరక సంబంధాన్ని తెంచుకోవాలని అనేకసార్లు తీర్మానించుకున్నాడు రాజశేఖరం. అయినా దాని తాలూకూ వాసనలు తనను పునర్జన్మ వరకు వెంటాడుతుంటాయనిపిస్తున్నది. రాణి సాంగత్యంలోని మాధుర్యాన్ని మర్చిపోలేకపోతున్నాడు. ఇంతకాలం తన భార్యతో జరిపిన సరస సల్లాపాలు ఈ అనుభవం ముందు చాలా పేలవం అని అనిపించాయి. భార్య ఒక కొయ్య బొమ్మ. చిన్నపిల్లలు గుజ్జిన గూళ్ళతో, రకరకాల

బొమ్మలు పెట్టి ఆడుకునే బొమ్మలలో ఒక బొమ్మలాంటిది. మనం కదిలిస్తే కదులుతుంది. లేకుంటే పెట్టిన చోటే ఉంటుంది.

ఈవిధంగా ముగ్గురూ మూడుస్తంభాలాట ఆడుకుంటున్నారు. ఏది ఏమైనా రాణి సంతోషంగా ఉన్నది. ఇంకా ఒకటి రెండు నెలలలోగా దేవుడు తయారుచేయబోయే కొత్తబొమ్మ ప్రాణంతో తననుండి బయటకు రాబోతున్నది. అది మగ ఆడ అన్నది తెలియదు. రాణి మగ అయితే బాగుండునని అనుకుంటున్నది. కాని ఆడపిల్ల అయినంత మాత్రాన తన ప్రేమ తక్కువ కాబోదు. ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరిగుతుందని ఊహలతో కలలతో ఉత్సాహంగా గడిపేస్తున్నది.

తొమ్మిది నెలలు నిండడం, ఆసుపత్రిలో ఆడపిల్లను ప్రసవించడం జరిగిపోయింది. రాజశేఖరానికి మనసులో ఒక పెద్ద సందేహం ఉండేది. ఒకవేళ పుట్టే బిడ్డకు తన మొక్కట్లు వస్తే ఎలా అన్నది. బిడ్డ రంగు తెలుపు వస్తే ఇబ్బందిలేదు. కోటయ్య కూడా తెల్లగా ఉంటాడు. అయినా కొంచెం వయస్సు వస్తేనేగాని మొక్కట్లు గురించి చెప్పలేం. ఏదిఏమైనా చక్కని ముక్కు మొహంతో బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో అందరూ ఆనందించారు.

* * * * *

# 2

నళిని తన భర్త ప్రకాశరావు ఇద్దరు కుమారులతో సతీష్ ఇంటికి వచ్చారు. రమణి, పిల్లలు వాకిట్లోకి వచ్చి ఆహ్వానం పలుకుతూ లోపలికి తీసుకొనిపోయారు.

"వదిన! అన్నయ్య ఎక్కడ" అన్నది నళిని.

"బెడ్‌రూమ్‌లో డ్రస్ చేసుకుంటున్నారు, రండి ఏమి తీసుకుంటారు!" అని అన్నది రమణి.

"ఇప్పుడు ఏమీ వద్దు వదినా, ఇప్పుడు తింటే మరలా హోటల్లో ఏదైనా తినాలి కదా! ఏమీ వద్దు" అన్నది నళిని.

"పోనీ పొద్దున కోసిన కేకు ఉన్నది. కొద్దిగా పిల్లలకు రుచి చూపిద్దాం" అన్నది.

"ఇక నీ ఇష్టం వదిన. ఇక్కడా అక్కడా తినడానికేమో తింటారు, మరలా రేపట్నుంచి జలుబు జ్వరం ప్రారంభమౌతాయి. ఇది ఎప్పుడూ వుండే తతంగమే. వీళ్ళతో ఏగలేకున్నాము. ఏదైనా చిన్న సమస్య వచ్చినా కూడా ఒకరోజంతా డాక్టర్ సేవ చేయాల్సి వస్తున్నది" అని అన్నది నళిని.

ఒకవైపు మాట్లాడుతూనే కొద్ది కొద్దిగా కేకు ముక్కలు తెచ్చి శ్రియ, ప్రియలకు ప్లేట్లు అందించింది వదిన. ఇచ్చిందే తడవుగా వాళ్ళు తినడంలో నిమగ్నమై పోయారు.

"మీరు టీ తాగుతారా అన్నయ్యా!" అని అడిగింది రమణి.

"టీ అంటే ఎన్నిసార్లయినా కాదంటారా!" అన్నది నళిని.

రమణి "నాలుగు టీలు త్వరగా పట్రా తులసీ" అని కేకవేసింది.

నళిని "చిన్నన్నయ్య నితీష్ ఫోన్ చేశాడా" అని అన్నది. ఉదయాన్నే మరిది గారు మరదలు, చెరొకసారి ఫోన్ చేసి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పి వాళ్ళన్నయ్యతో కొంచెం నిష్టూరంగా మాట్లాడారు" అన్నది.

"దేనిని గురించి?" అన్నది నళిని.

"ఏముంది మనకు పెద్ద దిక్కు ఉన్నాడు కదా. ఆయన సుఖంగా ఉండడు. పైపెచ్చు మనలను సుఖంగా ఉండనీయడు" అన్నది రమణి.

ఇంతలో సతీష్ బెడ్‌రూములో నుండి వచ్చి "ఏం నళినీ ఇప్పుడా వచ్చేది, ప్రొద్దునే రమ్మన్నాను కదా! పిల్లల్ని తీసుకొని బావ సాయంత్రం వచ్చేవాడు కదా! నీవు లేకపోతే బోసిపోయినట్లుంది" అన్నాడు.

"లేదులే అన్నయ్యా! స్కూలు నుండి రాగానే వాళ్ళు ఏదో పేచీ పెడతారు. మీ బావకు అసలే కోపం. ఆయన వల్ల కాదు వీళ్ళతో వేగడం. సారీ అన్నయ్యా! నీవు ఇలా అంటావని ముందే తెలుసు. కావాలంటే కార్లో కూర్చున్నప్పుడు, నేను మీ బావతో ఏమన్నానో అడుగు" అన్నది నళిని.

మరల "నితీష్ అన్నయ ఫోన్ చేశాడట కదా! ఏంటి విశేషాలు". ఇంతలో సతీష్ అందుకొని "ఏముంది ఎప్పుడూ వుండే గొడవే. వాళ్ల నాయన గారిని ఫామ్ హౌస్‌లోనుండి ఇంటికి తీసుకురాలేదని ఈయనగారికి అలక" అన్నాడు. మరల "ఆయన ఇక్కడ ఉంటే ఎవ్వరినీ ప్రశాంతంగా ఉండనీయడు కదా? నీకు తెలియందేముంది. మనం ఏం పని చేయాలన్నా ఆయన గారికి విన్నవించుకోవాలి. పైగా ప్రతిదానికీ లెక్కలు చెప్పాలి" అన్నాడు.

నళిని "పోనీలే అన్నయ్యా! అవన్నీ మనం పట్టించుకుంటే సుఖంగా వుండలేము. అక్కడ నుండి మాట్లాడడం సులభం. ఇక్కడ వుంటే ఆయన గారికి వాళ్ళ నాయన సంగతి తెలిసివచ్చేది. ఈరోజు చిన్నా పుట్టినరోజున ఈ గొడవెందుకు అవన్నీ మర్చిపో!" అన్నది.

అందరూ కలిసి సింధూ రెసిడెన్సీ హోటల్‌కు వెళ్ళారు. అప్పటికే చాలామంది గెస్ట్‌లు వచ్చి వున్నారు. సతీష్ అందరికీ లేటయ్యినందుకు సారీ చెబుతూ, స్వాగతం పలుకుతూ ఫ్లోర్ మేనేజర్‌తో అరేంజ్‌మెంట్స్‌ను గురించి విచారించాడు.

సతీష్, రమణి గేటు దగ్గర నిలబడి మరో ఇద్దరు స్నేహితులతో మాట్లాడుతూ వచ్చేవాళ్ళకు స్వాగతం పలుకుతున్నారు. కొంచెం సేపు తరువాత "అప్పుడే 8 గంటలు అవుతున్నది. మరల అందరూ ఇళ్ళకు వెళ్ళడానికి పొద్దుపోతుంది. ఇంక కార్యక్రమం ప్రారంభం చేద్దామా అన్నయ్యా" అన్నది నళిని.

సరే అని అందరూ హాలులోకి ప్రవేశించి, ముఖ్యమైన ఐదు ఆరు మంది బర్త్‌డే కేకును అమర్చిన టేబుల్ దగ్గర నిలబడ్డారు. హోటల్ కుర్రాళ్ళు కావాల్సిన సరంజామాను తెచ్చిపెడుతున్నారు. కేకు కట్‌చేసే కార్యక్రమం ప్రారంభమయ్యింది. చిన్న (సత్య) క్యాండిల్ వెలిగించి కేకును కట్‌చేసాక అందరూ హ్యాపీ బర్త్‌డే ఆలపించి, కేకు ముక్కలను ఒకరి నోట్లో ఒకరు పెట్టుకున్నారు. ఇంతలో కట్‌చేసిన కేక్ ముక్కలు ప్లేట్లలో పెట్టి గెస్టులందరికీ అందిస్తున్నారు సర్వర్లు. కేకు తినడం పూర్తిచేసిన వాళ్ళు అందరూ ప్లేట్లు తీసుకొని బఫేకు తయారవుతున్నారు. ఎవరికి కావాల్సింది వాళ్ళు ప్లేట్లలో పెట్టించుకొని తమకు ఆప్తులైన వాళ్ళతో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ భోజన కార్యక్రమాన్ని జరిపిస్తున్నారు.

కార్యక్రమం మొత్తం పూర్తయ్యే సరికి 11 గంటలయ్యింది. అందరూ తమ తమ ఇళ్ళకు ప్రయాణం కట్టారు.

* * * * *

తెల్లవారింది. రాత్రి పొద్దు పోవడం వలన 6.30 గంటలకు కూడా సతీష్ మంచం మీద నుంచి లేవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఇంతలో ఫోన్ మ్రోగింది. తీసిచూస్తే అవతల వైపు నుంచి నళిని చేస్తున్నది.

"అన్నయ్యా! నిద్ర లేచారా!" అన్నది.

"ఆ! లేస్తున్నాము" అన్నాడు.

"ఊరికే చేసాను, గాబరాపడాల్సిన పని లేదు, రాత్రి మోటర్‌బైక్ మీద ముగ్గురు కుర్రోళ్ళు బాగా తాగి క్రాస్ రోడ్లో దూసుకు వచ్చి మన కారును కొట్టబోతే మీ బావ యాక్సిడెంట్ తప్పించాలని పక్కకు తిప్పడంతో వెనుక వస్తున్న వేరే కారు మన కారును గుద్దింది. దాంతో చిన్న పిల్ల వెనుక సీటు నుండి ముందు సీట్లోకి దూసుకొచ్చింది. కాలు కొంచెం ఫ్ర్యాక్చరైంది. అందరికీ చిన్న చిన్న దెబ్బలు. వెంటనే రవిచంద్ర హాస్పిటల్లో కట్టు కట్టించాము. మాకు పెద్ద ఇబ్బంది ఏమీ కలుగలేదు భయపడవద్దు. బర్త్‌డే రోజు డిస్టర్బ్ చేయడం ఎందుకని రాత్రి చెప్పలేదు. తొందరేమీ లేదు. నిదానంగా వీలుచూచుకొని రావచ్చు, వదినతో చెప్పు" అని ఫోను పెట్టేసింది.

సతీష్ రమణి ఇద్దరూ స్నానాలు ముగించుకొని, పనివాళ్ళకు పిల్లలను అప్పజెప్పి, చేయవల్సిన పనులను వివరించి, హాస్పెటల్‌కు చేరారు. ప్రియ కాలుకు కట్టు కట్టి ఉంది. అయినా ఉత్సాహంగానే ఉంది.

"నిన్న కొంచెం ముందుగా మొదలుపెట్టివుంటే బాగుండేది. రాత్రి లేటయ్యింది. పొద్దుపోతే ఈ తాగుబోతులతో ఏం జరుగుతుందో చెప్పలేము. మనం ఎంత జాగ్రత్తగా వున్నా, వాళ్ళ ఇష్టప్రకారం బండి నడుపుతుంటారు" అన్నది రమణి.

"అప్పటికీ మీ బావగారు చాలా జాగ్రత్తగా వుండబట్టి అంతమాత్రంతో పోయింది. ఇంకొంచెం పక్కకు జరిగి ఉంటే మేమందరం పక్కనే వున్న గుంటలో పల్టీలు కొట్టుండేవాళ్ళం, ఏమయ్యుండేదో. దేవుడు అంతటితో పోనిచ్చాడు. నిదానంగా రమ్మన్నాను కదా, గాబరా పడాల్సిన పన్లేదు అని కూడా చెప్పాను కదా!" అన్నది నళిని.

"అసలే రాత్రి. హాస్పిటల్లో కట్టు కట్టడం పూర్తయ్యే సరికి ఒంటి గంట అయ్యింది. ఆయనను ఇంటికి పంపించి నేను హాస్పెటల్లో ఉండిపోయాను" అన్నది నళిని.

"అయినా భలే దానివి నళిని!" పిల్లలు ఇంకా నిద్రలేవలేదు. రాత్రి చెత్తా చెదారం తిని ఇంకా నిద్రపోతున్నారు. యాక్సిడెంట్ అయిందని తెలిస్తే మనస్సు

ఉంటుందా. ఇప్పుడు కంటితో చూచాము కాబట్టి మనస్సు స్థిమిత పడ్డది” అని అన్నది రమణి.

రమణి “తెల్లవారు జామున కునుకు పడుతున్నప్పుడు అమెరికా నుండి మా అన్నయ్య వదిన ఫోన్ చేశారు. వదినకు ఉద్యోగం వచ్చిందట. చేరడమా లేదా అని సందిగ్ధంలో ఉన్నారు. వదిన ఉద్యోగంలో చేరితే, వాళ్ళ ఆలనా పాలనా ఎవరు చూడాలి! అందుకని అమ్మా నాన్నలను ఒప్పించి అమెరికాకు పంపమంటారు. ఎలాగైనా వాళ్ళను ఒప్పించేందుకు ప్రయత్నం చేయమని పదే పదే చెప్పారు. నాన్నతో మాట్లాడితే ఆయన ససేమిరా అన్నాడట. వాడు అంత దూరం అడుగుతుంటే పోకపోతే మనసు కష్టపెట్టుకుంటాడు అని అమ్మ మొహమాటపడుతున్నది. నిజానికి ఆమెకు కూడా ఇష్టం లేదు. కానీ ఏం చేయాలి. అక్కడికి పోతే నాన్నకు పొద్దుపోదు. అమ్మ జీతంలేని పనిమనిషి అవుతుందని అంటాడు నాన్న. ఇదీ వీళ్ళ వరుస” అని ముగించింది రమణి.

“ఈ పెద్ద వాళ్ళతో ఏగేటప్పటికి తల బట్టకట్టేటు వుంది. మనం చెప్పేది వాళ్ళకు గిట్టదు. వాళ్ళ ఆలోచనలతో జీవితాన్ని గడపాలంటే జీవితం వృధా అనిపిస్తుంది. డబ్బులు కూడబెట్టాలి కానీ ఖర్చు కాకూడదు. కేవలం సంపాదించాం అన్న తృప్తి కోసం చిన్న మొత్తాలను గుట్టలుగా చేసి కొండలుగా మలచాలని చూస్తారు” అన్నది నళిని. రమణి, నళిని ఇద్దరూ టిఫిన్ తిన్నారు. ఇంతలో డాక్టర్ రౌండ్స్‌కు వచ్చి చూచి కండిషన్ బాగానే ఉందనీ, ఇంటికి వెళ్ళవచ్చని గ్రీన్ సిగ్నెల్ ఇచ్చి వెళ్ళాడు. డాక్టర్ బాగా ఎరిగిన వాడే కాబట్టి పెద్ద ఫార్మాలిటీ లేకుండా అన్నీ సర్దుకొని బిల్ తయారుచేసి ఆఫీసుకు పంపమని రిసెప్షనిస్ట్‌తో చెప్పి వాళ్ళు బయలుదేరారు.

* * * * *

# 3

పది గంటల ప్రాంతంలో ఫోను మ్రోగింది. ఫోను తన తమ్ముడు దిలీప్ దగ్గర నుండి. ఫోను ఎత్తి "ఎలావున్నావు దిలీప్!" అన్నది రమణి. అవతలి వైపు నుండి "బాగానే వున్నాము. రమణి! నేను చెప్పింది ఏంచేశావు? అమ్మానాన్నతో మాట్లాడావా?"

ఇవతలనుండి, "లేదురా! నీవు ఫోన్‌చేసినట్టు చెప్పాను. అమ్మతో ఇబ్బంది లేదు. కానీ నాన్నకు ఇష్టం లేదు. తనను ఒక్కదాన్నే పొమ్మంటున్నాడు. నాన్నను వదలి రావడం అమ్మకు ఇష్టం లేదు. మేము బ్రతికినంత కాలం బ్రతకం. చెరి ఒకచోట వుండడం ఇష్టం లేదు అన్నది. వాళ్ళకు వృద్ధాశ్రమంలో బాగానే వుందట. ఇద్దరికీ బాగా కాలక్షేపం అవుతున్నది. ఆయనకు కొంతమంది మంచి స్నేహితులు తయారయినారు. అమ్మ కూడా ఒక బృందాన్ని తయారుచేసుకుంది. వాళ్ళను పలకరించే వాళ్ళు వుంటే ఇంకేం కావాలి. భోజనం, కాఫీ, టిఫిను వేళకు పెడు తున్నారట. రుచిగానే వుందట" అన్నది.

దిలీప్ అవతల నుండి "ఆశ్రమం రుచి మరిగారు. పనీపాట లేకుండా కూర్చుని తినడం అలవాటు పడితే ఇంక ఎక్కడికీ వెళ్ళాలనిపించదు. పాత రోజుల్లో వయస్సులో వుండేవాళ్ళకంటే ముసలివాళ్ళు ఎక్కువ పనిచేసేవాళ్ళు. వాళ్ళు వూరికే కూర్చొనే దానికి ఇష్టపడేవాళ్ళు కాదు. ఇప్పుడు అంతా తారుమారు అయ్యింది. అసలు వృద్ధాశ్రమానికి డబ్బులు కట్టకుంటే వాళ్ళ తిక్క కుదురుతుంది" అన్నాడు.

రమణి "అట్లా మాట్లాడ్డం మంచిదికాదు దిలీప్! నీవు ఏమైనా నీ డబ్బులు పంపిస్తున్నావా! నీ దగ్గర ఉన్నదంతా వాళ్ళ భూములు ఇల్లు అమ్మినదే కదా! దానికి కూడా మనం బాధపడితే ఎలా! అసలు ఇల్లు అమ్మడం పొరబాటు కదా! ఇప్పుడు వాళ్ళ ఇల్లు ఉంటే అక్కడే సుఖంగా ఉండేవారు కదా! పోరుపెట్టి అమ్మించింది నీవే కదా!"

అవతలి నుండి "వాళ్ళు ఇక్కడికి వచ్చి నాతో ఉండిపోతారు అని అనుకొన్నాను కానీ అక్కడే ఉంటారని ఎవరనుకుంటారు. వాళ్ళు ఇక్కడకు వచ్చి రెండు సంవత్సరాలు అయింది. ఈ నాలుగేళ్ళలో ఆరునెలలే కదా మాతో ఉన్నది. ఒకవేళ మేము అమెరికాకు రాకుండా అక్కడే ఉమ్మడి కుటుంబంగా వాళ్ళతో ఉండిఉంటే, ఇంటి పని అమ్మానాన్న చూచుకునేవారు కదా? అదేపని ఇప్పుడు అమెరికాలో చేయడానికి ఇబ్బంది ఏమి వచ్చింది? ఆ కారణంగానే కదా నేను ఇల్లు వాకిలి అమ్మించింది. అలాగైనా వచ్చి మాతో ఉంటారని అనుకున్నాను" అన్నాడు దిలీప్.

రమణి "అలవాటు పడ్డ ఇల్లు, ఊరు కాబట్టి ఇక్కడ పని ఇబ్బందికరంగా ఉండదు. అమెరికాలో అలాకాదు కదా? వాళ్ళు ఉండడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. ఎవరికైనా అలవాటున్న పని, ప్రదేశం యొక్క సుఖం వేరేచోట ఉండదు" అన్నది.

దిలీప్ "నీవల్ల కాదులే, నీవు నచ్చచెబితే వాళ్ళు వినరు. నేనే మాట్లాడుతాను. బావ పిల్లలు ఎలా వున్నారు?" అన్నాడు.

"అంతా బాగున్నారు" అని రమణి సమాధానం చెప్పి ముగించింది.

* * * * *

దిలీప్ కోదండరాం, శారదమ్మ కుమారుడు. అమెరికాలో ఉంటున్నాడు. కుమార్తె రమణిని సతీష్‌కు ఇచ్చి పెళ్ళిచేశారు. పదిహేను రోజులుగా దిలీప్ నుండి ప్రతిరోజు రాత్రి ఒకసారి, ఉదయం ఒకసారి ఫోను వస్తోంది. అమ్మానాన్నలను అమెరికాకు రమ్మనమనీ టిక్కెట్లు ఎప్పుడు బుక్‌చేయాలో చెప్పమని. ఆ ఫోన్ సారాంశం. ఆరోగ్యం బాగాలేదంటే అమెరికాలో మంచి వైద్యం ఉంటుందని చెప్పడం. ఇక్కడ అలవాటు పడ్డాము అంటే కొన్నిరోజులు అక్కడుంటే అక్కడ కూడా అలవాటు అయిపోతుందని చెప్పడం. అంతేకాక అక్కడ మంచి కూరలు, పండ్లు ఉంటాయనీ అన్నివిధాలా ఆరోగ్యంగా ఉంటుందనీ, అక్కడ అన్నీ యాంత్రికంగా జరుగుతుంది కాబట్టి వసతిగా ఉంటుందని చెప్పడం. వీళ్ళు చెప్పే ప్రతి ఇబ్బందికీ ప్రతిగా ఒక్కో ఉపయోగాన్ని చెప్పి ఒప్పించేదానికి ప్రయత్నం చేస్తున్నాడు.

చివరకు ఒకరోజు కోదండరాం "మేము ఇప్పుడు వచ్చే పరిస్థితిలో లేము. ఒక ఆరు నెలల తర్వాత చూస్తాము" అని ఖచ్చితంగా చెప్పేయడం జరిగింది.

అందుకు దిలీప్ కోపంగా "మీరు రావలసిన అవసరం లేదు. మీ చావు మీరు అక్కడే చావండి. ఇక మీదట నేను వృద్ధాశ్రమానికి కట్టవలసిన పైకానికీ నాకూ ఎలాంటి సంబంధం లేదు. నేను దానికి బాధ్యుణ్ణి కాదు" అని చెప్పి ఫోను పెట్టేశాడు దిలీప్.

దానికి కోదండరాం "మన భూమి, ఇల్లు అమ్మగా వచ్చిన కోటి పది లక్షలు తన అకౌంట్‌లో వేసుకొని ఇప్పుడు వృద్ధాశ్రమానికి కట్టవలసిన డబ్బులు కూడా కట్టనంటున్నాడు మన సుపుత్రుడు" అని భార్య శారదతో అన్నాడు

కొంచెం ఆగి, "పైగా అది నా తాత ద్వారా నీకు, నీ ద్వారా నాకు సంక్రమించబడింది. అది నా సొమ్ము . దానిలో నీకు ఒక్క పైగానికి కూడా హక్కులేదు. మీ ఇష్టం వచ్చినట్టు మీరు బ్రతకండి" అని అంటున్నాడు.

ఈ విషయాన్ని గురించి చూచాయగా గతంలో కూతురితో ముచ్చటించి ఉన్నారు. కూతురు కూడా దిలీప్‌తో మాట్లాడింది. అలా మాట్లాడడం సరికాదని నచ్చచెప్పే ప్రయత్నం చేసింది. కానీ ఫలితం శూన్యం.

నాలుగు గంటలకు రూము బాయ్ తెచ్చిన బిస్కెట్లు తిని టీ త్రాగి భార్యాభర్తలు మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వృద్ధాశ్రమ మేనేజర్ వచ్చి "నేడు పదవతేది. సాధారణంగా మీరు ఐదవ తేదీకే డబ్బులు జమచేస్తారు. ఏదైనా ఇబ్బంది ఉంటే నాలుగు రోజులు ఆలస్యం అయినా ఫర్వాలేదు. మీ అబ్బాయి అమెరికాలో తీరికలేకుండా ఉండి ఉండవచ్చు. ఇవన్నీ నేను అర్థంచేసుకోగలను. నేను మిమ్ములను ఇబ్బంది పెట్టడానికి ఈ విషయం ముచ్చటించడం లేదు. కాదంటే గుర్తుచేయాల్సిన బాధ్యత నాది. మీరు అన్యథా భావించవద్దు. అన్ని సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా? ఏదైనా ఇబ్బంది ఉంటే మీరు నా నోటీసుకు తీసుకరావలసినదిగా కోరుకొంటున్నాను. మీరు చెప్పకపోతే నాకు తెలిసే అవకాశం ఉండదు" అని అడగాల్సినవి, చెప్పాల్సినవి అన్నీ పూర్తిచేశాడు.

కోదండరాం భార్యతో "ఏం చేద్దాం!" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. మాట్లాడే స్థితిలో కూడా లేదు. తమ కొడుకు తమ ఆస్తినంతా తీసుకొని తమని ఎలాగైనా అమెరికాకు రప్పించి తమతో సేవచేయించుకోవాలని బ్లాక్‌మెయిల్ చేస్తాడని కలలో కూడా ఊహించలేదు. ఉత్తముడైన భర్తతో దాదాపు యాభై సంవత్సరాలు కాపురంచేసి, తమకు కొడుకు ఉన్నాడన్న నమ్మకంతో, ఆశతో బ్రతుకుతూ ఉండి ఈరోజు వాడి దగ్గర నుండి ఛీత్కారాలు పొందే స్థితికి వచ్చారంటే ఏమనుకోవాలి? ఏం చేయాలి? ఎవరిని అంటే ఏం లాభం. ఆమెకు ఏమీ అర్థం కావడం లేదు. మనసులో అగ్నిపర్వతాలు బద్ధలవుతున్నాయి. గుండెలో గునపాలు గుచ్చినట్లుంది. తాను ప్రసవ వేదనను సులభంగా భరించగలిగింది గాని ఈ బాధను తట్టుకోవడానికి మనస్సు సహకరించడంలేదు. శరీరాన్ని ఎంతక్షోభ పెట్టినా భరించగలదు గాని, ఇలాంటి బాధను ఎవరి మనస్సు తట్టుకొని నిలబడలేదు.

హెడ్‌మాస్టరుగా తన భర్త అనేకమందిని తీర్చిదిద్ది మంచిమార్గంలో నడిపించాడు. ఎంతోమంది ఉన్నత శిఖరాలకు ఎదిగిన తరువాత కూడా ఆయన వలన అంత ఎత్తుకు ఎదగగలిగామనీ కృతజ్ఞతలు చెప్పుకున్న సంఘటనలు తనకు తెలుసు. అలాంటిది తమ కుమారుడిలో పిసరంతైనా మంచితనం లేకపోవడం చాలా బాధగా అనిపించింది.

హెడ్‌మాస్టరుగా కేవలం విద్య చెప్పడమే కాక, బీద పిల్లలకు పుస్తకాలు, గుడ్డలు ఇచ్చి స్కూలు ఫీజులు కట్టి వాళ్ళ అభివృద్ధికి కారణభూతుడైన వ్యక్తి ఈ రోజు దిక్కులేని వాడుగా నడిరోడ్డులో నాలుగు కూడళ్ళు కలిసేచోట భిక్షమెత్తుకోవలసి వస్తున్నందుకు ఏమనుకోవాలి. ఆయనకు ఎలా ధైర్యం చెప్పాలి. ఇంతమందికి చేసిన మంచినంతటినీ ఒక్క విషపు చుక్క అది కూడా కొడుకు రూపంలో ప్రత్యక్షమై తమ ప్రాణాలు తీసేందుకు సిద్ధంగా ఉండడాన్ని సహించలేక పోతున్నది. తన భర్త ఈ పరిస్థితిలో ఉన్నాడని ఆయన దగ్గర చదువుకొని అభివృద్ధిలోకి వచ్చిన ఒకరిద్దరికి తెలిపితే కూడా తాము ఈ పరిస్థితిలో ఉండవలసిన అవసరం ఉండదు. అయినా అభిజాత్యం అడ్డం వస్తుంది కదా! అలాంటి మంచిమనిషిని ఎవరు వచ్చి ఓదారుస్తారు, సమస్యను ఎలా పరిష్కరించాలి? తల్లి వేరును నరికివేస్తే చెట్టు ఎలా నిలదొక్కుకొని నిలబడుతుంది" అని ఆలోచిస్తున్నది.

అసలు విషయం ఏమిటంటే భార్యాభర్తలిద్దరూ ఒకేరకంగా ఆలోచిస్తున్నారు. ఒకే సమస్యకు పరిష్కారానికి వెదుకుతున్నారు. అయితే అందులో కొంత తేడా ఉంది. భర్త ఏమౌతాడోనని భార్య కుమిలిపోతుంటే, భార్య లోలోపలే ఎలా కుళ్ళిపోతున్నదో, ఎలా భరిస్తున్నదో అని భర్త ఆలోచిస్తున్నాడు. తానైతే మగవాడు బాధను తట్టుకోగలడు. భార్యగా, తల్లిగా ఎటూ చెప్పలేక మధనపడిపోతున్నదని ఆలోచిస్తున్నాడు. ఎలాగైతేనేం ఒకరికోసం మరొకరు పుత్రుని నిర్వాకంతో మరణవేదనను అనుభవిస్తున్నారు.

మరలా "ఏం మాట్లాడవు?" అన్నాడు కోదండరాం.

"ఏం మాట్లాడమంటారు? మనం చేసిన పాపాలకు ఇది ప్రాయశ్చితమో లేక పూర్వజన్మ ఫలితమో తెలియడం లేదు. ఇక్కడ ఉన్నప్పుడే ఇలా ప్రవర్తిస్తుంటే, మనం అక్కడికి పోతే వాడికి బానిసలుగా ఉండాల్సిందే కదా!" అన్నది.

"ఇందులో వాడి తప్పు ఏమీలేదనిపిస్తుంది. మనమే ఎక్కడో తప్పుచేశాము అని అనిపిస్తుంది" అన్నాడు.

"ఇందులో మన తప్పుకు తావెక్కడ ఉంది. కన్నాము, పెంచాము, పెద్దచేశాము, విద్యాబుద్ధుల్ని నేర్పించాము. ఇలా ప్రవర్తించమని మనమేదైనా తర్ఫీదు ఇచ్చామా?" ఇంకేం మాట్లాడాలో తెలియక మౌనం వహించింది శారదమ్మ.

కోదండరాం "అలాంటి బిడ్డను కనడమే మనం చేసిన పెద్ద తప్పు! ఆ నేరానికి శిక్ష అనుభవించాలి. అనుభవిద్దాం" అన్నాడు.

శారదమ్మ "దీనికి పరిష్కార మార్గం అమ్మాయితో మాట్లాడదామా!" అన్నది.

కోదండరాం "అది మంచిపని కాదు. పైగా బాగుండదు. అల్లుడు మంచివాడే. నాకు తెలిసినంత వరకు అమ్మాయి కంటే అల్లుడు గుణవంతుడు. ఏనాడూ మనలను ఒక్కమాట కూడా అనలేదు. ఏ కోరికా కోరలేదు. మొత్తం ఆస్తినంతా అమ్ముకొని మన పుత్రరత్నం స్వంతం చేసుకుంటుంటే తాను ఒక్కమాట కూడా అనలేదు. అమ్మాయి అయినా ఒకటి రెండు సార్లు తన భాగాన్ని గురించి మాట్లాడింది గాని అల్లుడు ఒక్కమాట కూడ పలుకలేదు. పైపెచ్చు మనకు కట్నం ఇచ్చారు కదా!

ఇంకా వాళ్ళ ఆస్తిని ఆశించడం మంచి ఆలోచన కాదు అన్నాడని అమ్మాయి చెప్పింది. అయినా ఇంటి ఆడపడుచుకు తల్లిదండ్రుల ఆస్తిలో సంతోషంగా ఒక్కరూపాయైనా ఇచ్చివుంటే ఈరోజు మనకు ఎంతో గౌరవంగా ఉండేది. మన ప్రబుద్ధుడు మనకు అన్నిదారులూ మూసివేశాడు. ఇంత అధోగతి పాలవుతామని ఊహించలేక పోయాము”అన్నాడు.

మరలా “ఇలాంటివి మనకే కాదు చాలామందికి జరుగుతున్నాయి. ఇది పుత్రవాత్సల్యానికి అందే ప్రతిఫలం. ఈ విషయం అల్లుడి దాకా పోతే తప్పక మనలను ఆదరిస్తాడు. కానీ అది అల్పమైన ఆలోచన. ఇంకా ఈ కట్టె మీద వ్యామోహం ఉండడం దౌర్భాగ్యాల్లో పెద్ద దౌర్భాగ్యం అవుతుంది. అసలు జీవితానికి అర్థం ఇప్పుడు తెలుస్తున్నది. ఇంతకాలం బిడ్డల క్షేమం కోసం కనీసం భగవంతుడిని కూడా భక్తితో పూజించి జీవితాన్ని పండించుకోలేకపోయాము. అది మన మూర్ఖత్వం. దాని ఫలితమే ఈనాడు మనం ఎదుర్కొంటున్న దుర్భర జీవితం” అన్నాడు కోదండరాం.

శారదమ్మ కొంచెంసేపు ఆగి “ఇంకా మనకు ఈ జీవితంతో అవసరం ఉందా అని అనిపిస్తున్నది” అన్నది.

“లేదు అన్నది అసలు సిసలైన సత్యం. కానీ దానినుండి బయటపడే ధైర్యం నీకు ఉందంటావా!” అన్నాడు.

“దానికి ధైర్యం ఎందుకండీ! కావల్సింది విరక్తి పిరికితనం, బ్రతకలేమనే భయం. ఇవన్నీ ప్రస్తుతం మనకు పుష్కలంగా మిగిలిన సంపదలు” అన్నది.

మరలా “అన్ని వ్యామోహాలకూ విరుగుడు విసుగు విరక్తి. అలాంటి వాటిని ఇప్పుడు కూడా ఆహ్వానించకుంటే ఈ జీవితభారాన్ని, మానసిక ఆందోళనను ఎంతకాలం మోయగలం? ఈ నరకాన్ని క్షణక్షణం అనుభవించే దానికంటే ఒక్క క్షణం కళ్ళుమూసుకుంటే మహదానందాన్ని పొందవచ్చు కదా!” అన్నది.

కోదండరాం మనస్సు చలించిపోయింది. తనకంటే తన భార్య ఎక్కువ బాధపడుతున్నది అని అర్థమౌతున్నది. ఈ మాతృమూర్తి తాను చనిపోయి కూడా

బిడ్డలను సుఖపెట్టాలనుకుంటున్నది. ఆమె ఉదాత్తతను, ఔన్నత్యాన్ని చూచి పరవశించాడు.

ఆమె తనకు కావలసిన వైరాగ్యాన్ని అందిస్తున్నది. ఇంతకాలం తాను అనేక పుస్తకాలు చదివి, తోటి ఉపాధ్యాయులను విద్యార్థులను చదివి, సమాజాన్ని పరిశీలించి, సంఘటనలను విపులీకరించి గొప్ప జ్ఞానాన్ని పొందగలిగానన్న అహంకారం ఇప్పుడు పటాపంచలైపోయింది కోదండరాంకు.

"అయితే ఇంతటితో మన ప్రయాణానికి ముగింపు పలికి మనం చేరవలసిన గమ్యాన్ని చేరుదామా!" అన్నాడు ఉద్రేకంతో.

శారదమ్మ "ఆలస్యం చేస్తే మనస్సు మారుతుందేమోనని భయంగా ఉంది. బిడ్డల మీద వాత్సల్యం అలా చేస్తుంది. ఇంత చేయగలిగిన ప్రేమకు ఇదేమీ పెద్ద లెక్కలోనిది కాదు" అన్నది.

కోదండరాం "నీకున్న తెలివిలో నాకు వందోవంతు లేదనిపిస్తున్నది. నీ చేతి గాజులు, మెడలో గొలుసు ఇస్తే వీటిని అమ్మి ఒక కార్యక్రమాన్ని పూర్తిచేసి తయారుగా వస్తాను. ఆ తరువాత మన ప్రయాణాన్ని సాగిద్దాం".

"దానికి ఆలోచించాల్సిన పని ఏముంది? బంగారం ప్రాణంకంటే విలువైనది కాదు కదా!" అని చేతిగాజులు మెడలో గొలుసు తీసి భర్త చేతికి ఇచ్చింది.

* * * * *

## బిడ్డలకు బరువైన బాధిత తల్లిదండ్రులకు ప్రేమతో నమస్కృతులు

బిడ్డలమీద ప్రేమ, వాత్సల్యము ఎంత తీయ్యని విషతుల్యమో తెలియచెప్పాలని నేను ఈ జాబు వ్రాసి ఈ దినపత్రికలో అడ్వర్టైజ్‌మెంటుగా ముద్రిస్తున్నాను. దీన్ని ముద్రించేందుకు సమ్మతించిన పత్రికల వారికి జన్మజన్మలకు ఋణపడి ఉంటాను. నేను వాళ్ళకి ఇచ్చిన డబ్బు పెద్ద విషయం కాదు. అయితే ఈ ఉత్తరం చదివిన వారిలో కొంతమందైనా మా పరిస్థితి రాకుండా జాగ్రత్త పడుతారనీ, కొంతమందికైనా కనువిప్పు కలుగుతుందనీ ఎక్కడో ఒక చిగురుటాశ. నేను అధ్యాపక వృత్తిలో ఉండి

హెడ్‌మాస్టర్‌గా ఉద్యోగ విరమణ చేశాను. నేను నా విధిని చాలా గొప్పగా నిర్వర్తించానని గర్వపడ్డాను. అలాగే నా విద్యార్థులను తీర్చిదిద్ది నా సలహా కోసం సంప్రదించిన వారికి నా అనుభవంతో తగిన విధంగా సూచించాను. నేను ధర్మబద్ధంగా ఉన్నానన్న గర్వంతో విర్రవీగాను.

అదే పద్ధతిలో నేను నా కుమారుడికి కూడా చదువు, సంస్కారం నేర్పించి పెంచి పెద్దచేశాను. వాడు కోరినదంతా కాదనకుండా ఇచ్చాను. అలాంటిది ఇప్పుడు కాదంటే వాడి మనసు బాధపడకుండా ఉంటుందా? అది సహజం. కాదంటే ఇదంతా తల్లిదండ్రులుగా మా భ్రమ. మా నాన్న సంపాదించిన ఆస్తిని కూడా ఖర్చుపెట్టి నా కుమారునికి భారతదేశంలో ఉన్న అన్ని ముఖ్యమైన ప్రదేశాలను, క్షేత్రాలను, కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు చూపించాను. వాడి చిటెకిన వేలు పట్టుకొని నదులు సముద్రాలు, గుళ్ళు గోపురాలు, కొండలు కోనలు తీర్థాలు చూపించాను. కానీ వాడు వద్దంటుంటే కూడా వాడిని ఇంజనీరింగులో చేర్పించాను. కుమారుడు పిహెచ్.డి చేసి ప్రొఫెసర్ కావాలనుకున్నాడు. అయితే నేను నేటి సమాజ వాతావరణాన్ని బట్టి మన ప్రయాణం సాగించాలి అని చెప్పి ఒప్పించి ఇంజనీరు చేశాను. ఎంటెక్ ఐటి చదివి క్యాంపస్ ఇంటర్వ్యూలో పెద్ద కంపెనీలో ఉద్యోగం రావడం, వివాహం చేయడం వెంటవెంటనే జరిగిపోయాయి. నేను నా భార్య ఆనాడు పొందిన ఆనందానికి అవధులు లేవు. నా కూతురి చదువు పూర్తయ్యాక ఒక మంచి వ్యక్తితో వివాహం జరిపించాము. వాళ్ళు ఎలాంటి ఒంట్టెత్తుపోకడలకు లోనుకాకుండా వాళ్ళ పరిధిని దాటకుండా జీవితాన్ని సాగిస్తున్నారు. నిజానికి మా అమ్మాయి వాళ్ళ అమ్మ రక్షణలో పెరిగి పెద్దదయ్యింది. నేను నా కొడుకు మీద చూపిన శ్రద్ధ అమ్మాయి మీద చూపలేదు. పుత్ర ప్రేమ నన్ను గుడ్డివాడిని చేసింది.

నేను చూపిన అతి శ్రద్ధ, అతనిలో స్వార్థాన్ని నింపుతుందని ఊహించలేక పోయాను. ఈరోజు వాడి ఆశాపాశానికి మొదలు ఉందిగాని తుదిలేదు. కోడలు కూడా బిటెక్ చదివిన కారణంగా ఉద్యోగం చేస్తున్నది. నాకు కట్నం తీసుకోవడం ఇష్టంలేదని నాకుమారుడికి నచ్చజెప్పి ఒప్పించాను. అయినా నా కుమారుడు కట్నానికి ఆశపడి తీసుకున్నాడు. సరే! వాడి పెళ్ళి, వాడి పెళ్ళాం, వాడి యిష్టం అని, వాడి

మనసును కష్టపెట్టడం ఇష్టంలేక వదిలేశాను. కానీ ఆడపిల్లను ఇచ్చేటప్పుడు మంచిచోట ఇవ్వాలని కట్నం ఇచ్చాను.

కొంతకాలం క్రితం నాపేరుతో ఉన్న ఇల్లు ప్లాట్లు అన్నీ అమ్మగా వచ్చిన డబ్బు తన అకౌంటులోకి మార్చుకొని మా ఇద్దరినీ వృద్ధాశ్రమంలో చేర్పించి ఆశ్రమానికి నెలనెలా కట్టాల్సిన ధనాన్ని నా కొడుకు పంపిస్తున్నాడు. నాకు వచ్చే ఆరు వేల రూపాయల పెన్షన్‌తో మేము డాక్టర్ల ఫీజులు, మందులు, ఆటోలు ఇతర ఖర్చులకు చాలీ చాలకుండా బ్రతుకు సాగిస్తున్నాము. ఇలా బ్రతుకును ఈడ్చడం అవసరమా అని అనిపిస్తున్నది.

గతంలో ఒక ఆరు నెలలు ఇక్కడి మా స్వర్గాన్నుండి అమెరికా అనే నరకానికి వెళ్ళాము. అక్కడ మమ్ములను బంగారు గొలుసులతో కట్టేసిన కుక్కల్లా ఒక రూములో ఉంచారు. నా భార్య జీతంలేని ఆనరరీ పనిమనిషిలా కాలం గడపడం జరిగింది. ఇప్పుడు కూడా మమ్ములను అమెరికాకు రమ్మని పోరుపెడుతున్నాడు. ఎలాగైనా మేము ఆ నరకంలోకి పోకూడదని విశ్వప్రయత్నం చేస్తున్నాము.

ఒకవేళ మా మనస్సు ఏదైనా ఒక బలహీన క్షణంలో మారుతుందోనని మా ఇద్దరి పాస్‌పోర్టులు, వీసాల కాగితాలు నేను కాల్చేశాను. ఇప్పుడు మా దాంపత్య జీవితంలో జరిగిన అనేక విషయాల జ్ఞాపకాలను మా గుండెల్లో పదిలపరచుకుని అప్పుడప్పుడు బయటతీసి సంతోషపడడం మా ఇద్దరికీ అలవాటయిపోయింది. అమెరికాలో ఉన్న ఆరు నెలలలో మా తండ్రి కొడుకుల మధ్య సంభాషణ ఒక గంటకు పైగా మించలేదు.

ఇంతకు మించిన చిత్రవధ, నరకం మానవునికి వుంటాయని నేను ఊహించడం లేదు. శరీరాన్ని ఎంతైనా కష్టపెట్టు, దానికి గుర్తు ఉండదు. ఆ జ్ఞాపకాలను సు లభంగా మర్చిపోవచ్చు. శరీరం ప్రేమ కోసం వెయ్యి కొరడా దెబ్బలు కూడా భరించి మర్చిపోగలదు. మనస్సును హింసిస్తే భరించలేదు. మనం ప్రేమించేవాళ్ళ చేత 'ఛీ!' అన్న ఒక్క అక్షరం మనస్సును ముక్కలు ముక్కలుగా చేస్తుంది.

మాలాంటి ఎంతమంది తల్లిదండ్రులు ఇలాంటి చిత్రవధను అనుభవిస్తున్నారో అని ఆలోచిస్తే బాధ కలుగుతుంది. అలాంటి వారు బ్రతకలేక, చావలేక

ఆరాటపడుతున్నారు. కాని నాలాంటి వాళ్ళకు నా కొడుకు వేసిన శిక్ష సబబే. ఎందుకంటే పిల్లల్లో త్యాగాన్ని విస్మరించి, స్వార్థాన్ని అనుసరించి అనుకరించమని బోధించినందుకు ఇది సబబే. అయితే పాఠశాలలో ఇతర పిల్లలకు నేను త్యాగాన్ని నేర్పించాను. మంచిని బోధించాను. కాని, నా కుమారునికి స్వార్థ చింతనను ఉగ్గుపాలతో మ్రింగించాను. నేను పాఠం చెప్పిన స్కూల్లో నా కుమారుడిని చదివించలేదు. నేను వాడిని కాన్వెంట్‌లో చదివించాను. నా దగ్గర చదువుకున్న పిల్లల్లో ఎంతోమంది అభివృద్ధిలోకి వచ్చి ఒక వ్యక్తిత్వాన్ని కలిగిఉండడం నేను కళ్ళారా చూచాను. కాని నా కుమారునికి అది అబ్బలేదు. దీనికి కారణం నా స్వార్థం. దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి, పరిహారం చెల్లించాలి. దానికి శిక్ష అనుభవించాలి. కానీ ఆ శిక్ష బాధ నుండి విముక్తి కలిగేదిగా ఉండాలి.

అందుకే నేను మా ఆవిడ కలిసి వృద్ధాశ్రమంలో మరణశయ్యమీద పడుకొని బాధ అనే గోతిని పూర్తిగా పూడ్చివేయాలనుకుంటున్నాము. నేను చేసిన తప్పులకు నా కొడుకు శిక్ష వేయడం ప్రకృతి ధర్మం. మన తప్పులకు ప్రకృతి సాక్షీభూతంగా నిలుస్తుంది అన్న సత్యం నాకు జ్ఞానోదయాన్ని కలిగించింది.

ఈ విషయాన్ని ప్రచురించడానికి అడ్వర్టైజ్‌మెంట్ ధర రూ. 12,500/- లు, నా భార్య గాజులు, దండ అమ్మగా వచ్చిన ఇరవై వేలలో నుంచి ఆ డబ్బు ఇచ్చి ఈరోజే దీనిని ముద్రించమని ఇక్కడున్న ఇన్‌చార్జి వ్యక్తికి వెయ్యిరూపాయలు వద్దంటున్నా బహుమానంగా ఇచ్చాను. నేను త్వరగా విముక్తికి ప్రయత్నం చేస్తున్నందు వలన ఇంతకు మించి వ్రాయలేను.

ఇట్లు
**కోదండరాం**

కోదండరాం ఆశ్రమం చేరాడు. భార్యాభర్తలిద్దరూ బజారు నుంచి తెచ్చిన స్వీట్సు పకోడీ తిని, చివరి భోజనం పూర్తిచేశారు.

ఉదయం ఏడు గంటలు అయినా రూము తలుపులు దగ్గరికి వేసి ఉన్నాయి. శబ్దం లేదు. పనిమనిషి తలుపు తెరచి చూస్తే ఇద్దరూ విగతజీవులై ఉన్నారు. అక్కడ ఉన్న చిన్న టీపాయ్ మీద ఒక కాగితం, కొంత ధనం ఉంది. పనిమనిషి

గాబరాగా కేకలు వేస్తూ బయటికి పరుగెత్తింది. జనం గుమిగూడారు. అప్పుడే ఒకాయన కోదండరాం వ్యాసం పేపర్లో ముద్రింపబడిందని చెబుతున్నాడు. మేనేజర్ వచ్చి కాగితం తీసుకొని అందులోని విషయాలను చదివాడు.

"ప్రియమైన ఆశ్రమ మేనేజర్ గారికీ నాతోటి ఆశ్రమ వాసులకు ప్రణామములు. మీరు ఇంతకాలం మా భార్యాభర్తల ఎడల చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివి. అందుకు మా కృతజ్ఞతాభివందనములు. మీ బాకీ తాలూకు డబ్బు నా భార్య మంగళసూత్రం అమ్మి జమచేసుకోండి. మమ్ములను కడతేర్చేందుకు ఏడువేల రూపాయలు పెట్టి ఉన్నాం. ఏ హంగామా లేకుండా కార్యక్రమాన్ని పూర్తిచేయించండి.

ఎవరికీ ఏమీకాని, ఎందుకు పనికిరాని **శారదా కోదండరాం**

అందరూ నిర్ఘాంతపోయారు. వాళ్ళవాళ్ళకు ఫోన్ చేయడం, కూతురు అల్లుడు సహా తెలిసిన కొంతమంది, ప్రకటనను చదివి బాధను తట్టుకోలేక చూడ్డానికి వచ్చిన మరికొంతమంది కడసారి చూపుకు నోచుకున్నారు.

అల్లుడు "మనతో ఒకమాట అని ఉంటే అంతా సర్దుబాటు చేసి ఉంటాము కదా! వాళ్ళ మనసు ఎంత గాయపడిందో! ఎంత బాధను దిగమ్రింగుకున్నారో" అన్నాడు.

కూతురు రమణి ఏడుస్తూ అమెరికాలో ఉన్న అన్నయ్యకు ఫోన్ చేసింది. పరిస్థితిని అర్థంచేసుకున్న తాను అక్కడికిపోతే అందరూ తలా ఒకమాట అంటారు. అందరికీ లోకువ అయిపోతాము అని అనుకొని ప్రయాణం చేయకూడదని తీర్మానించుకున్నాడు. అయినా ఇంత ఇదిగా జరుగుతుందన్న విషయం ఊహించలేకపోయాడు. అందుచేత తాను రానని జరగాల్సింది జరిపించమని చెల్లెలికి మెసేజ్ పెట్టాడు. మరలా ఎన్నిసార్లు ఫోన్ చేసినా మాటా పలుకూ లేదు.

కోదండరాం, భార్య శారదమ్మ తమ పరిస్థితిలో మ్రగ్గిపోయే తల్లిదండ్రులకు ఒక దశా దిశా చూపించామన్న ఆనందంతో తమదారిన తాము ప్రయాణమై పోయారు.

* * * * *

# 4

ఆఫీసులో కూర్చొని సీరియస్‌గా ఫైళ్లు చూస్తున్నాడు రాజశేఖరం. టేబుల్ మీద ఫోన్ మోగింది. రిసీవర్ తీసుకొని "హలో" అన్నాడు. కొడుకు సతీష్ ఫోన్ చేశాడు. "హలో! అమ్మకు బాగాలేదు. కళ్ళు తిరిగి పడిపోయింది. ఇంట్లో ఎవరూ లేరు. నేను పనిమనిషి చెంగమ్మ కలిసి హాస్పెటల్‌కు తీసుకొనిపోతున్నాము. మీరు అక్కడికి వచ్చేయండి" అని ఫోను పెట్టేశాడు.

రాజశేఖరానికి గుండెల్లో కలుక్కుమంది. ఆరోగ్యంగా ఉండే మనిషికి ఉన్నట్టుండి ఏమైంది. రాత్రికూడా వాళ్ళ అమ్మా నాన్నను గూర్చి మాట్లాడింది కదా! వాళ్ళ ఆరోగ్యాన్ని గురించి చాలాసేపు బాధపడింది. వాళ్ళకేదో అవుతుందని ఎంతో ఆవేదన వెళ్ళబోసింది అని గుర్తుచేసుకుంటూ గబాగబా లేచి జీపు తీయమని డ్రైవర్‌తో చెప్పి హాస్పెటల్‌కు చేరాడు.

ఈలోగానే ఆమెను ఐ.సి.యు.లోకి చేర్పించారు. ఇద్దరు ముగ్గురు డాక్టర్లు పరీక్షలు చేస్తున్నారు. నర్సులు డాక్టర్ల సలహాల మేరకు ఇంజక్షన్లు ఇస్తూ సెలైన్ పరికరాలు అమర్చారు.

"ఏమైంది డాక్టర్" అని అడిగాడు. డాక్టరు జవాబు చెప్పకండా చేత్తో డిస్టర్బ్ చేయవద్దు అని సైగచేశాడు. ఇద్దరు డాక్టర్లు ఒకరితో మరొకరు సీరియస్‌గా మాట్లాడుకొంటున్నారు. ఇంతలో కూతురు నళిని, కుమారుడు సతీష్ గబ గబా పరిగెత్తుకొచ్చారు. రాజశేఖరానికి ముఖ్యమైన స్నేహితులు ఆంజనేయులు, నగేష్, రామనాధం, గంగాధరం హాస్పెటల్‌కు చేరారు.

ఆరోగ్యంగా ఉండే వ్యక్తికి ఏమైందో డాక్టర్లకు కూడా అర్థంకాలేదు. ఆమె ఏనాడూ హాస్పెటల్‌కు వచ్చి దీర్ఘ వ్యాదులకు వైద్యం చేయించుకున్న దాఖలాలు లేవు. లోపల ఏమి జరుగుతున్నదో బయటవాళ్ళకు తెలియడం లేదు.

డాక్టర్ రవిశంకర్ రాజశేఖరాన్ని బయటికి తీసుకొని వచ్చి "ఎందుకనో పల్స్ పడిపోయింది. చెన్నైలో ఉన్న న్యూరోసర్జన్ డాక్టర్ కైలాష్‌కు మన డాక్టర్లు ఫోన్ చేసి ఆయన సలహాతో ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. ఇ.సి.జి.లో కూడా తేడాలు కనబడ్డాయి. అన్నిటికంటే ముఖ్యం పల్స్ పడిపోవడం బ్లడ్ సర్క్యులేషన్ సరిగా లేకపోవడం, ఇది హార్ట్ సమస్యా, బ్రెయిన్ సమస్యా అర్థంకావడం లేదు. అయినా ఈరోజు మనకు అందుబాటులో ఉన్న వైద్య విజ్ఞానంతో ఏదో ఒకమార్గం దొరుకుతుందని ఆశిస్తున్నాం. మీరు గాబరా పడకుండా మీ మిత్రులతో కొంచెంసేపు రిలాక్స్ కండి. నేను మిగతా డాక్టర్లతో మాట్లాడి వస్తాను" అని డాక్టర్ పక్కరూములోకి వెళ్ళాడు. బ్రెయిన్ నరాలు చిట్లి ఉండొచ్చని ఎం.ఆర్.ఐ. స్కానింగ్‌కు తయారుచేస్తున్నారు. కాని ఇక్కడున్న ఎక్విప్‌మెంట్‌తో పూర్తి వివరాలు వచ్చేదానికి వీలుకాదు. అదే చెన్నైలో అయితే వీలయ్యే అవకాశం ఉంది. కానీ పేషంట్‌ని అంత దూరం తీసుకు పోవడానికి సపోర్టు సిస్టమ్ సహకరించదు. ప్రయాణంలోనే ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తవచ్చు. అందుచేత చెన్నైలోని డాక్టర్ల సలహాల ఆధారంగా మందులు ఇస్తున్నారు. ఇంతలో పల్స్‌రేటు కొంచెం మెరుగుపడుతూ మరలా తగ్గుతూ ఉన్నది. స్టేబుల్‌గా ఉంటే ఆంబులెన్స్‌లో చెన్నైకి తీసుకొని పోవచ్చు. క్షణక్షణానికి హెచ్చుతగ్గులు కనబడుతున్నాయి" అన్నాడు డాక్టర్.

అంతా గందరగోళం. సాయంత్రం అయ్యింది. పిల్లలు ఇంటికి వెళ్ళి భోజనం చేసి రాజశేఖరానికి భోజనం తీసుకొచ్చారు. మనసు కృంగిపోయి ఆకలి కావడం లేదు. హాస్పిటల్ నుండి బయటకు వచ్చి స్నేహితులతో కలసి పక్కనే ఉన్న బంకులో ఒక కాఫీ తాగాడు. ఆలోచనలు సముద్ర తరంగాల్లా ముందుకు వెనుకకు పోతున్నాయి. పరిస్థితి చూస్తే ఏదో జరిగింది అనిపిస్తుంది. డాక్టర్లకు కూడా పూర్తి అవగాహన కాలేదని అనిపిస్తున్నది. కానీ అంతకు మించి చేయగలిగినది ఏమీ లేదు. పరిస్థితిని బట్టి వేరే మార్గం కనబడడం లేదు. ఇంతలో టౌను నుంచి వేరే ఇద్దరు డాక్టర్లు కారులో వచ్చి లోపలికి వెళ్ళారు.

రాజశేఖరం ఒకమూల కుర్చీలో కూర్చొని వున్నాడు. రాత్రి 9 గంటలు అయ్యింది. తన స్నేహితులను ఇంటికి పొమ్మని బతిమిలాడాడు రాజశేఖరం.

అవసరమైతే ఫోన్ చేస్తాను ఇంటికి వెళ్ళి భోజనాలు చేయమని పదే పదే చెప్పడంతో వాళ్ళు ఇంటికి బయలుదేరారు.

రెండు రోజులు గడచిపోయాయి. కానీ ఆమె ఒక్కసారి కూడా కళ్లు తెరచి చూడలేదు. రాజశేఖరానికి ఏమీ పాలుపోలేదు. దాదాపు రెండు రోజులు వెంటిలేటర్స్ మీద ఉన్న వ్యక్తి కోలుకొంటుందనే నమ్మకం క్షణక్షణానికీ క్షీణిస్తున్నది. అక్కడి డాక్టర్ల పరిధి దాటిపోయిందని అర్థమవుతున్నది. కానీ కదిలించే అవకాశం ధైర్యం కనబడడం లేదు. ఏదో జరుగుతుంది అన్న భయం అందర్నీ చుట్టుముట్టింది. డాక్టర్లు కూడా అక్కడే ఉంచమని గానీ, వేరేచోటికి తీసుకుపొమ్మని గానీ చెప్పగలిగే పరిస్థితిలో లేరు. మూడో రోజు డాక్టర్లు తమ ప్రయత్నాలన్నీ విఫలమైనాయని ఇక ఉపయోగం లేదని చెప్పారు. ఆ వార్త వినడంతో రాజశేఖరం బిడ్డలు కుప్పకూలి పోయారు. చివరి ప్రయత్నంగా చెన్నైకి తీసుకపోవడానికి డాక్టర్లను సంప్రదిస్తే, "అక్కడ కూడా ఎవరూ చేయగలిగింది ఏమీ ఉండదు" అని ఖచ్చితంగా చెప్పడంతో రాజశేఖరం ఆశలు అడియాసలయినాయి. దాంతో నాలుగోరోజు ఇంటికి తీసుకువచ్చి జరగాల్సిన చివరి ప్రయాణ కార్యక్రమాలను జరిపించారు.

* * * * *

# 5

రాజశేఖరం బయట వరండాలో ఈవైపు నుండి ఆ వైపుకు సాయంత్రం నడక సాగిస్తున్నాడు. సాయంత్రం పూట నడిస్తే శరీరభాగాల కదలికతో కొంచెం వ్యాయామం చేస్తున్నట్టుంది. నడుస్తున్న రాజశేఖరానికి ఒకవైపు గతం గుర్తుకొస్తున్నది. మరొక వైపు భవిష్యత్తు భయపెడుతున్నది. తాను గతంలో చేసిన తప్పులకు ఈనాడు పశ్చాత్తాపపడుతున్నట్టు అనిపిస్తున్నది. తన తండ్రి ధర్మయ్య తనకు మంచి చదువు చెప్పించి, ఊరి సరిహద్దుల్లో ఉన్న ఐదు ఎకరాల భూమిని ఇచ్చి పోయాడు. అమ్మానాన్న ఆ ఐదు ఎకరాల్లో వరితో సహా, కూర నార వేసి రోజంతా కష్టపడి తనను చదివించారు. అవసరమైతే తప్ప కూలివాళ్ళను పిలుచుకునే వాళ్లు కాదు. తాను ఇంటర్ వరకు ఆ ఊరిలోనే చదివి, బి.ఏ., ఎం.ఏ. ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌన్‌లో చదివాడు. ఒకరకంగా చెప్పాలంటే శ్రద్ధగా చదివి పోటీ పరీక్షల్లో పాసై కమర్షియల్ టాక్స్ ఆఫీసులో ఉద్యోగం సంపాదించాడు. రాను రాను తన తెలివి తేటలతో పనితనంతో త్వరత్వరగా ప్రమోషన్లు సంపాదించాడు. తన ఊరు బాగా అభివృద్ధిచెందుతూ తాను ఇంటర్‌లో ఉన్నప్పుడే తాలూకా హెడ్ క్వార్టర్స్ అయ్యింది. అప్పటినుండి ఊరు చుట్టూ అనేక పరిశ్రమలు, వ్యాపార సంస్థలు రావడంతో బాగా పెరిగి పెద్ద టౌను అయ్యింది. రాజకీయ కారణాలతో చివరకు జిల్లాగా విడదీసి హెడ్‌క్వార్టర్స్‌గా చేశారు.

మంచి చదువు ఉద్యోగం ఉన్న కారణంగా తల్లిదండ్రులకు కొద్దిపాటి ఆస్తి ఉన్నా అందరికీ ఆమోద యోగ్యమైన కుటుంబంగా ముద్రపడింది. ఆ కారణంగా వూరిలో తమకంటే హెచ్చు స్థాయిలో ఉండే రైతు కుటుంబంలో ఉన్న అమ్మాయిని తనకు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. పైపెచ్చు తాను మంచి రూపురేఖలతో

చూడముచ్చటగా ఉన్న కారణంగా ఎంత కట్నమైనా ఇవ్వడానికి సంసిద్ధమై అనేక పర్యాయాలు రాయబారాలు జరపడం జరిగింది. చివరకు తల్లిదండ్రుల తాపత్రయాన్ని కాదనలేక తన అంగీకారాన్ని తెలిపాడు.

చివరకు అందరి అంగీకారంతో, విమల రాజశేఖరం వివాహం ఘనంగా జరిగి పోయింది. రోజులు గడిచేకొద్దీ తన సంపాదన, అత్తవారింటి నుండి అందిన సహాయం అన్నీ కలిపి ఒక ఇల్లు కట్టుకోవడం జరిగింది. పైపెచ్చు తల్లిదండ్రులు ఇచ్చిన భూమిని పది ఎకరాలుగా చేసి తోటగా అభివృద్ధి చేశాడు. వీటితో కూడా సంతాన సంపద కూడా పెరగడం మొదలైంది. ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె కలిగారు. అత్తవారి అండతో, పలుకుబడితో కొన్ని నెలలు ట్రాన్స్‌ఫర్ మీద వేరే ఊళ్ళకు వెళ్ళినా మరలా ఆ వూరిలోనే మరొక ఆఫీసులోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని అక్కడే ఉండడంతో ఏ సమస్యా లేకుండా గడిచిపోయింది. ఇంతలో ప్రమోషన్ మీద ఆలూరు జిల్లాకు బదిలీ అయ్యింది. ఊరిలో భూమిని కోటయ్య చేతిలో పెట్టి, ఇంటిని బాడుగకు ఇచ్చి అమ్మా నాన్నతో ఆలూరులో బాడుగ ఇంట్లో కాపురం పెట్టాడు. కొన్ని నెలలు సక్రమంగానే జరిగింది. ఇంతలో అమ్మ ఆరోగ్యం దెబ్బతిన్నది.

డాక్టర్లు మంచి ఆహారం విశ్రాంతి అవసరమని గట్టిగా సలహా ఇచ్చారు. ఇంతకాలం వంటవార్పు అమ్మ చూసుకుంటున్నది. అలాంటిది ఆ భారమంతా ఇప్పుడు తన భార్య విమల మీద పడ్డది. పుట్టింట్లో పెద్దగా వంటపనులు చేసే అలవాటు లేని ఆమెకు అత్తమామలకు, పిల్లలకు, వచ్చిపోయేవాళ్ళకు మర్యాదలు చేయడం ఇబ్బందికరంగా తయారయ్యింది. దాంతో విమలకు విరామం లేకపోవడంతో అందరి మీదా చిరాకు పడడం ఆమాట ఈమాటతో అత్తమామలను భర్తను దెప్పిపొడవడం ప్రారంభించింది. అప్పటికీ ఆఫీసు వాళ్ళు ఇంట్లో పనిచేయడానికి వంటావార్పుకు వంటమనిషిని నియమించడం జరిగింది. అయినా పని అలవాటు లేని వాళ్ళకు చిన్నపని కూడా చాలా కష్టంగా ఉంటుంది. పని చేసే వాళ్ళు పెద్ద పనిని కూడా చిటికెలో చేయగలమని నమ్మకంతో ముందుకు సాగుతుంటారు. పైపెచ్చు రాజశేఖరం అమ్మ వంటచేయడం మానిన తర్వాత విమల వంట ఎవరికీ రుచించడం లేదు. అయినా విధిలేదన్నట్టు అందరూ సర్దుకుపోతున్నారు.

రాజశేఖరం తల్లిదండ్రులకు తమ ఊరిలో స్వతంత్రంగా బ్రతికి చివరి దశలో బానిసల్లా బతుకుతున్నామన్న భావన కలుగుతున్నది. రోజురోజుకూ మనసులోనే కుళ్ళిపోతున్నారు. కాని పైకి చెప్పుకునే ధైర్యం లేదు. పైగా ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. చివరకు భార్యాభర్తలు కూడా ఒకరితో ఒకరు కులాసాగా కబుర్లు చెప్పుకోవడానికి వీలుకావడం లేదు. ఇంట్లో పిల్లా పీచుతో ఏకాంత ప్రదేశం దొరకడం లేదు. ఒక్కోసారి రాత్రిళ్ళు కూడా ఇద్దరూ చెరొకచోట పడుకోవాల్సిన పరిస్థితి వస్తున్నది. జీవితమంతా ఇద్దరూ ఒకే ఇంట్లో ఉంటూ, కలిసి తిని, పక్కపక్కనే పడుకునే పరిస్థితి నుండి జరిగిన మార్పును స్వీకరించేందుకు మనస్సు అసలు అంగీకరించడం లేదు. కానీ, ఏమీ చేయలేని పరిస్థితి. వాళ్ళిద్దరికి కొడుకు కోడలు, మనుమలు మనుమరాలుతో సుఖంగా జీవితం గడుపుతున్నట్టు అనిపించడం లేదు.

దినదినానికీ మానసిక ఒత్తిడి పెరిగిపోవడం కారణంగా అనారోగ్యం ముదురుతోంది. వంట మనిషి ఉందన్న సాకుతో కోడలు పుట్టింటికి, స్నేహితుల ఇంటికి పోవడం. పెళ్ళి పేరంటాలకు వెళ్ళి కాలక్షేపం చేయడంతో ఇంటి పనులు చూచేందుకు తీరికలేకుండా పోతున్నది. ఇంట్లో ఎవరు ఎలా ఉన్నారనేది విచారించే పరిస్థితి కనపడడం లేదు. కుమారుడు రాత్రి 8 గంటలపైన గానీ ఆఫీసు నుండి రాడు. వచ్చాక తల్లిదండ్రులతో భోంచేశారా, మాత్రలు వేసుకున్నారా అన్న రెండు మాటలు మొక్కుబడిగా అడిగి తన రూములోకి వెళ్ళడం తప్ప మరొకమాట వినే అవకాశం లేదు. వాళ్ళతో ముచ్చటించే సమయము సందర్భము లేదు.

ఉదయం 8 గంటలకు రూము నుండి బయటకు వచ్చి టిఫెన్ తినడం గబ గబా ఆఫీసుకు పోవడం రాజశేఖరం దినచర్య. ఆదివారం కూడా పోతే ఆఫీసుకు, లేకుంటే స్నేహితుల ఇంటికి లేదా తన ఊరులో తోట సేద్యాన్ని చూడడానికి వెళ్ళడంతో కాలం గడచిపోతున్నది.

రాజశేఖరం తండ్రి ధర్మయ్య ఒక ఆదివారం గది నుండి బయటకు వచ్చిన కుమారునితో కొంచెం మాట్లాడాలని అడిగాడు. ఏమిటన్నట్టు రాజశేఖరం చూచాడు. ధర్మయ్య "నాన్నా! మాకిక్కడ ఏమీ పొద్దుపోవడం లేదు. ఈ వాతావరణం సరిపోవడం లేదు. మన ఊరిలో ఉన్న వసతులు ఇక్కడ లేవు. ఎందుకో ఈ గాలి నీళ్ళు పడడం

లేదు. అమ్మకు అక్కడికి పోతే ఆరోగ్యం కుదుటపడుతుందనిపిస్తున్నది. మాకు ఊరికి వెళ్ళాలని ఉంది. మీ అమ్మ చాలా పట్టుబడుతున్నది. పైపెచ్చు మేము మీకు బరువే కాని ఎలాంటి సహాయానికీ పనికిరావడం లేదు. మా కోసం ఊరిలో ఇల్లు ఖాళీ చేయించాల్సిన అవసరం లేదు. మేము తోటలో ఉండే ఇంట్లోనే వుంటాము. అక్కడెలాగూ కోటయ్య, రాణి ఉన్నారు కదా! మాకు తోడుంటారు. అక్కడ మాకు బాగా కాలక్షేపం అవుతుంది. మామీద దయ ఉంచి మమ్ములను అక్కడకు చేర్చు. నా మాటలు నీకు కష్టం కలిగిస్తాయని నాకు తెలుసు. అయినా కూడా ఇది తప్పదనిపిస్తున్నది. కొంతకాలం ఇలానే ఉంటే మీ అమ్మ నాకు దక్కదు. దయచేసి మా బాధను అర్థంచేసుకో" అన్నాడు.

"ఇప్పుడు మీకు వచ్చిన ఇబ్బంది ఏముందని మీరు అక్కడకు వెళ్ళాలని అనుకొంటున్నారు, అమ్మకు ఆరోగ్యం బాగాలేదు. అక్కడ మిమ్ములను ఎవరు చూస్తారు!" అన్నాడు రాజశేఖరం.

"అలా అంటావేం నాయనా! మమ్మల్ని చూడ్డానికి అక్కడి చేలు, చెట్టు, పుట్టా, గొడ్డు, గోదా లేవా! కోటయ్య, రాణి లేరా! పైగా మన పుల్ల ఆవు ఈ నెల్లో ఈనుతుంది. మేము కనపడకపోతే అది దిగులుపెట్టుకుంటుంది. నీవు ఎన్ని చెప్పినా మా జీవితాలకు అక్కడే సుఖంగా ఉంటుంది. చావైనా రేవైనా మాకు అక్కడున్న వసతి ఆనందం ఇక్కడ రాదుకదా! నేను చెప్పిన మాట విను. నేను నీ కాళ్ళకు మొక్కుతా. మీ అమ్మ ఇక్కడ ఇమడలేక ఉంది" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

తండ్రి మాటలను పరిస్థితిని చూచి చలించాడు రాజశేఖరం. పైగా తనకు కూడా తెలుసు. తల్లిదండ్రులను పలకరించేవాళ్ళు ఇక్కడ లేరు. అక్కడ అనేకమంది వచ్చి పోతుంటారు. ఎంతోమంది తెలిసినవాళ్ళుంటారు. ఇక్కడ వారికి ఏకాంతం లేదు. పైపెచ్చు తనకు తీరికలేదు. ఆఫీసర్ అయిన నాటి నుండి తనకు పని వత్తిడి ఎక్కువయ్యింది. తాను ఈనాడు పై వాళ్ళకు కిందవాళ్ళకు వంతెనలాంటి వాడు. భవిష్యత్తులో ఎదగాలంటే ఇప్పుడు కష్టపడక తప్పదు. తన భార్యకు నలుగురినీ కలుపుకొని పోగలిగినంత తెలివితేటలు లేవు. తాను, తనవాళ్ళు తన స్నేహితులు అంతే. పుట్టింట్లో ఏనాడూ బాధ్యతలను మోసి కష్టపడి పనిచేసిన బాపతు కాదు.

ప్రపంచం తెలియని మరబొమ్మ, అప్పటికీ ఒకటి రెండు సార్లు కొంచెం కటువుగా మందలించే ప్రయత్నం చేశాడు. కానీ ఉపయోగం లేకుండా పోయింది. ఒకసారి గట్టిగా మందలించినప్పుడు తనతో ఘర్షణకు దిగి అగాయిత్యం చేయలేదు కానీ ఏడుపుకు లంగించుకొంది. అందుచేత తనను మార్చే ప్రయత్నాన్ని విరమించు కున్నాడు.

రాజశేఖరం తండ్రితో ఏమీ చెప్పలేక "రేపు మాట్లాడదాం" అని అక్కడ నుండి తప్పించుకున్నాడు.

వారం రోజులు గడిచాయి. రాజశేఖరానికి తండ్రి మాటలు గుర్తు కొస్తున్నాయి. అయినా ఏమీ పాలుపోవడం లేదు. ఏం చేయాలో తెలియడం లేదు. అమ్మతో మాట్లాడి సర్దిచెప్పే ధైర్యం లేదు. గతంలో అన్ని విషయాలు నాన్నకు చెప్పలేక అమ్మకు చెప్పుకునేవాడు. కాని, ఇప్పుడు అమ్మతో మాట్లాడాలంటే భయపడుతున్నాడు.

మరో రెండు రోజులు గడిచాక. మేధోసాగర మధనం, ఆలోచన పూర్తయ్యింది. తల్లిదండ్రులను స్వస్థానానికి పంపేందుకు తీర్మానం చేసుకొని అమ్మ నాన్నలతో "మీరు ఇక్కడ ఉండి బాధపడుతుంటే నేను చూడలేను. ఈ వాతావరణానికి మీరు ఇమడలేక పోతున్నారని అర్థమౌతున్నది. నా ఇష్టాఇష్టాలకంటే మీకు కష్టం కలుగకుండా మీ ఇష్టానికి తలవొగ్గాలని తీర్మానించుకొన్నాను. వచ్చే ఆదివారం ఆఫీసు జీపును పిలిపించి మిమ్ములను ఊరిలో దిగబెడతాను. కనీసం మీ కోరికను తీర్చి మీకు మీ సంతోషానికి అడ్డుపడకుండా ఉండడం నాకు మంచిదనిపిస్తుంది" అన్నాడు.

కొడుకు మాట్లాడిన మాటలతో మొగ్గగా ముడుచుకొని ఉన్న మనస్సులు పరిపూర్ణంగా వికసించాయి వాళ్ళ కళ్ళలో మెరుపు, పెదాలపై చిరునవ్వు నాట్యం చేసినట్టయ్యింది.

అమ్మ "చాలా సంతోషం నాయనా! మా మనస్సులను అర్థంచేసుకునే బిడ్డకు నేను జన్మనిచ్చానన్న తృప్తి ఈరోజు నాకు కలిగింది. ఈరోజు మాకు కలిగినంత సంతోషం మరెన్నడూ అనుభవించలేదని చెప్పగలను. నాకు మరలా జన్మ వుంటే

నా కడుపున నువ్వే పుట్టాలని భగవంతుడిని ప్రార్థిస్తాను” అంటూ లేచి రాజశేఖరాన్ని కౌగిలించుకుంది. రాజశేఖరానికి తలతిరిగినంత పని అయ్యింది. ఇంతకాలం వాళ్ళు ఇక్కడ ఉండి ఎంత చిత్రవధ అనుభవించారో అర్థమయ్యింది.

ఆదివారం వచ్చింది. తల్లిదండ్రుల పెట్టె బేడా సామాన్లు అన్నీ జీపులో సర్ది ధర్మయ్య, మునెమ్మ, కుమారుడు ప్రయాణమయ్యారు. గంటసేపట్లో తోటలో ఇంటికి చేరారు. కోటయ్య రాణి సామాన్లు లోపలికి తీసుకెళ్ళారు. వాళ్ళను చూచిన కుక్క ఒకటే అరుపులు. దగ్గరకు వచ్చి పైకి ఎక్కి వొళ్ళంతా నాకి రచ్చ రచ్చ చేసింది. కడుపుతో ఉన్న పుల్ల ఆవు అంబా అంబా అని అరుస్తూ చెంగుచెంగున ఎగరడం వాళ్ళిద్దరి చుట్టూ తిరగడం చేస్తున్నది. ధర్మయ్య మునెమ్మ ఆవును దగ్గరికి తీసుకొని దాని గంగడోలును తడుముతుంటే క్షణాల్లో అది ఈని పెయ్యదూడను ప్రసవించింది. అక్కడున్న వాళ్ళందరూ దూడని తీసి గడ్డిమీద పడుకోబెడితే ఆవు దూడను నాకి శుభ్రం చేయసాగింది.

ఆ ఆవు ప్రసవించేందుకు మునెమ్మ కోసం కాచుకుకూర్చున్నదనిపించింది. లేదా వాళ్ళ తల్లి వచ్చిందని ఎగిరి గంతేయడంలో ప్రసవం అయినట్టుంది. ఇదంతా చూచిన రాజశేఖరానికి వాళ్ళు ఇక్కడ పొందగలిగే ఆనందం తన ఇంట్లో దొరకదని రూఢి అయ్యింది. ఒకరకంగా తాను మంచిపనిచేశాననిపించింది. రెండు గంటలు వాళ్ళ సామాన్లు సర్దుకున్నదాకా చేలో ఉన్న పంటను, చెట్టు చేమను చూచి వాళ్ళ అమ్మ ఇచ్చిన సంగటి కొంచెం తిని తిరుగు ప్రయాణమయ్యాడు రాజశేఖరం.

* * * * *

# 6

రాజశేఖరం గెస్ట్‌హౌస్ బాగా మారిపోయింది. చిన్నదాన్ని పెద్దదిగా జరిపి పైన కూడా మరొక అంతస్తు వేసి అన్నిరూములకు ఏసి పెట్టించాడు. వాకిట్లో పెద్ద వరండాలో ఫాన్ క్రింద కుర్చీలో కూర్చొని కూర్చొని ఉన్నాడు రాజశేఖరం. మధ్యాహ్నం 11 గంటలు అయ్యింది. ఎవరో కార్లో నుండి దిగి వస్తున్నారు. ఈ మధ్య దూరపు చూపు మందగించింది. కాటరాక్ట్ ఆపరేషన్ కొంతకాలం ఆగిచేయాల్సి వస్తుందని డాక్టరు చెప్పారు. వచ్చింది ఆంజనేయులు అని వరండా దగ్గరికి వచ్చేదాకా గుర్తుపట్టలేకపోయాడు రాజశేఖరం.

"రా అంజీ, రా! బహుశా మన జీవితంలో ఇన్నిరోజులు ఒకర్నికొకరు చూచుకోకుండా ఉన్నది ఈ మారే ఇంత గ్యాప్ ఎప్పుడూ రాలేదు. నాలుగు నెలల క్రిందట వచ్చి అమెరికా పోతున్నానని చెప్పావు కాబట్టి ఇంకా వచ్చి వుండవని అనుకున్నాను" అన్నాడు.

ఆంజనేయులు చేతికర్ర సహాయంతో వరండా ఎక్కుతూ, "నా జీవితంలో ఏదో పోగొట్టుకుంటున్నట్టుగా వుంది. మీతో చెప్పిన 10 రోజులకే అమెరికా ప్రయాణం కట్టాను. వెళ్ళేటప్పుడు నేను నాభార్య వెళ్ళాము. కాని ఆరు నెలలు వుండగలిగే ఓపిక నాలో నశించింది. ఆ టిక్కెట్టు క్యాన్సిల్ చేసుకొని వేరే కొనుక్కొని వచ్చేశాను. వచ్చి పదిహేను రోజులయ్యింది. రాగానే జ్వరాన పడ్డాను. నాలుగు రోజుల నుండి కొంచెం మెరుగ్గా వుంది" అన్నాడు.

"అయ్యో! అలా జరిగిందా. నాకొక ఫోన్ కొట్టి మీ అమ్మాయి వాళ్ళయినా చెప్పి వుండచ్చు కదా! బాగా తగ్గావు అంజీ! అందరూ అమెరికాపోయి లావైతే నీవు సన్నబడ్డావు. 12 ఏళ్ళ కిందట పోయినప్పుడు నేను కూడా రెండు నెలలే వున్నాను.

అప్పుడు సెలవులు తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డాను. ఆ కారణంగా నేను అమెరికా శ్రమను ఎలానో తప్పించుకున్నాను. పైగా అప్పుడే ప్రమోషన్ వచ్చింది. ఎలాగైతేనేం అక్కడ నుండి బయటపడ్డాను. అయినా నీకదంతా తెలుసు కదా! మరలా చెప్పడం వయస్సుతో వచ్చే చాదస్తానికి సంకేతం. ఇంతకూ నేను చెప్పదలచింది నేను ఐదు కేజీలు పెరిగాను. మరలా తర్వాత బరువు తగ్గించుకున్నాననుకో" అని అంటున్నంతలో రాజ్యం వచ్చి "ఏం తెమ్మంటారు నాయనా!" అని అడిగింది.

"ఏం కావాలి" అని రాజశేఖరం ఆంజనేయులువైపు చూసి జవాబు కొరకు ఎదురుచూస్తున్నాడు. ఆయన దగ్గర నుండి జవాబు వచ్చేట్టు లేదని రాజశేఖరం "ఆపిల్ ముక్కలు కోసి, నిన్న తెచ్చిన కొత్తరకపు బిస్కెట్లు తీసుకరామ్మా, వాటిని రుచి చూచినట్టుంటుంది. తర్వాత లెమన్ టీ తాగుతాం. సార్ జ్వరం నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు కాబట్టి మజ్జిగ వద్దులే" అన్నాడు.

ఇద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ బిస్కెట్లు, టీ త్రాగారు.

రాజశేఖరం "ఇంతకూ అమెరికా విశేషాలు చెప్పలేదు" అన్నాడు.

ఆంజనేయులు "చెప్పడానికేముంది ఏదో సామెత చెప్పినట్టు, సింగన్న అద్దంకికి పోనూ పోయాడు రానూ వచ్చాడు అన్నట్టు నా అమెరికా ప్రయాణం కూడా ముగిసింది. వెంట తెచ్చుకున్నది, ఏవో గుడ్డలు, సెంట్లు తదితర వస్తువులు. నాకు అవసరం లేనివే. అంతకు మించి మర్చిపోలేని మధురానుభూతులు నెమరువేసుకునేందుకు నా అమెరికా ట్రిప్పులో ఏమీ మిగలలేదు. అదొక మాయా జాల ప్రపంచం. ఉమర్‌ఖయ్యాం పద్యాన్ని దువ్వూరు రామిరెడ్డి తెనిగించినది, – అంతము లేని ఈ భువనమంతా పురాతన పాంథశాల, విశ్రాంతి గృహంబు అందు ఇరుసంజల రంగుల వాకిళుల్...– అది నీకు తెలిసినదే కదా! అలా నా ఉద్దేశ్యంలో అమెరికా వాసుల గృహాలకు కూడా రెండూ వాకిళ్ళు ఉంటాయి. అవి పుట్టుక చావు కాదు, ఒకటి స్వర్గం, రెండోది నరకం. మనం ఏ వాకిలి గుండా నయినా లోపలికి వెళ్ళచ్చు. వెళ్ళిన తర్వాత అవతల వాకిలి నుండి బయటికి రావాలనే కండీషన్ లేదు. వెళ్ళిన వాకిలి నుండే బయటికి రావచ్చు. అలాగే రెండవ వాకిలిని కూడా వాడుకోవచ్చు".

మరలా కొంచెం ఆగి "అక్కడ అన్నీ సమానమే. అందరూ సమానమే. వ్యక్తి స్వాతంత్ర్యము ఉంది. ఎవరికి తగిన పని వారు చేయవచ్చు. పనికి దగిన ఫలితం ప్రతిఫలం ఉంటుంది. సాధారణంగా ఉద్యోగాల ప్రతిఫలాల్లో పెద్ద తారతమ్యం ఉండదు. ఇష్టమైనంత, చేయగలిగినంత పని చేయవచ్చు సంపాదించవచ్చు. అనుభవించవచ్చు. అక్కడా అంతా ఉంటుందనిపిస్తుంది. కానీ ఏమీ ఉండదని మనలాంటి వాళ్ళకు అనుభవంలోకి వస్తుంది".

కమ్యూనిస్టుగా నాకు అనిపించింది ఏమిటంటే.అసలు ఇప్పుడు కారల్‌మార్క్స్ అమెరికాలో పుట్టి పెరిగి జీవిస్తే, 'ఇదే నేను కోరుకున్న కమ్యూనిజం' అంటాడేమో అనిపించింది. ఎందుకంటే అందరూ సమానమే. నైపుణ్యాన్ని బట్టి పని. పనిని బట్టి ప్రతిఫలం. ఇది సోషలిజం. కొన్నింటిలో శక్తిని, నైపుణ్యాన్ని బట్టి పని. వయస్సును బట్టి, అవసరాన్ని బట్టి వేతనం, వసతులు ఉంటాయి. కాబట్టి అమెరికాలో ప్రచ్ఛన్న సోషలిజం, కమ్యూనిజం కళ్ళకు కట్టినట్టుంటుంది.

అందరికీ సమానమైన హక్కులు బాధ్యతలు, పకడ్బందీగా ఉంటాయి. మనలాగా విచ్చలవిడి స్వాతంత్ర్యం కాదు. బాధ్యతా రహితమైన స్వాతంత్ర్యం కాదు. అయితే మా కొడుకు కోడలును చూచినప్పుడు నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ వాతావరణానికి వాళ్ళు అలవాటు పడిపోయి వుండచ్చు. కాని నేను పెరిగిన వాతావరణం, నేను వాళ్ళను పెంచిన గతాన్ని నెమరువేసుకుంటే నాలో ఆవేదన కలిగిందని చెప్పక తప్పదు. వాళ్ళు వారంలో ఐదురోజులు బయట చాకిరి పని చేసి, మిగతా రెండు రోజులు శని ఆదివారాల్లో ఇంట్లో గొడ్డుచాకిరీ చేసు కుంటారు. అదొక వ్యవస్థ.అదొక పద్ధతి". ఆగి ఆగి మాట్లాడుతున్నాడు ఆంజనేయులు.

"మనదేశంలో ఉన్నది, డివిజన్ ఆఫ్ వర్క్ (పని విభజన). అక్కడ పని విభజన లేదు. ప్రతి ఒక్కరూ తమ తమ పనులు వాళ్ళే చేసుకోవాలి. అన్ని పనుల్లో నిష్ణాతులుగా ఉండాలి. అక్కడ నీ గడ్డం నీవే గీచుకోవాలి. నీ జుట్టు నీవే కత్తిరించుకోవాలి, లేకుంటే పెద్దమొత్తం సమర్పించుకొని సెలూన్లకు వెళ్ళాలి. నీ ఇల్లు నీవే చిమ్ముకోవాలి. నీ గుడ్డల్ని నీవే ఉతుక్కోవాలి. నీ కారును నీవే కడుక్కోవాలి. నీ కారును నీవే తోలుకోవాలి. లేకపోతే కనీసం నీ ఆదాయంలో సగం డ్రైవర్‌ను

నియమించుకొని ఖర్చుపెట్టుకోవాలి. నీ ఈత గుంటను (స్విమ్మింగ్‌పూల్) నీవే శుభ్రం చేసుకోవాలి. నీ సామానులు నీవే తెచ్చుకోవాలి. నీ వస్తువులు నీవే మోసుకోవాలి. నీ ఇల్లు నీవే సర్దుకోవాలి. ఓపిక లేకపోతే నీ ఆహారాన్ని బయటి నుంచి తెచ్చుకోవాలి. లేదా పదిరోజుల కిందట చేసి ఫ్రిజ్‌లో పెట్టిన సాంబారు కూరతో సర్దుకోవాలి. నీ గిన్నెలు నువ్వే కడుక్కోవాలి. అంటే అందరికీ అన్నిపనులు తెలిసి వుండాలి (మల్టీ టాస్కింగ్). మన పని మరొకరు చేయాలంటే మనకు మిగిలేది అడుక్కు తినేదానికి బొచ్చ మాత్రమే. మా వాళ్ళు చాకలి పని, మంగలి పని, డ్రైవింగ్ పని, వంటపని, ఇంతెందుకు అన్ని పనులు వాళ్ళే స్వంతంగా చేసుకుంటారు. ఈ పని ఆ పని అని వేరే అననేల, సమస్తం వాళ్ళ అధీనంలో ఉంటాయి. "కారెవ్వరు ఏ పనికీ అనర్హులు" గసబోసుకుంటూ ఆపాడు ఆంజనేయులు.

రాజశేఖరం "ఎన్నిరోజులయ్యింది నీ మాటలు విని. మెదడుకు పట్టిన తుప్పు వదిలిపోయింది. అయినా ఎంత ఉద్రేకం. నేను కూడా అమెరికా వెళ్ళి వచ్చాను, కాని ఇంత లోతైన ఆలోచన రాలేదు. అయినా నీలో కవి హృదయం ఉన్నది కదా? అది ఎక్కడికి పోతుంది! నీవన్నది నిజమే. వాళ్ళ జీవితాలు మనలాంటి వాళ్ళకు ఎబ్బేట్టుగా ఉంటాయి. అయినా వాళ్ళు ఇక్కడి నుండి పోయిన వాళ్ళే కదా! నేననుకుంటాను దేనికయినా ఒకసారి అలవాటు పడితే దాన్నుండి బయటపడ్డం బ్రహ్మ కయినా తరం కాదు. ఇంతెందుకు నా రెండో కొడుకు నితీష్ ఉన్నాడు కదా వాడు రావాలని ఎంతో ప్రయత్నం చేస్తున్నాడు. కాని వీలుకావడం లేదు" అన్నాడు.

ఆంజనేయులు "అది నిజమే!, కానీ మనవాళ్ళు కొంతకాలం అక్కడ ఉన్న తర్వాత మరలా స్వదేశానికి వస్తే, వాళ్ళు జీవితంలో ఓడిపోయినట్టు లేదా స్వార్థచింతనతో అక్కడికి వెళ్ళి డబ్బు సంపాదించుకొని తిరిగి వచ్చినట్టు, అంతమాత్రం దానికి పోవడమెందుకు రావడమెందుకని అందరూ అనుకుంటారనే వెలితి వాళ్ళ అంతరాంతరాల్లో గూడుకట్టుకొని ఉంటుందనుకుంటాను".

కొంచెంసేపు ఆగి మరలా "మనదేశంలో దొరకని వస్తువు ఏమీ లేదు. కొంచెం డబ్బు ఉంటే నలుగురు మనుషులు మనమీద ఆధారపడి వుండేవాళ్ళు,

మనకు సహాయం చేసేవాళ్ళు, మనం వాళ్ళమీద ఆధారపడి ఉన్నామన్న సంతోషంతో ఉండేవాళ్ళతో ఒకరికొకరు తోడుగా వుండడం మనకు మాత్రమే వీలవుతుంది...."

"జంతువులను చూడండి. దేని ఆహారం అదే సంపాదించుకుంటుంది. పక్షిపిల్లలు బహు కొద్దికాలం తల్లిమీద ఆధారపడతాయి. మనం అలా కాదు. మనం బ్రతికున్నంతకాలం బిడ్డలు మనమీద ఆధారపడి వాళ్ళ ధర్మం వాళ్ళు చేయకుండా మనలను సతాయిస్తూ ఉంటారు. చివరకు ఒకవేళ మనం వాళ్ళమీద ఆధారపడే అవసరం వస్తే , వాళ్ళు పగ్గాలు చేతికి తీసుకుంటారు".

"అయినా ఇతర దేశాల పుణ్యమా అని సాంకేతిక పరిజ్ఞానం, విచ్చలవిడితనం వల్ల ఇక్కడ కూడా కొత్త కొత్త వ్యవహారాలు పుట్టుకొస్తున్నాయి. అమెరికాలాంటి దేశాల్లో ఉన్నవారు ఆదేశ పరిస్థితులు, వాతావరణం, చట్టాల్ని బట్టి నడుచుకుంటారు. మనదేశంలో అలాంటి చట్టాలే ఉన్నప్పటికీ ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ దేశంలో చదువుకొని, ఏ దేశం పోని వాళ్ళు కూడా నేడు ఆ దేశాల వాళ్ళను అనుకరించడం, పులిని చూచి పిల్లి వాత బెట్టుకున్నట్టుంది. సరేలే అదంతా ప్రక్కన పెడదాం. నీ ఆరోగ్యం ఎలా వుంది" అన్నాడు ఆంజనేయులు.

"ఫర్వాలేదు, ఏదో నడుస్తున్నది, వయస్సు వచ్చిన పేదవాళ్లకు దారిద్ర్యం బాధిస్తుంది. కాని మనలాంటి వారికి ధన సమస్యలు లేకపోయినప్పటికీ ఒంటరితనం పీడిస్తుంది. నా భార్య ఉండి వుంటే అక్కడినుంచి నన్ను ఇక్కడికి పంపగలిగేవాళ్ళు కాదు కదా! ఆమె లేని కారణంగా, నేను వాళ్ళకు అడ్డమైపోయాను, నన్ను తీసుకొని వచ్చి ఒంటరిగా ఇక్కడ తోసేశారు" అని అంటుంటే.

"నాయనా! ఒంటిగంట కావస్తున్నది. భోజనం చేసి మాట్లాడ్లుకుందురు. మీరు కూడా రండి బాబాయ్!" అన్నది రాజ్యం. నేను ఇంటికి వెళ్ళి పథ్యంగా తింటాను. ఈ మధ్యనే జ్వరాన పడి లేచాను" అన్నాడు.

రాజ్యం "మీకు మీ ఇంట్లో లాగా పొడికూర, చారు, తిరగమోత వేసిన మెంతి మజ్జిగతో మెత్తటి అన్నం పెడతాను. ఇవి ఎలాంటి అపకారం చేయవు. రండి బాబాయ్. మీరు ఇక్కడ భోంచేసి చాలారోజులు అయ్యింది. నాయనకు మాట్లాడే వాళ్ళు లేక దిగాలుగా కూర్చొని ఉంటాడు. తనలో తానే ఏదో మాట్లాడుకుంటాడు.

ఈ రోజు మీరు వచ్చేసరికి మొహంలో ఎంత కళ వచ్చిందో, నాకు తెలుసు. భోంచేసుకొని కొంచెం సేపు విశ్రాంతి తీసుకోండి. తర్వాత మంచి టీ ఇస్తాను. వెళ్ళేటప్పుడు గ్లాసు టెంకాయ నీళ్ళు త్రాగి వెళుదురు. ఇంకేం ఆలోచించవద్దు. త్వరగా భోజనానికి లేవండి. కంచాల్లో వడ్డిస్తున్నాను" అని అక్కడి నుండి వెళ్ళింది రాజ్యం.

ఆంజనేయులు "నీ అదృష్టం కొద్దీ ఈ అమ్మాయి నీ అండ అయ్యింది. అంతా వాళ్ళ అమ్మ పోలిక. ఎంత మంచి గుణం, ఎంత మర్యాద ప్రేమ. భగవంతుడు నిన్ను నీ వాళ్ళకు దూరం చేసినా ఇంత పెద్ద అదృష్టాన్ని కల్పించాడు" అన్నాడు.

"అది నిజమే ఆంజనేయులు! ఈ బిడ్డ లేకపోతే నా జీవితం దుర్భరం అయ్యుండేది. ప్రతిక్షణం కళ్ళలో ఒత్తులేసుకొని నన్ను గమనిస్తూ, నా అవసరాలను నేను హెచ్చరించకుండానే సమకూర్చే ఓర్పు నేర్పు ప్రేమ అన్నీ వున్నాయి. నిజానికి ఆ ఇంటి నుంచి నన్ను పంపి, భగవంతుడు నాకు పెద్ద ఉపకారం చేశాడు అని అనిపిస్తుంటుంది. ఒకవేళ నేను అక్కడ వుండి ఉంటే నేను ఇంత దర్జాగా, సుఖంగా బ్రతికిఉండగలిగే వాడిని కాదు. ఇది నా దురదృష్టంలో అదృష్టం. దీనిని నీచ భంగ రాజయోగము అంటారు" అన్నాడు.

ఇద్దరూ లేచి చేతులు కడుక్కొని టేబుల్ దగ్గర కూర్చొని రాజ్యం ప్రేమతో కోరి కోరి వడ్డించిన రుచికరమైన పదార్థాలను ఇద్దరూ తృప్తిగా భోంచేశారు. కాసేపు ముచ్చట్లాడుకొని చెరొక రూములో ఒక గంట కునుకుతీసి టీ కార్యక్రమం పూర్తిచేశారు.

ఆంజనేయులు రాజశేఖరం నుంచి సెలవు తీసుకుంటూ "ఒకరోజు తీరిక చూసుకొని మన నలుగురు పాత మిత్రులతో ఒకసారి ఇక్కడ కలుద్దామని వుంది. ఏమంటావు రాజశేఖరం" అన్నాడు.

రాజశేఖరం "అంతకంటే భాగ్యం మరేముంటుంది. అందరితో మాట్లాడి ఫిక్స్ చేసి నాకు ఒకరోజు ముందుగా తెలిపితే అన్ని ఏర్పాట్లు చేసిపెడతాను" అన్నాడు. ఆంజనేయులు సెలవు తీసుకొని బయలుదేరాడు.

* * * * *

# 7

సమయం సాయంత్రం నాలుగు గంటలు. ఆషాడ మాసం. ఆకాశం కారు మబ్బులతో నిండివున్నది. గాలి బలంగా వీస్తున్నది. మేఘాలు కురుస్తాయనుకుంటే ఒకవైపు నుండి వచ్చి అవతలివైపుకు పోతున్నాయి. చల్లగాలి వీస్తున్నది. అంటే ఎక్కడో వర్షం పడుతున్నది. నిండుగా గర్భంలో దాచుకున్న నీటిబరువును భరించలేక మేఘం ఎక్కడో వదిలేసి గాలితోకూడా ప్రయాణం చేసినట్టనిపిస్తుంది.

గెస్ట్‌హౌస్ దగ్గరికి కారు వచ్చి ఆగింది. ఆలోచనల నుండి బయటకు వచ్చి, రాజశేఖరం తలతిప్పి చూచాడు. కారులో నుండి సతీష్ దిగుతున్నాడు.

"నాన్నా ఎలా ఉన్నావు. టీ తాగావా! మధ్యాహ్నం మాత్రలు వేసుకున్నావా? రాత్రిళ్ళు బాగా నిద్రపడుతున్నదా! అని ప్రశ్నల వర్షం కురిపించాడు. రాజశేఖరానికి కుమారుడు ప్రశ్నలను మూటకట్టుకొని తనకు అప్పజెప్పినట్టయ్యింది.

రాజశేఖరం "బాగా ఉంది నాయనా!" అని కోడలు, మనవడు, మనవరాల యోగక్షేమాలను గురించి పేరు పేరున అడిగాడు".

సతీష్ "అందరూ బాగున్నారు" అనిచెప్పాడు. "టీ తాగుతావా" అని అన్నాడు రాజశేఖరం. సతీష్ మనస్సు వేరే ఆలోచనలతో ఉండి జవాబు చెప్పలేదు.

"నీవు త్రాగుతానంటే నీ సాకుతో నేను కూడా త్రాగుదామని" అంటూ జవాబుకు ఎదురుచూడకుండా "రాజ్యం! నాకూ సతీష్‌కు టీ బిస్కెట్లు పట్రా".

రాజ్యం వచ్చి సతీష్‌తో "బాగున్నారా! అమ్మ పిల్లలు అందరూ కులాసానా" అని అడిగింది.

"నాయనా! మీరు ఏదో ఒక సాకుతో టీలు కాఫీలు త్రాగడం ఎక్కువవు తున్నది" అన్నది రాజ్యం. "మీకు టెంకాయ నీళ్ళు లేదా మజ్జిగ గాని ఇస్తాను" అన్నది. ఎవరూ ఏమి మాట్లాడలేదు.

సతీష్ బాబుతో "బాబుగారు!, నాన్నగారి ప్రొటినెక్స్ అయిపోయింది. పాలతో ఇస్తే మంచిదని డాక్టరు గారు చెప్పారు. నిన్నటితో అది అయిపోయింది. ఫోన్ చేసి రామయ్య మేనేజర్‌తో చెబుదామనుకున్నాను" అని ఇంకా ఏదో చెప్పబోతుంటే సతీష్ అందుకొని "నాకు ఫోన్ చేసి ఉండవచ్చు కదా!" అని అన్నాడు.

"చెప్పాను కదా బాబు మర్చిపోయాను. ఈరోజు మన ఎద్దులు రెండు తప్పిపోయాయి. వాటిని వెతికించే గొడవలో మిగతావన్నీ మర్చిపోయాను. మా నాన్న ఇంకా రాలేదు. వాటిని తోలుకొని వస్తున్నారు. ఉండండి క్షణంలో మీకు టీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది.

ఒక నిముషం కదలకుండా కూర్చున్న సతీష్ నిదానంగా లేచి ఏదో పని వున్న వాడిలా ఇంట్లోకి వెళ్ళాడు. వంటింట్లో టీ పెడుతున్న రాజ్యాన్ని పలకరించాడు. "ఎంతసేపు, టీ, కాఫీ, టెంకాయ నీళ్ళు తప్ప ఇంకేమీ ఇయ్యవా"? అన్నాడు.

"ఏం కావాలంటే అది చేసి పెడతాను బాబుగారు! మీరు అడగాల గాని మీకు లేంది ఏముంది. ఇదంతా మీదే కదా!" అన్నది.

సతీష్ "నిజమే. ఇదంతా మాదే. ఈ భూమి, చెట్లు, తోటలు, పండ్లు, ఇండ్లు అన్నీ మావే. నీవు తప్ప మిగతా అంతా మాదే. ఎన్ని వుంటే ఏం? మనిషికి తనకు కావాలిసింది దక్కనప్పుడు ఈ వూరంతా రాసిస్తే కూడా దాని విలువ గడ్డిపోచకు సమానం కాదు. ఆలోచించు. నీవే చెప్పు. నేను తప్పు మాట్లాడితే నీకిష్టమొచ్చిన శిక్ష వెయ్యి. నేను అనుభవించేందుకు తయారుగా ఉన్నాను" అన్నాడు.

రాజ్యంకు అర్థమైంది. ఇంతకు పూర్వం తగిలీ తగలకుండా పైపైనే మాట్లాడేవాడు. ఏదో తమాషాకు అనుకున్నది. కానీ ఈరోజు ఇంత గట్టిగా, వివరంగా అరటిపండును వొలిచి చేతిలో పెట్టాడు. అసలు ఈరోజు సతీష్ పెద్ద ప్లాను వేసుకొని రిహార్సల్ చేసుకొని వచ్చాడు. ఈరోజు ఎలాగైనా తన మనస్సును రాజ్యం ముందర పరచి తన అంగీకారాన్ని పొందాలని అనుకొన్నాడు. ఇంతలో టీని కప్పులలో పోసి నాలుగు బిస్కెట్లు ట్రేలో పెట్టుకొని ట్రేతో గబగబా రాజశేఖరం దగ్గరకు నడిచింది. వెనుకనే సతీష్ రాజ్యాన్ని అనుసరించాడు. ట్రేను టేబుల్ మీద

పెట్టి బిస్కెట్ టీ రాజశేఖరానికి అందించి "తీసుకో నాయనా!" అన్నది. రెండో కప్పును సతీష్‌కు అందించి "తీసుకోండి" అని కొంచెం దూరంగా నిలబడింది. ఇద్దరూ టీ తాగడం పూర్తి అయ్యాక ట్రే తీసుకొని వంటింట్లోకి వెళ్ళింది రాజ్యం.

సతీష్‌కు మనస్సు బాగాలేదు. తాను ఈరోజు ఎలాగైనా రాజ్యంతో మాట్లాడి ఆమె సుముఖంగా ఉన్నదన్న వార్తను విని ఆనందడోలికలలో తేలియాడాలని వచ్చాడు. కాని రాజ్యంలో ఎలాంటి చలనం కనబడలేదు. అన్నీ తాను ఊహించిన దానికి విరుద్ధంగా జరిగాయి. అసలు వాళ్ళ నాన్న లోపల పడుకొని ఉంటాడని లేదా టీవి చూస్తుంటాడని రాజ్యంతో మాట్లేడే అవకాశం చిక్కుతుందని వస్తే ఆయన వరండాలో కూర్చొని ఉన్నాడు. అయినా తాను లోపలికి పోయి రాజ్యం మనస్సును కదిలించేందుకు ప్రయత్నం చేశాడు.

కాని రాజ్యం మనస్సు రవ్వంత కూడా కదిలినట్టు కనబడ్డం లేదు. పెద్దాయన తన మనుమడు, మనువరాల్ని గురించి వాళ్ళ చదువు సంధ్యలు, ఆటపాటలను గురించి వాకబు చేశాడు. అన్ని ప్రశ్నలకు ముక్తసరిగా జవాబు చెప్పాడు. సతీష్‌కు మనసు మనస్సులో లేదు. మతి స్థిమితం తప్పుతున్నది. ఏదో ఒక ఆరాటం వెంటాడుతున్నది. ఇక అక్కడ ఉండడం అనవసరం అని అనిపించి ఇక ఉంటానని కారు దగ్గరకి పోయి, "రాజ్యం! నేను వెళుతున్నాను, బై" అనిచెప్పి కారు కదిలించాడు.

రాజశేఖరానికి సతీష్ ఆలోచన అర్థమయ్యింది. అందుచేత మనస్సు కలవర పడసాగింది. తనకు తెలుసు ఇది ఈరోజుతో పోదని. శరీరానికి గాయం అయితే కొన్ని రోజులు ఏదో ఒక వైద్యంతో దానిని మాన్పి వేయవచ్చు. కాని మనస్సుకు గాయం అయితే అది పెద్ద రణమై దాన్ని మాన్పడానికి ప్రేమను పండించుకోవడం తప్ప వేరే మార్గం దొరకదు. ఇలాంటి ఆలోచనలతో రాజశేఖరం పెద్ద సందిగ్ధంలో పడ్డాడు. ఎవరికి ఏం చెప్పాలి? తాను నోరు తెరిస్తే వాళ్ళ దృష్టిలో పల్చబడిపోయే అవకాశం ఉంది. ఆలోచిస్తున్నాడు. తీవ్రంగా తెగని ఆలోచన తరుముతున్నది. గతం తాలూకూ జ్ఞాపకాల దొంతరలతో ఆలోచన పరిగెడుతున్నది.

గంట ఎనిమిదయ్యింది. కోటయ్య ఇంకా రాలేదు. రాజ్యం వచ్చి "నాయనా! భోజనం ఇక్కడికి తీసుకొని వచ్చేదా? లేక డైనింగ్ టేబుల్ దగ్గరికి వస్తారా?" అని అడిగింది.

“ఆకలిగా లేదు కొంచెంసేపు తర్వాత తింటాను. మనసేమీ బాగాలేదు” అన్నాడు.

“అదేంటి! సతీష్ అన్నయ్య వచ్చాడు కదా! అన్ని విషయాలు మాట్లాడలేదా? ఏమైంది. ఏమన్నా అన్నాడా!” అని అడిగింది. రాజశేఖరం, రాజ్యం నోటినుండి ‘సతీష్ అన్నయ్య’ అన్న మాటలతో మనసు పొంగిపోయింది. ఇక ఇబ్బంది లేదులే అనుకున్నాడు. అయినా లోపల సందేహం ఉంది. భారతంలో చెప్పినట్టు స్త్రీ అగ్ని లాంటిది. పురుషుడు నేతి కుండ. రెండూ దగ్గరకు చేరకూడదు. ఒకవేళ చేరితే అగ్నికి నేయి కరిగిపోవడం లేదా అగ్ని జాజ్వల్యమానంగా మండడం జరుగుతుంది అన్న విషయం తెలియని వాడు కాదు రాజశేఖరం. గతంలో తన అనుభవంలో ి నిదే కదా!

రాజ్యం మనసులో, ప్రవర్తనలో ఎలాంటి లోపం లేకపోవచ్చు. కానీ పరిస్థితుల ప్రభావాన్ని తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. దానికి తన జీవితమే ఒక ఉదాహరణ. ఏనాడూ రాణిమీద వేరే దృష్టిలేని తాను ఆ క్షణంలో లొంగిపోలేదా అని ఆలోచించుకుంటున్నాడు. ఏదేమైనా రాజ్యానికి నిజం తెలియచెప్పడం అవసరమనిపించింది. “రాజ్యం ఇటు వస్తావా” అని కేకవేశాడు.

ఇంట్లో ఉన్న రాజ్యం “వస్తున్నా నాయనా” అని అంది. స్నానంచేసి ముస్తాబయి కళకళలాడుతూ వచ్చింది రాజ్యం. “స్నానం చేస్తుండినాను అందుకని ఆలస్యం అయ్యింది ఏం కావాలి నాయనా! చెప్పు. భోజనం తెమ్మంటావా” అని అడిగింది.

రాజశేఖరానికి రాజ్యాన్ని చూస్తుంటే రాణిని చూచినట్టు అనిపించింది. అదే పుటక. కాని రాణి కంటే అందంగా పుట్టింది రాజ్యం. ఏ మగాడికైనా కన్ను చెదరక మానదు. మనసు కరగక పోదు. అని ఆలోచిస్తూ “రాజ్యం! చాలా రోజులుగా నీతో ఒక రహస్యం చెప్పాలని ఉంది. కానీ ప్రతిసారీ చెప్పకూడదని దాటేస్తున్నాను. బహుశా అవసరం రాదని అనుకున్నాను. కానీ ఈనాడు చెప్పకపోతే ఏం జరుగుతుందో అన్న భయంతో చెప్పక తప్పడం లేదు. నీవు గుండె నిబ్బరం చేసుకో. నేను ఎంతో మధన పడి విధిలేని పరిస్థితిల్లో నీకు ఈమాట చెప్పే ధైర్యం చేస్తున్నాను. నామాటలు విని నీవు నన్ను క్షమిస్తావో లేదో కూడా నాకు తెలియదు. అయినా మనిద్దరి

మంచికోరి, ముఖ్యంగా నీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీతో ఈ మాటలు చెప్పే ధైర్యం చేస్తున్నాను” అన్నాడు.

రాజ్యం, “చెప్పండి నాయనా! మీరు ఏమి చెప్పినా నేను కాదనను. ఏమీ అనుకోను. ఆ నమ్మకం మీకుంటే మీరు చెప్పదలచుకున్నది చెప్పేయండి. నేను మిమ్మల్ని అపార్థం చేసుకోను. ఎవరైనా తండ్రిని అపార్థం చేసుకుంటారా?” అన్నది.

రాజశేఖరంకు “ఎలా చెప్పాలో తెలియడం లేదు. ఎంత ధైర్యం చేసినా మాట్లాడేదానికి సిగ్గు వేస్తున్నది. తలెత్తుకొని నీ కళ్ళలోకి చూచి చెప్పే విషయం కాదు ఇది. అయినా తప్పడం లేదు. అందుకని చెప్పడానికి తీర్మానించుకున్నాను” అని పొడిపొడిగా మధ్య మధ్యలో ఆపుతూ మాట్లాడుతున్నాడు రాజశేఖరం.

రాజ్యం ఏమీ మాట్లాడకుండా అలానే వుంది. “ముందు నువ్వు కూర్చో. నిదానంగా చెబుతాను. మంచిగా ఆలోచించు. ఏది ఏమైనా, నామాటలు విన్న తర్వాత నామీద ద్వేషం పెంచుకోవద్దు. నన్ను ఎప్పటిలాగే చూచుకుంటావనే నమ్మకంతో, ధైర్యం చేస్తున్నాను” అన్నాడు.

రాజ్యం “మీరు ఏది చెప్పినా ఫర్వాలేదు. నేను ఏమీ అనుకోను నాయనా! మీ మీద నాకున్న గౌరవం చెరిపితే చెరిగిపోయేది కాదు” అన్నది రాజ్యం.

“నేను ఒక పొరపాటు చేశాను”. కొంచెంసేపు తటపటాయించి, ఆగి “ఒకరోజు సాయంత్రం.... పరిస్థితులు అలాంటివి.... నేను, మీ అమ్మ కలవాలని మా ముఖాల్లో రాసిపెట్టి వుంది....” మరలా కొంచెం ఆగి... “నీవు కూడా నాకు బిడ్డవే. కూడా కాదు. నీవు నా బిడ్డవు. మేమిద్దరం మీ నాన్నకు అన్యాయం చేశాము. అయినా ఆయన ఔన్నత్యం ముందు, హృదయవైశాల్యం ముందు మేము చాలా అల్పులం అయిపోయినాము. మేము చేసిన పాపం తెలిసి కూడా ఆయన మమ్మల్ని పరిపూర్ణంగా క్షమించాడు. ఏనాడూ తనలో ఎలాంటి మార్పును మాకు తెలియ నీయకుండా దాచుకున్నాడు. అది ఆయన ఔదార్యం, గొప్పతనం”.

మరల “మీ అమ్మ చాలా ఉన్నతమైన వ్యక్తి. నీచమైన ఆలోచనలు లేని మంచితనాన్ని మానవత్వాన్ని తన స్వంతం చేసుకున్నది. కానీ తాను బలహీనతతో

లొంగలేదు. విలువైన సంపద కొరకు ఎక్కడో అంతరాంతరాలలో దాగుకొని కరుడుగట్టిన లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి చేసిన ప్రయత్నం అది. దాని ఫలితమే భగవంతుడు మాకు, ముఖ్యంగా నాకు అందించిన వరప్రసాదం నీవు. నిన్ను చూచినప్పుడల్లా నా మనస్సు ఒకవైపు ఉప్పొంగిపోతుంది, మరొకవైపు నా తప్పును గుర్తుచేస్తుంది. నీకు ఊహ తెలియనప్పుడు నిన్ను ఎత్తుకొని ముద్దాడిన క్షణాలు ఇంకా నా కళ్ళముందు మెదులు తుంటాయి. రాణి మనలను వదిలిపెట్టి వెళ్ళడం మన దురదృష్టం. అయినా ఆమె రూపంలో ఉన్న నిన్ను చూసుకోవడం నా అదృష్టం. కానీ నీకు అమ్మలేని లోటు తీర్చగలగినది కాదు" అంటూ తలవంచుకున్నాడు.

రాజ్యం అంతా విన్నది. అలాగే స్థాణువులా నిలబడి ఉంది. తననుండి ఏ స్పందన లేని కారణంగా రాజశేఖరానికి గుండెల్లో దడపుట్టడం ప్రారంభించింది. మరలా రాజశేఖరం "ఇది విని నీవు నన్ను అసహ్యించు కుంటావేమోనని దిగులు. నీతో చాలాసార్లు చెప్పాలనిపించింది. బహుశా జీవితంలో నేను నీకు చెప్పుండే వాడిని కాదేమో! ఒకరకంగా నా కొడుకులు నా అడ్డు తొలగించుకునేందుకు నన్ను ఈ ఫామ్ హౌస్‌లోకి పంపి స్వర్గానికి తలుపులు తెరిచారు. లేకుంటే ఇంత ప్రేమతో నన్ను క్షణక్షణం కళ్ళలో పెట్టుకొని చూచేవారు ఎవరుంటారు. అదే మావాళ్ళ దగ్గర ఉంటే నరకం అనుభవించి ఉండేవాణ్ణి. ప్రతిదానికీ నేను జవాబు చెప్పుకోవలసి వచ్చేది. వాళ్ళ దగ్గరే ఉండి ఉంటే ఈ అదృష్టానికి దూరమై ఉండేవాడిని".

కొంచెం ఆగి "నీకు చెప్పదలచుకున్న విషయం ఏమిటంటే! సతీష్ నీ చుట్టూ తిరుగుతున్నాడని అర్థమౌతున్నది. నేను అంతమాత్రం అర్థంచేసుకోలేనివాడిని కాను. ఐదు సంవత్సరాల నుండి నేను ఇక్కడ ఉంటే నెలకొకసారి కూడా రాని పెద్దమనిషి, అదికూడా పిల్లలను భార్యను పిక్నిక్‌కు తీసుకొచ్చినట్లు తీసుకొచ్చేతత్వం ఉన్న మనిషి, ఇప్పుడు రోజు మార్చి రోజు లేదా రోజూ రావడంతో నా అనుమానం బలపడుతున్నది. నీవు ఎక్కడ పరిస్థితులకు లొంగిపోతావో, నీ జీవితం ఏమౌతుందో అని నేను రాత్రింబవళ్ళు నిద్రపోవడం లేదు. ఇదంతా నీకెలా చెప్పాలో తెలియక సతమతమౌతున్నాను. అందుచేత నీకు 'నీ' 'నా' జీవిత రహస్యాన్ని నీ ముందర పరిచాను".

కొంచెం ఆగి, "నాదొక కోరిక. ఒక్కసారి నా బిడ్డను దగ్గరకు తీసుకోవాలని మనసు ఎండుటాకులా రెపరెప లాడుతున్నది" అని గద్గద స్వరంతో కన్నీరు కార్చసాగాడు.

రాజ్యం దగ్గరకు వచ్చి, తన పైట కొంగుతో కళ్లు తుడిచి కౌగలించుకొని, బొంగురు గొంతుతో, "నేను ఎన్ని రోజుల నుండో ఈ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను నాయనా!" అన్నది. ఇద్దరూ ఒకరినొకరు కౌగలించుకొని రాజశేఖరం రాజ్యం నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

రాజ్యం "ఇప్పుడు మీరు చెప్పిన విషయం నాకు ముందే తెలుసు నాయనా! ఒకరోజు మిమ్మల్ని నేను బాబుగారు అనడం బాగాలేదు. 'నాయనా!' అని పిలిస్తే మీకభ్యంతరమా అని అడిగాను. గుర్తుందా? దానికి మీరు సంతోషంగా తలూపారు. మా అమ్మకు, మీకు మధ్య జరిగినదంతా మా నాన్న నాకు వివరంగా నాలుగేళ్ళ కిందటే చెప్పాడు. పైపెచ్చు ఆ కారణంగా మిమ్మల్ని చిన్నచూపు చూస్తే లేదా కించపరిస్తే తనను చంపినట్టే అని ఒట్టేయించుకున్నాడు. నాకు వయస్సు వచ్చిందని, ఏ సమయం ఎలా వుంటుందో తెలియదని అన్ని విషయాలు అర్థంచేసుకో వలసిన అవసరం ఉందని, ఒకరోజు వివరంగా జరిగిందంతా చెప్పాడు. నీకు తెలియనది కూడా నాకు తెలుసు. మా అమ్మా నాన్న మధ్య ఎలాంటి అపార్థం ఉండకూడదనీ, పైగా మా నాన్న మా అమ్మ ఎంతగానో ప్రేమించుకున్న కారణంగా నిజాన్ని చెప్పుకోకుండా ఉండలేక పోయింది" అన్నది.

"కోటయ్య నాకంటే చిన్నవాడే అయినా ఉదాత్తమైన వ్యక్తి. ఎంతో సహృదయుడు. భార్యకు తాను అందించలేని సంతాన యోగం కొరకు, మీ అమ్మ తృప్తి కొరకు చేసిన త్యాగం సామాన్యులకు వీలయ్యేది కాదు" అన్నాడు రాజశేఖరం.

రాజ్యం కళ్లు తుడుచుకుంటూ "ఇప్పటికే చాలా పొద్దుపోయింది. భోజనం తెస్తాను ఉండండి" అని లోపలికి వెళ్ళి అన్నం కలిపి రాజశేఖరం దగ్గర కూర్చొని నోట్లో ముద్దలు పెట్టి తినిపించింది.

* * * * *

# 8

మూడురోజులుగా ముసారా పట్టి వర్షం ఎడతెరిపిలేకుండా పడుతున్నది. రాజశేఖరం వరండాలో కుర్చీలో కూర్చొని ఉన్నాడు. గడప దగ్గర రాజ్యం గోడకు ఆనుకొని కూర్చుని ఉంటే, లేపి కుర్చీలో కూర్చోమని బలవంతంగా కుర్చీలో కూర్చోపెట్టాడు. ఇద్దరి మధ్య ఆసామి సేవకురాలు అన్న భావం అంతరించిపోయింది. మాట్లాడుకునేటప్పుడు భోజనం పెట్టేటప్పుడు పక్కనే కుర్చీలో కూర్చొంటుంది. తన తండ్రి అన్న భావన ఆమెకు, తన కూతురన్న భావన రాజశేఖరానికి ఒక కొత్త ఆనందాన్ని కలిగిస్తున్నది. అప్పుడప్పుడు కోటయ్య కూడా కూర్చొని వాళ్ళు మాట్లాడుతుంటే వినడం, మధ్య మధ్యన తనకు తోచింది మాట్లాడడంతో అందరిదీ ఒకే కుటుంబ వ్యవస్థగా మారిపోయింది.

రాణి చనిపోయిన నాటినుండి కోటయ్య పనులు చూచుకొని సాయంత్రం ఇంటికి వచ్చి స్నానం చేసుకొని ఏదైనా ఫలహారం తిని, అక్కడికి అర కిలోమీటరు దూరంలో ఉన్న పెద్ద ఈశ్వరాలయం దగ్గరకిపోవడం, అక్కడ ప్రసంగాలు వినడం, భజన కార్యక్రమాలు చూడడం, ప్రదక్షిణాలు చేసి ప్రసాదం తీసుకొని తొమ్మిది గంటలు దాటిన తర్వాత ఇంటిముఖం పట్టడం అలవాటు చేసుకున్నాడు.

రాణి చావు చాలా విచిత్రంగా జరిగిపోయింది. అప్పుడు రాజ్యానికి పదమూడు సంవత్సరాల వయస్సు. ఒకరోజు రాత్రి 12 గంటలకు కడుపులో నొప్పి భరించలేనంత గా వచ్చింది. వంటింటి వైద్యాలు ఎంత చేసినా తగ్గలేదు. ఈలోగా అయ్యగారికి కబురు పంపడంతో హుటాహుటిన హాస్పెటల్లో చేర్చారు. అప్పటికే లోపల ప్రేగు పగిలిపోయినందున చనిపోయిందని చెప్పారు. రాజశేఖరానికి కోటయ్యకు ఆ షాకు నుండి తేరుకోవడానికి ఆరునెలలు పట్టింది. రాజ్యం చిన్నపిల్ల. ఆ బాధను పూర్తిగా అర్థంచేసుకునే పరిస్థితులో లేదు. అమ్మలేదని రోజూ కోటయ్య ఒడిలో పడుకొని

ఏడ్చేది. ఇంటి భారం అంతా రాజ్యం మీద పడింది. తోడుగా పనిమనిషి ఉండడంతో ఇంటి పని చేసుకుంటూ చదువు ఆపకుండా దగ్గరలో ఉన్న కాలేజీలో ఇంటర్ వరకు పూర్తిచేసింది. ఇంటిదగ్గర వసతి లేదని కోటయ్య చదువు మాన్పించాడు. కానీ రాజ్యాన్ని బాగా చదివించాలనే కోరిక రాజశేఖరానికి బలంగా ఉండేది. అయితే బహిరంగంగా ఆమెను పై చదువులకు పంపించే ధైర్యం చేయలేదు. తాను అతి శ్రద్ధ తీసుకోవడం అటు కోటయ్యకు తన ఇంట్లో వాళ్ళకు లేనిపోని అనుమానాలు వస్తాయని మౌనంగా ఉండిపోయాడు. పైపెచ్చు రాజశేఖరానికి ఆదరువు లేకుండా పోతుంది. కోటయ్య లేకపోతే 30 ఎకరాల ఎస్టేటు, దొడ్డి, చెట్టు, చేమ, చేను ఏమి అయ్యుండేవి? కోటయ్యకు తనంతట తాను వెళ్ళాలనే ఆలోచన కూడా లేదు. అయినా ఎక్కడికి వెళ్ళతాడు. 7 సంవత్సరాల వయస్సులో వాళ్ళ నాయనతో వచ్చినవాడు, ఐదు ఎకరాలను తీర్చిదిద్ది, ఇంత పెద్ద ఎస్టేటుగా చేశాడు.

అందుచేత రాజ్యం చదువు సంగతి ఎత్తడం అన్నివిధాలా మంచిదికాదని వదిలేశాడు. అయితే రాజ్యం చదువులో రాణించినా చదువు మాన్పించినప్పుడు, ఏది ఎప్పుడు ఎలా జరుగుతుందో అన్న భావనతో రెండు ఎకరాలు కోటయ్యకు ఇష్టంలేకున్నా తన పేరుతో రిజిష్టరు చేయించాడు.

గతం తాలూకు ఆలోచనలలో ఉన్న రాజశేఖరానికి వర్షపు జల్లుతో ఈ ప్రపంచంలోకి వచ్చాడు. రాజ్యం ఎదురుగా టీ గ్లాసుతో నిలబడి వుంది. టీ అందుకుంటుంటే, రాజ్యం "వర్షానికి చల్లగా వుంది. జలుబు, దగ్గు వస్తుంది. కరెంటు కూడా లేదు. జనరేటర్ వేస్తాను. లోపలికి వచ్చి కూర్చో నాయనా!" అన్నది.

లేదులే, తల్లీ! బయట చల్లదనం, లోపల హాయినిస్తున్నది. లోపల ఎన్ని లైట్లు వున్నా ఈ వాతావరణం ఆనందం ఎలా వస్తుంది? కొంచెంసేపు ఆగి వస్తాలే! ఈ చలిలో ఏమైనా వేడివేడిగా తింటే బావుంటుంది" అన్నాడు.

"ఉల్లిపాయల పకోడీ చేస్తున్నా నాయనా" అన్నది.

వాళ్ళ అమ్మ లాగే తన మనస్సుకు ఏం కావాలో తెలుసు అని అనుకున్నాడు.

"అలాగే లే!" అని అంటూ "సరే! నీతో ఒక విషయం మాట్లాడాలని చాలారోజులుగా ఆలోచిస్తున్నాను. ఎన్నిసార్లు వీలు కుదిరినా ఎందుకో మనసు రేపు మాట్లాడదాంలే అని అంటున్నది. వర్షంలో చాలాహాయిగా వున్నది. అందుచేత ఇపుడు మాట్లాడాలనిపిస్తున్నది" అన్నాడు.

"చెప్పు నాయనా! చెప్పు. మీరు ఏమీ చెప్పినా నేను వింటాను. మీకు సందేహం వద్దు నాయనా?" అన్నది.

"నాకు ఆ నమ్మకం వుంది. నీకు వయస్సు వచ్చింది. ప్రతివాడి కన్ను నీమీదనే వుంటుంది. మనం ఒక రకంగా మారుమూల ప్రాంతంలో వున్నాము కాబట్టి సరిపోయింది కాని అదే టౌన్‌లో వుంటే, నీమీద రాళ్ళు విసిరే వాళ్ళకు లెక్కవుండదు. అందంకంటే ఆడదానికి పెద్ద శత్రువు ఎవరూ వుండరు" అని ఆగి టీ గ్లాసు వంగి క్రింద పెట్టపోతుంటే",

"అదే వద్దన్నది. అలా వంగితే ఎక్కడన్నా ఎముకలు పట్టుకుంటే, ఎంత కష్టం. నేను ఇక్కడే వున్నాను కదా?" అంటూ గ్లాసు చేతికి తీసుకుంది.

"నీకు ఈడు వచ్చింది. నన్ను కాడు రమ్మంటున్నది. ఏ క్షణం ఎలా వుంటుందో ఎవరన్నా కుర్రాణ్ణి చూచి నిన్ను ఒక ఇంటిదాన్ని చేస్తే నా బాధ్యత తీరిపోతుంది. నేను నిశ్చింతగా నా చివరి అంకాన్ని పూర్తిచేసుకోవచ్చు అని ఆలోచిస్తున్నాను".

"ఎవరైనా ఎరిగున్న వాడైతే బాగుంటుంది. నీవు సరేనంటే మీ నాయనతో మాట్లాడుతాను. రేపటి నుండి ఈ పనులు ఎవరికైనా అప్పజెప్పి అబ్బాయిలను వెతికేందుకు పంపాలనుకుంటున్నాను" అన్నాడు.

రోజూ ఆలస్యంగా వచ్చే కోటయ్య ఆరోజు వీళ్ళ మాటల మధ్యలో వర్షంలో వచ్చేశాడు.

"చూచావా? దీనిని ఏమనాలి! ఒకవైపు వర్షం శుభసూచకం. మరొకవైపు రోజూ ఆలస్యంగా వచ్చే మీ నాయన, మాట పూర్తికాక మునుపే రావడం రెండవ శుభసూచకం" అన్నాడు.

కోటయ్య పంచలోకి వచ్చి గొడుగును పక్కన పెట్టి తుండుగుడ్డతో తుడుచు కుంటుంటే,

"మేము నీ గురించి మాట్లాడడం, నీవు ప్రత్యక్షం కావడం రెండూ ఒకేసారి జరిగాయి కోటయ్య!" అన్నాడు.

"నన్ను గురించి మాట్లాడే అంత విషయం ఏముందయ్యా" అన్నాడు కోటయ్య. "రేపటినుండి నీవు సేద్యపు పనులు ప్రక్కన పెట్టి మంచి దుస్తులు వేసుకొని నీకు తెలిసిన ఇలాకాలో ఎవరైనా మన రాజ్యంకి సరితూగే రాజును వెతకాలి. రాజ్యంకు వయసు వచ్చింది, వయసు ముదిరే కొద్దీ మంచి సంబంధాలు కరువౌవుతాయి. ఈ సంవత్సరం ఎలాగైనా పెళ్ళిచేయాలి. ఇంక ఆలశ్యానికి వీలులేదు" అన్నాడు. కోటయ్య ఏమీ మాట్లాడలేదు.

"నేను అంతలా వూదరపెడుతుంటే ఊ అనవు ఉప్పూరాయి అనవు. నీ ఉద్దేశ్యం ఏంది" అన్నాడు.

"నేను అనేందుకు ఏముందయ్యా! అన్నీ మీ యిష్టం. మీరు, రాజ్యం ఏమి చెబితే అదే ఖాయం. నన్నేమి చేయమంటే అది చేస్తాను. అది నా బిడ్డయినా, అంతా మీదే. మీరు మీ బిడ్డకు ఎలా చేయాలనుకున్నారో అలానే చేయండి" అన్నాడు.

కోటయ్యకు తెలియకుండానే అది మీ బిడ్డ అని అర్థం వచ్చేలా మాట్లాడేసరికి రాజశేఖరానికీ, రాజ్యంకీ ఏం మాట్లాడాల్నో తెలియలేదు. ఇంతలో రాజ్యం లోనికి వెళ్ళి వేడి టీ తెచ్చి కోటయ్యకు ఇచ్చింది. కోటయ్య పంచ అంచుకు పోయి నిలబడి టీ తాగడం పూర్తిచేశాడు.

రాజశేఖరం "నీ ఎరుకలో ఎవరైనా అబ్బాయి వున్నాడా కోటయ్య!" అన్నాడు.

"నా కంటూ బంధువులు ఎవరూ లేరు. మన చేలో పనికి వచ్చే సూరిగాడు ఆరు నెలల క్రిందట ఒక పెద్దాయనను తోడుకొని వచ్చాడు. వాళ్ళుకూడా మా కులస్థులే నట. అయినా కులంతో పని ఏముంది. అబ్బాయి ఏదో మంచి చదువు చదివాడట. ఇక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ బడిలో అయ్యవారుగా

పనిచేస్తున్నాడట. పిల్లవాడు బాగుంటాడని అన్నాడు. కాని నేను మా అయ్యగారు హెచ్చరించినపుడు తప్ప ఆ ప్రయత్నం జోలికి పోను అని అన్నాను" అన్నాడు.

"అయితే అలాంటివి నాకు చెప్పకపోతే ఎలా తెలుస్తుంది కోటయ్య, నాకు చెప్పి ఉంటే మన ప్రయత్నాలు మనం చేసేవాళ్ళం కదా!" అన్నాడు రాజశేఖరం.

"నేను ఎన్నడూ ముందుపడి మాట్లాడలేదు కదా అయ్యగారు, ఎప్పుడూ నాకు కావలసినవి మీరే ఆలోచించి ఇస్తున్నారు కదా!  చివరకు ఏనాడైనా నాకు కావలసిన గుడ్డలు నేను కొనుక్కున్నానా, అన్నీ మీరే చూస్తున్నారు కదా! రాజ్యం మీ బిడ్డ కాదా! మీరే ఆలోచించుకుంటారు కదా అని నేను పట్టించుకోలేదు" అని అన్నాడు.

"బాగుంది మిగతా విషయాలు అంటే చిన్నవి. కాని పెళ్ళి అంటే ఒకరు ఇద్దరై జీవితాంతం గడపాల్సిన విషయం. అశ్రద్ధ పనికిరాదు. రేపు సూరిగాడిని నాదగ్గరకు పంపించు. నేను రమ్మన్నానని చెప్పు. ఉదయాన్నే పని ఆపి ముందు నాదగ్గరకి రమ్మను. వాడితో ఈ విషయాలన్నీ ముందుగా చెప్పవద్దు, వాడు వచ్చిన తరువాత నేనే అన్నివిషయాలు మాట్లాడుతాను" అన్నాడు.

"అలాగే అయ్యగారు" అన్నాడు కోటయ్య. రాజ్యం వర్షంగా ఉందని వరండాలో వద్దని భోజనం టేబుల్ మీద వడ్డించి రాజశేఖరాన్ని తీసుకొనిపోయి కూర్చోపెట్టింది. ఆలోచిస్తూ భోజనం తింటున్నాడు.  నాయన మనస్సు భోజనం మీద లేదనీ సాయంత్రం జరిగిన  తనపెళ్ళి చర్చమీద ఉన్నదని రాజ్యంకు అర్థమయ్యింది.

"నాయనా! మనస్సు అన్నంమీద లగ్నంచేయి. నా లగ్నం గురించి మళ్ళీ ఆలోచించవచ్చు" అని తన చేత్తో అన్నం కలిపింది. అప్పుడు కంచం మీద మనసు పెట్టి భోజనం పూర్తిచేశాడు రాజశేఖరం.

"ఈరోజు నేను ఇక్కడే కూర్చొని ఉంటాను. నువ్వు ఇక్కడే భోజనం చేయి. నీకు కంపెనీ ఇస్తాను" అన్నాడు రాజశేఖరం. అందుకు "లేదులే నాయనా! బాబు కూడా ఇంకా భోంచేయలేదు, ఇద్దరం అక్కడే తింటాము. మీరు వెళ్ళి కుర్చీలో కూర్చోండి. నేను వచ్చి మందులిచ్చి పక్క సరిచేస్తాను" అన్నది.

"సరే! అలాగే కానీ" అంటూ లేచి వరండాలో కూర్చొని ఉన్నాడు. వానపడేటప్పటికి చూట్టూ ఉన్న చేలు నీళ్ళతో నిండిపోవడంతో కప్పలు బెకబెక మంటున్నాయి. రాజశేఖరం మనస్సు అనేక ఆలోచనలతో మునిగిపోయింది.

"రేపు పెళ్ళి అయి రాజ్యం అత్తగారింటికి వెళ్ళిపోతే తాను కోటయ్య వంటరిగా మిగిలిపోతారు. వాళ్ళకు వండి పెట్టడానికి ఎవరినైనా తెచ్చిపెట్టుకోవాలి. అయినా రాజ్యం లాగా సపర్యలు ఎవరు చేస్తారు. రాణి లేని లోటును రాజ్యం తీర్చింది. ఒకరకంగా రాణి కంటే అన్నివిషయాల్లో రాజ్యం తెలివిగా ప్రవర్తిస్తున్నది. ఎవరితో ఎప్పుడు ఎలా మాట్లాడాలో చిన్నతనం నుంచే వంటపట్టించుకుంది". ఈ ఆలోచనలతో మనస్సు ఎక్కడో పచార్లు చేస్తుంటే, రాజ్యం ఒకచేత్తో మందులు, రెండో చేత్తో నీళ్ళ గ్లాసు తీసుకుని వచ్చి కుర్చీ దగ్గర నిలబడ్డ విషయం దీర్ఘాలోచనలో పడ్డ రాజశేఖరం గమనించలేదు.

"నాయనా! మీ ఆలోచనలు చాలాదూరం పోయినట్టున్నాయి! నాకు పెళ్ళి అయితే మిమ్మలను ఎవరు చూస్తారు? మీ పరిస్థితి ఎలా వుంటుంది. రాబోయే కష్టాలు ఎలా వుంటాయి. అని ఆలోచిస్తున్నారు కదూ! నాకు తెలుసు" అని అన్నది.

రాజశేఖరానికి చాలా ముచ్చట వేసింది. తన అంతరాంతరాల్లో ఉన్న ఆలోచనలను ఎలా పసిగట్టింది. చిన్న పిల్ల ఇన్ని ఆలోచనలు ఎలా చేయగలుగు తున్నది. రాజ్యం తనలోకి పరకాయప్రవేశం చేసినందుకు చాలా ఆనందపడి పోయాడు. తను అంత తెలివిగా ఉండేందుకు, కారణం తానా లేక రాణా అర్థం కాలేదు. తాను పెద్ద తెలివిగలవాడు కాదని అతని నమ్మకం. కాదంటే, కాలం కూడా కలిసివచ్చింది.

రాజ్యం చేతిలోని మందులు తీసుకొని నోట్లో వేసుకొని నీళ్ళుతాగి గ్లాసు రాజ్యం చేతికి ఇచ్చి, "నా మనసులోని ఆలోచనలు నీకు ఎలా తెలిసింది నాయనా!" అన్నాడు.

"భలే బాగుందే! నేను నాయనా అని మిమ్మల్ని పిలుస్తుంటే, మీరు నన్ను నాయనా అని సంబోధిస్తే ఎవరికి ఎవరు నాయన అవుతారో? ఈ ప్రశ్నకు జవాబు చెప్పు" అన్నది.

మరలా కొంచెం ఆగి, "చాలారోజులుగా నాకొక సందేహం ఉంది నాయనా! నాకు రాజ్యం అనే పేరు ఎవరు పెట్టారు. ఎందుకు పెట్టాలనిపించిందో తెలుసుకోవాలనుంది" అన్నది.

"ఎంతదూరం ఆలోచించావు నాయనా! నీ పేరు మీ అమ్మ పెట్టింది. ఎలాగైనా నా పేరులోని కొన్ని అక్షరాలైనా నీ పేరులోకి రావాలని తపన పడింది. అందుచేత రాజశేఖరంలోని 'రాజ' శబ్దాన్ని, రం లోని 'ం' ని తీసి రాజ్యంగా పెట్టమని కోరితే, కాదనలేకపోయాను" అన్నాడు.

"అయితే నా ఊహ నిజమే అయ్యింది" అన్నది.

మరల కొంచెం ఆగి "మీరనుకున్నట్టు నేను అంత త్వరగా మిమ్మల్ని బాబును వదిలి వెళ్ళను. నన్ను కావాలనుకున్నోడు, ఇక్కడికి వచ్చి ఉండాల్సిందే. నాతోపాటు తాను కూడా మీకు సేవచేయడానికి అంగీకరించాల్సిందే. లేకపోతే అలాంటి సంబంధాన్ని నేను చేసుకోను. మీ తదనంతరం తాను ఎక్కడికి రమ్మంటే, ఏమి చెయ్యమంటే అది చేస్తాను. అలాంటి ప్రమాణాలతో కుదిరితేనే నా పెళ్ళి జరుగుతుంది. అలా కాకపోతే రోజులు ఇలానే గడిచిపోతాయి. కాబట్టి ఉత్తుత్తి ఆలోచనలతో రాత్రికి ఇంకొక నిద్రమాత్ర వేసుకునేట్టు ఆలోచించవద్దు. నేను ఎక్కడికీ పోను. ఈ ప్రదేశం, ఈ వాతావరణం, చెట్లు, నెమళ్ళు, పక్షులు, పశువులు, ఆవు దూడలు, పూలు ముఖ్యంగా మీ ఇద్దరి ప్రేమ అన్నీ వదిలి నేను వేరేచోటికి పోయి ఆనందంగా ఉండగలనని అనుకుంటున్నారా?"

మరలా "రేపు వాళ్ళు వస్తే ఇవన్నీ మనసులో పెట్టుకొని వాళ్ళతో మాట్లాడాల్సి వస్తుంది కాబట్టి మీతో ముందుగా ఈ విషయాలన్నీ చెబుతున్నాను. ఎటువంటి పరిస్థితిల్లో కూడా ఆరు నూరైనా, ఆకాశం బద్దలైనా నేను మిమ్మల్ని విడిచిపోను. అట్లాంటిది జరిగితే నా శరీరం అక్కడ, మనస్సు ఇక్కడ ఉండిపోతాయి. అది మీకిష్టమేనా? నేను ప్రశాంతంగా, సంతోషంగా ఆనందంగా బ్రతకగలనా? నేను అలా వుంటే మీరు ఆనందంగా ఉంటారా?" అని దగ్గరకు వచ్చి రాజశేఖరాన్ని కౌగిలించుకొంది.

రాజ్యం కళ్ళలో నీళ్ళు చూచి రాజశేఖరం చలించిపోయాడు. చేత్తో కళ్ళు తుడిచి "అలాగేలే తల్లీ! నీ ఇష్టప్రకారమే చేద్దాం. నీ కంటిలో నీరుచూచి సహించే శక్తి నాకు లేదు" అని గద్గదస్వరంతో అన్నాడు.

* * * * *

పక్కరోజు ఉదయం సూరి వచ్చాడు. రాజశేఖరం "ఏం సూరీ బాగున్నావా! ఇంట్లో అంతా కులాసానా!" అని అడిగాడు.

"అంతా క్షేమంగా ఉండారయ్యా, మీ దయ ఉన్నంత కాలం మాకే కొరత రాదు" అన్నాడు.

"కోటయ్యతో మన రాజ్యంకు ఎవరో కుర్రాడున్నాడు అని చెప్పావట కదా! వాళ్ళ వివరాలు ఏమిటి!" అన్నాడు.

"సాయంకాలం వాళ్ళ నాయన్ను తోడుకొస్తాను. అన్ని ఇసయాలూ మాట్లాడండయ్యా. నాకు ఎరుకైనంత వరకు చెప్తాను" అని కొన్ని విషయాలు చెప్పాడు.

"సరే అలానే చెయ్యి" అనిచెప్పి వెళ్ళడానికి ఆజ్ఞ ఇచ్చినట్లు సంజ్ఞ చేశాడు. సూరి దణ్ణంపెట్టి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో సూరి ఒక వ్యక్తిని తీసుకొని వచ్చి, "ఈయన గారి పేరు సుందరయ్య" అని ఆ వ్యక్తివైపు చూపించి పరిచయం చేశాడు.

రాజశేఖరం ఎదురుగా ఉన్న కుర్చీ చూపించి "కూర్చోండి" అని అన్నాడు.

"మా అయ్యగారు. ఈ పొలమంతా ఆయనదే. కోటయ్య సిన్నప్పటి నుండి అయ్యగారి వద్దే ఉండాడు. ఆయనకు ఒక కూతురు ఉంది. కోటయ్య మంచిచెడ్డలు అంతా దొరగారే సూసుకుంటారు. అందుకని అన్ని విషయాలు అయ్యగారితో మాట్లాడండి" అన్నాడు.

సుందరయ్య తటపటాయిస్తుంటే, రాజశేఖరం కుర్చీలో కూర్చోమని మరలా చెప్పడంతో సుందరయ్య కుర్చీలో కూర్చొన్నాడు. ఇంతలో రాజ్యం రెండు గ్లాసుల

నీళ్ళు, రెండు గ్లాసుల మజ్జిగ ట్రేలో తీసుకొని వచ్చి, రాజశేఖరానికీ వచ్చిన వ్యక్తికీ ఇచ్చి వెళ్ళిపోయింది. వెళుతూ వెళుతూ రాజ్యం "లోపలికి రా సూరన్నా! నీళ్ళు తాగుదువు కాని" అన్నది.

సూరి ఆమెను అనుసరించాడు. రాజశేఖరం వివరాలు తెలుసుకునేందుకు ఉపక్రమించాడు. సుందరయ్య "నాకు ఇద్దరు మగపిల్లలు పెళ్ళికి సిద్ధంగా ఉన్నారు. ఇక్కడికి వచ్చింది నా పెద్దపిల్లవాడి సంబంధం కొరకు. మాకు రెండు ఎకరాల భూమి, మూడెకరాల మామిడితోట ఉన్నాయి. అబ్బాయి బిఇడి చేసి జిల్లాపరిషత్తు స్కూల్లో మాస్టారుగా పనిచేస్తున్నాడు" అన్నాడు.

సుందరయ్య వాళ్ళ అబ్బాయి ఒడ్డూ పొడుగూ శరీర ఛాయ వివరాలు అన్నీ చెప్పాడు. జేబులో నుండి ఒక ఫోటో తీసి రాజశేఖరం చేతికి ఇచ్చాడు. ఫోటోలో కుర్రాడు బాగానే ఉన్నాడు.

రాజశేఖరం "మీకు అభ్యంతరం లేకుంటే ఈ ఫోటో నాకిచ్చి వెళ్ళితే, మిగతా విషయాలు మరలా మాట్లాడుకుందాము" అన్నాడు. కొంచెం ఆగి, "మీకు మజ్జిగ ఇచ్చినప్పుడు అమ్మాయిని చూచి వుంటారు. ఇక ఆస్తిపాస్తుల విషయం మీరు ఆలోచించాల్సిన అవసరం లేదు. వాళ్ళు ఇక్కడ పాలేరులు అనుకోవద్దు. ఒకమాటలో చెప్పాలంటే తన ఆస్తి కోటిరూపాయలకు పైనే ఉంటుంది. గొప్పలు చెప్పటానికి కాదు. విషయం తెలియాలని చెబుతున్నాను. నేను అన్ని విషయాలు అమ్మాయితో, వాళ్ళ నాన్నతో మాట్లాడి మీకు కబురంపుతాను. మంచిరోజు చూసుకొని అబ్బాయిని తీసుకొని వస్తే, అన్ని విషయాలు మాట్లాడుకుందాము" అని ముగించాడు.

"అలాగే" అని నమస్కారం చేసి సుందరయ్య కదిలాడు. సుందరయ్యను సూరి అనుసరించాడు.

యధాప్రకారం తొమ్మిది గంటలకు గుడి కార్యక్రమం పూర్తిచేసుకొని కోటయ్య ఇల్లు చేరాడు. స్నానం భోజనం ముగించుకొని వచ్చిన కోటయ్యకు సుందరయ్య చెప్పిన వివరాలు అన్నీ చెప్పి, చేతిలో ఉన్న ఫోటోను చూపించాడు రాజశేఖరం. ఫోటోను చూచి "అమ్మాయి ఏమన్నది!" అన్నాడు.

"నీకు చూపకుండా తనకు చూపించడం ఎందుకులే అని చూపలేదు" అని "రాజ్యం" అంటూ కేకవేశాడు.

రాజ్యం వచ్చి ఎదురుగా నిలబడి "ఏం నాయనా! మాత్రలు తెచ్చేదా! వేసుకుంటారా" అన్నది.

"ఎప్పుడూ నీకు నా తిండి, నా మాత్రలు తప్ప వేరే ఆలోచనలు రావు" అంటూ చేతిలోని ఫోటోను రాజ్యం చేతికి ఇచ్చి "ఎలా వున్నాడో చెప్పు" అన్నాడు. ఫోటోను పరీక్షగా చూచి, రాజ్యం "మనిషి ఎలా వున్నాడు అనేకంటే మనసు ఎలా వుందో ముఖ్యం కదా నాయనా!" అన్నది.

"చిన్న పిల్లకు వున్న తెలివి, ఆలోచన మనకు లేదు. మనం ఆస్తి, ఎత్తు, లావు, రంగు, చదువు గురించి ఆలోచిస్తున్నాం. మన తల్లి సంస్కారం ప్రవర్తన గురించి ఆలోచిస్తున్నది. మనకంటే బాగా ఎదిగింది" అన్నాడు కోటయ్య వైపు చూచి.

"అదికాదు నాయనా! రేపు మీ ఇద్దర్నీ చూచుకోవడానికి, అతనికి అభ్యంతరం ఉండకపోగా, అతని సహాయ సహకారాలు నాకు చాలా అవసరం కదా! నేనేమన్నా తప్పు మాట్లాడుతున్నానా?" అన్నది.

కోటయ్య! "అయ్యగారు ఇవన్నీ ఆలోచించరా! ఆలోచించకుండా ఉంటారా! నీవేంది పెద్ద తెలివితేటలున్నట్టుగా మాట్లాడుతున్నావు" అన్నాడు.

"లేదు కోటయ్యా తాను చెప్పినదాంట్లో చాలా లోతైన విషయాలు ఉన్నాయి. వచ్చేవాడు తిండి పెట్టగలడా, ప్రేమగా చూచుకొని తన ఇష్టాలను తీర్చగలడా, ఇబ్బంది పెట్టకుండా చూచుకోగలడా" అని మనం ఆలోచిస్తున్నాము.

తాను మాత్రం మనకోసం ఆలోచిస్తున్నది. తాను చెప్పింది మంచి ఆలోచనే. ఇలా ఆలోచించడం పెద్దవాళ్ళుగా మన బాధ్యత. ఎన్నో జన్మలలో మనం చేసుకొన్న పుణ్యం వలన కాకుంటే, మనల్ని కళ్ళలో పెట్టుకుని చూచుకునే బిడ్డ మనకు ప్రసాదంగా దొరుకుతుందా? భగవంతుడి అనుగ్రహం తప్ప వేరే ఏమీ కాదు" అని ఒక క్షణం ఆగి

"లంకంత ఇంట్లో ఏ మూలన ఉన్నా సరిపోదా, పనికట్టుకుని నేను వాళ్ళకు అడ్డంగా ఉంటానని, ఏదో ఒకటి మాట్లాడుతానని వాళ్ళు నన్ను మూటగట్టి తీసుకొనివచ్చి ఇక్కడ విసిరేశారు. కాని ఈ బిడ్డకు తనకేమి కావలన్న ఆలోచన కంటే మనకేం కావాలో అన్న ఆలోచన ఎక్కువగా ఉంది".

మరలా "తన అందానికీ, ఆస్తికీ, అంతస్తుకూ ఆలోచనకు తగినవాడిని చూడడం మన బాధ్యత అన్నది మనం మర్చిపోకూడదు. రాణి బతికి వుంటే ఈ విషయాలన్నీ తను చూచుకుని ఉండేది కదా! ఆ కారణంగా మనం ప్రతి అడుగు చాలా జాగ్రత్తగా వేయాల్సిన అవసరం ఉంది. ఈనాడు ఈ బిడ్డద్వారా మనకు కల్గిన అదృష్టం ఎంతమందికి ఉంటుంది. నేడు బిడ్డల ద్వారా నరకాన్ని అనుభవించే వాళ్ళను ఎంతమందిని చూస్తున్నాను. వాళ్ళ బాధలు వర్ణించడానికి అలవి కావు. సమాజంలో జరుగుతున్న తతంగంతో నీకు ఎక్కువగా పరిచయం లేదు కాబట్టి నీకు పూర్తిగా అర్థంకాదు. అందువల్ల తన మాటల్ని గౌరవించి మనం తొందర పడకుండా ఆలోచించి ఒక నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉన్నది" అన్నాడు.

ఇవన్నీ నాకెందుకు అన్నట్టు రాజ్యం లోపలికి వెళ్ళి మాత్రలు నీళ్ళు తీసుకొచ్చి రాజశేఖరం చేతికిచ్చింది. రాజశేఖరం మాత్రలు మింగి నీళ్ళు త్రాగి "రెండు రోజుల్లో అబ్బాయిని తీసుకొనివచ్చి అమ్మాయిని చూడమని చెప్పాలనుకుంటున్నాను, అదీ మీకు సమ్మతమైతేనే!" అన్నాడు.

"మరలా అదేమాట అంటున్నారు. మీకిష్టమైతే నాకిష్టం లేకుండా ఎందుకు పోతుంది? మీరు చెప్పడం, నేను చేయడం అంతే అంతకుమించి వేరే ఏదీ ఉండదు" అన్నది.

రాజశేఖరం "ఇంకొక విషయం చెప్పాలనుకుంటున్నాను. ఈ మధ్య కొన్న ఆరెకరాలు తీర్చిదిద్దావు కదా! దాన్ని రాజ్యం పేర రిజిష్టరు చేయించాలి. ఇదంతా పెళ్ళికి ముందే జరిగిపోవాలి" అన్నాడు.

"అంత భూమిని ఆ పిల్లకు కట్టబెడితే మీవాళ్ళు..." అని కోటయ్య ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడు.

రాజశేఖరం "ఇదంతా నా స్వార్జితం. నా యిష్టం వచ్చినట్లు చేస్తాను. అసలు ఆస్తి మొత్తం నాలుగు భాగాలు. ఇద్దరు కొడుకులు, కూతురు, నేను. నా భాగం రాజ్యానికి ఇవ్వాలంటే ఇంకా చాలా ఇవ్వాల్సి వస్తుంది. ఈ వయసులో నన్ను చూస్తున్నది కొడుకులు, కూతురు, కోడళ్ళు కాదు కదా? నన్ను చూస్తున్నది రాజ్యం కదా!, అవన్నీ నేను చూచుకుంటాలే!, అసలు ఇన్నేండ్లు నా తలమనిషిగా ఈ ఆరెకరాలు నీవు సంపాదించినదే! నాది కాదు కదా! గతంలో నేను నీకిచ్చినది రెండు ఎకరాలు మాత్రమే. అది నా ఆస్తి. ఇది నువ్వు సంపాదించింది. ఇంకెక్కడ ఎవరితో ఏమీ మాట్లాడవద్దు. కాదంటే నీ కోరిక మీద నా పేరుతో రిజిష్టరు చేసిపెట్టుకొని ఉన్నాను. ఇప్పుడు తన పెళ్ళి సందర్భంలో నీ ఆస్తిని రాజ్యం పేరుమీదకు మారుస్తున్నాను. ఈ విషయాలు మరెన్నడూ, ఎక్కడా మాట్లాడకూడదు. గోడకు చెవులుంటాయి. దీన్ని ఇక్కడితో ఆపేద్దాం" అన్నాడు. కోటయ్యకు ఇంక మాట్లాడే ధైర్యం చాలలేదు.

* * * * *

మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సుందరయ్య, భార్య, కుమారుడు, సూరి ఫాంహౌస్‌కు చేరారు. ఫలహారాలు, కాఫీలతో మర్యాదలు పూర్తి అయ్యాయి. అన్నింటినీ పనిమనిషి నాగమ్మ, రాజ్యం పూర్తిచేశారు. రాజ్యం అటూ ఇటూ తిరుగుతూ ఉన్నందున ప్రత్యేకంగా కూర్చోబెట్టి అమ్మాయిని చూపించాల్సిన అగత్యం లేకుండా పోయింది. రాజ్యం రమేష్ ఒకర్నొకరు చూచుకోవడం జరిగిపోయింది. అమ్మాయి చక్కగా ఉంది. అబ్బాయి కూడా బాగానే ఉన్నాడు. నిజం చెప్పాలంటే అబ్బాయి కంటే అమ్మాయి ఒక మెట్టు ఎత్తులో ఉందని అందరూ అనుకున్నారు.

రాజ్యం రాజశేఖరంతో ముందుగా చెప్పిన కారణంగా రాజశేఖరం "బాబూ రమేష్! ఏమీ అనుకోకుంటే లోపలికి వెళ్ళి అమ్మాయితో మాట్లాడి మీరిద్దరు ఒకరినొకరు అర్థంచేసుకుంటే మంచిదనిపిస్తున్నది. మిగతా విషయాలు మేము మాట్లాడుకోవడానికి వీలవుతుంది" అన్నాడు.

"అలానే సార్"! అని రమేష్ లేచి నిలబడ్డాడు. రాజ్యం ముందు దారి చూపిస్తుంటే వెనుకనే వేరే రూములోకి అడుగుపెట్టాడు రమేష్. రాజ్యం కూర్చోమని కుర్చీచూపించి తానొక కుర్చీలో ఎదురుగా కూర్చొన్నది. ముందు ఎవరు

మాట్లాడడం మొదలు పెట్టాలో తెలియక కొంచెంసేపు మౌనంగా కిందకు పైకి చూచుకొంటున్నారు. ముసుగులో గుద్దులాట ఎందుకన్నట్టు రాజ్యం ప్రారంభించింది.

"మీ గురించి అన్ని విషయాలు మా నాయన గారు చెప్పారు. మీ చదువు ఆస్తిపాస్తుల గురించి నేను పెద్దగా ఆలోచించడం లేదు. కానీ నాకు కొన్ని బాధ్యతలు నేనే విధించుకొన్నవి ఉన్నాయి. నేను కోటయ్య గారి కూతురిని అయినా రాజశేఖరం గారిని కూడా నాయనలానే చూస్తాను. అందుచేత కోటయ్యగారిని బాబు లేదా నాన్నా అని పిలుస్తూ రాజశేఖరం గారిని నాయనా అని పిలుస్తాను. ఇద్దరినీ తండ్రుల్లాగానే ప్రేమగా చూచుకుంటున్నాను. పెళ్ళి అయిన తర్వాత మీ ఇంటికి వచ్చి కాపురం పెట్టడం నాకు ఇబ్బందికరంగా ఉంటుంది. వేరే విధంగా అనుకోకుండా మీరిక్కడే మాతో ఉండాలి. ఇక్కడ మేమున్న ఇల్లు నా పేరుతో ఉంది. మీకెలాంటి ఇబ్బందీ ఉండదు. మీరు ఎవరికీ ఎలాంటి సపర్యలు చేయవలసిన అవసరం లేదు. నేను మిమ్మెలను మా తండ్రులతో సమానంగా గౌరవిస్తాను" అని కొంచెం ఆగింది.

రమేష్ నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో "నేను లేకుంటే వాళ్ళ జీవితం దుర్భరంగా ఉంటుంది. ఇద్దరికీ వయస్సు అయిపోయింది. రేపు ఎట్లా ఉంటుందో ఎవరికి ఎరుక. అందుచేత నేను ఇలా ఆలోచించాల్సిన అవసరం వచ్చింది. నా ఆలోచన చాలా మంచిది అని నేను మొండిగా మూర్ఖంగా చర్చించడానికి ఇష్టపడడం లేదని, ఇది కేవలం నా సెంటిమెంటు. నేను పుట్టిన లగాయితు వాళ్ళిద్దరి దగ్గరే పెరిగాను. మా అమ్మ నా పదమూడో సంవత్సరంలో చనిపోయింది. అప్పటి నుండి అన్నింటికీ వాళ్ళే అండ అయినారు. ఎలా బ్రతకాలో నేర్పింది వాళ్ళు. నాకు ఏమి కావాలో నేను ఆలోచించే లోగా వాళ్ళు నాక్కావలసినవి తెచ్చి ఇచ్చేవారు. అలాంటి వారిని నిరాశ్రయులను చేసి వాళ్ళ ప్రేమను మర్చిపోతే అంతకంటే కృతఘ్నత ఉండదని నాకనిపిస్తున్నది. ఇక్కడకు మీ ఇల్లు దగ్గరే కాబట్టి, మీరు నేను పోతూ వస్తూ వాళ్ళ మంచి చెడ్డలు చూడవచ్చు. కానీ వారికి నా సేవలు అరకొరగా మిగిలిపోతాయి. పైగా నాకు సంతానం వచ్చేసరికి నా మనస్సులోని ప్రేమాభిమానాల గాలి అటు వీస్తుంది. అటువంటప్పుడు కనీసం నా పలకరింపుకు కూడా వాళ్ళు నోచుకోకపోవచ్చు. ఏంది ఇంత ధైర్యంగా లోతుగా మాట్లాడుతున్నానని మీరనుకో

వచ్చు. కాని ఈ భాషా, భావము సంస్కారము అన్నీ వాళ్ళదగ్గర నుండి వచ్చినవే. నా పదవ తరగతిలో, ఇంటర్‌లో కూడా క్లాస్‌లో మొదటిఐదుగురిలో ఉండేదాన్ని".

మరలా "నన్ను పెద్ద చదువులు చదివించాలని మా నాయన కోరిక. ఒకవేళ ఈ పెళ్ళి జరిగితే మీ సహచర్యంలో దూరవిద్యలో చదువు సాగించాలని ఉంది. ఇక్కడ ఇంటి పనికి, గుడ్డలు ఉతికేందుకు, ఇస్త్రీ చేసేందుకు, వంటకు మనుషులున్నారు. కానీ నాచేత్తో వండి వడ్డించి ఇద్దరికీ దగ్గర ఉండి తినిపిస్తే గాని సంతృప్తి ఉండదు" అన్నది.

రాజ్యం భాషా జ్ఞానం, మానసిక పరిపక్వత, జీవితం మీద అవగాహన, భవిష్యత్తు ప్రణాళికలు రమేష్‌కు నచ్చాయి. తాను ఇంత సుదీర్ఘంగా భవిష్యత్తు గురించి ఏనాడూ ఆలోచించలేదు. తాను చిట్టచివరన ఆకులు, పూవులుగా ఉంటే రాజ్యం కాండము క్రింద ఉన్న తల్లివేరులా అనిపించింది. తను రాజ్యంకు సరితూగ గలడా అన్న అనుమానం వచ్చింది. అయినా పురుష అహంకారం దాన్ని పూర్తిగా అంగీకరించే స్థితిలో లేదు. అందుచేత ఇప్పుడు తన ఆలోచనలకు అవును, కాదని చెప్పే పరిస్థితిలో లేడు.

అందుచేత "మీకు నిర్ధిష్టమైన ఆలోచనలు అభిప్రాయాలు ఉన్నాయి. నీ మాటలు హర్షించదగినవే. కాని నేను మీకు నా అంగీకారాన్ని తెలపడమో తిరస్కరించడమో చేయడానికి సాహసించలేను. నేను నా తల్లిదండ్రులతో చర్చించి వారి అభిప్రాయాలను తెసుకొని ఒక తీర్మానానికి వచ్చి అప్పుడు మీకు ఏ సంగతీ తెలియజేస్తాను" అన్నాడు రమేష్.

"అలాగే చేయండి, అదే మంచిపని. మీరు వేరేవిధంగా చెప్పివున్నా, నేను మీ వాళ్ళతో మాట్లాడి బాగా యోచించి ఒక తీర్మానానికి రమ్మని చెప్పి ఉండేదాన్ని. ఇంతసేపు ఏం మాట్లాడుతున్నారా అని గాబరా పడుతుంటారు వాళ్ళు. ఇక వెళదాం" అంటూ లేచి నిలబడింది.

రమేష్ కూడా తనను అనుసరించాడు. మరలా అందరికీ బత్తాయి రసం ఇవ్వబడింది. "ఇప్పుడే కదా ఫలహారం, కాఫీలు, మజ్జిగలు త్రాగాము" అన్నారు.

"ఈ కాయలు మన తోటలో పండినవి. బాగుంటాయి తీసుకోండి" అన్నాడు రాజశేఖరం.

వాళ్ళు తెచ్చిన పండ్లు, పూలు అమ్మాయికి ఇచ్చి, శుభాశీస్సులు వాళ్ళకు తెలిసిన భాషలో తెలిపి కదిలేందుకు లేచి నిలబడ్డారు. కోటయ్య రెండు సంచుల నిండా వాళ్ళ చేలో తోటల్లో కాచిన కూరలు, పండ్లు, టెంకాయలు సూరిచేత కార్లో పెట్టించి అందరిని సాగనంపారు.

"ఏం తల్లీ! అబ్బాయిని భయపెట్టి మరలా ఈవైపుకు రాకుండా చేసినట్టున్నావే. లోపల్నుంచి బయటకు వచ్చినప్పుడు అబ్బాయి ముఖం చూస్తే నాకు అనుమానం వచ్చింది" అన్నాడు రాజశేఖరం.

"మీతో మాట్లాడిన విషయమే మాట్లాడాను. పైగా తనను వాళ్ళ తల్లిదండ్రులతో అన్నివిషయాలు విపులంగా చర్చించి, అవసరమైతే మీతో మరొకసారి మాట్లాడి ఒక నిర్ణయానికి రమ్మనమని ఎలాంటి సందిగ్ధం లేకుండా చెప్పాను" అన్నది.

"ఇంతసేపు మాట్లాడుతుంటే పాపం ఆ కుర్రాడు ఏమైపోతాడో అని భయపడ్డాను నేను" అన్నాడు.

"అయితే నేను రోజూ మీ ఇద్దరినీ భయపెడుతున్నాను, అనికదూ దీనికి అర్థం" అన్నది.

"లేదులే తల్లీ! ఊరికే తమాషా చేయడానికి సంతోషంతో మాట్లాడే మాటలు మాత్రమే ఇవి" అన్నాడు.

రెండు నెలలు దాటుతున్నది. సుందరయ్య దగ్గర నుండి మాటా పలుకూ లేదు.

రాజశేఖరం "కోటయ్యా! వాళ్ళ దగ్గర నుండి ఏమీ జవాబులేదు. కారణం ఏమై ఉంటుంది!" అని అడిగాడు.

"వాళ్ళు ఏమైనా చెప్పారా అని" నేను సూరిగాడిని అడిగాను, వాడు ఏమీ చెప్పలేదని చెప్పాడు. బహుశా మన అమ్మాయి పెట్టిన కండిషన్లు ఇష్టంలేక ఏమీ చెప్పలేక మల్లగుల్లాలు పడుతున్నారేమో అనిపిస్తుంది" అన్నాడు.

రాజశేఖరం "ఉండొచ్చు. అయినా ఏదో ఒకమాట చెప్పాల కదా! వాళ్ళు చెప్పకుండా మౌనం వహిస్తే మరలా మనం అడగడం నామోషిగా ఉంటుంది" అన్నాడు.

మరలా "చూద్దాం! ఇంకో నెలరోజులు చూచి వేరే సంబంధం విచారిద్దాం. ఏమంటావు?" అన్నాడు.

"మీ ఆలోచనకు నేనెందుకు కాదంటాను. మీరు చెప్పినట్టు చేయడమే మంచిది" అన్నాడు కోటయ్య.

ఈలోగా మన ప్రయత్నం మనం చేద్దా. పెళ్ళీడుకొచ్చిన పిల్ల మన ఇంట్లో ఉందని ఎంతమందికి తెలుసు. మన బిడ్డ ఇల్లుదాటి కదలదు. తనకు ఆ అవసరం లేకపోయే! అలాంటప్పుడు మనం పదిమందికి చెబితే తప్ప తెలియదు. అందుచేత రేపట్నుండి నువ్వు ఆ పనిలో ఉండు. ఏది జరిగినా మన మంచికే కావచ్చు. ఇంతకంటే మంచి సంబంధం రావచ్చు. ఎవరు చూచి వచ్చారు. బంగారు బొమ్మలా ఉండే పిల్లను చూపిస్తే వారు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. వాడబ్బలాంటి సంబంధం తెచ్చుకోగలం. ఆ పిల్ల నీ కూతురనీ నీ దగ్గర పెద్దగా డబ్బు ఉండదనీ, పెద్దగా కట్నం ఇచ్చుకోలేమనీ అనుకొనే అవకాశం కూడా లేదు కదా! అయినా మన అమ్మాయి లాంటి అమ్మాయి, ఆస్తి శీలం కోట్లు కుమ్మరించినా దొరుకుతుందా? కానీలే చూద్దాం. దేశం గొడ్డుపోలేదు. మగ పిల్లవాళ్ళు కదూ అదొక రకం బెట్టు చూపిస్తారు" అన్నాడు.

కోటయ్య కల్పించుకొని "రాజ్యం ఏం మాట్లాడిందో ఏమో? ఇప్పుడే ఇంత గట్టిగా మాట్లాడుతున్నదే, రేపు పరిస్థితులు ఎలా వుంటాయోనని ఆ అబ్బాయి ఆలోచిస్తూంటాడు. ఇంట్లో తల్లిదండ్రులకు అభ్యంతరం ఉండకపోవచ్చు అని నేననుకుంటున్నాను. మీరన్నట్టు ఇంకా కొంత కాలం ఆగుదాం. ఆ తర్వాత మన ప్రయత్నాలు ప్రారంభిద్దాం" అన్నాడు.

"రెండు నెలలు జరిగింది కదా! ఒక్క మాట కూడా ఆవైపు నుండి రాలేదు కాబట్టి, మనం మన ప్రయత్నం విరమించాల్సిన అవసరం లేదు. నేను కూడా రేపట్నుండి ఆ పనిలో ఉంటాను. ఈ సంబంధాలు వగైరాలు చూచే ఒకాయన తెలుసు. రేపు నీకు ఒక అడ్రసు చెబుతాను. నీవు వెళ్ళి ఆయనతో నేను రమ్మన్నానని చెప్పిరా. లేదా ఆయన దొరక్క పోతే ఫోన్ నెంబరు వ్రాయించుకొని రా!. నేను మాట్లాడుతాను" అన్నాడు రాజశేఖరం.

* * * * *

# 9

రాజశేఖరం పుట్టినరోజు పదిరోజులు ఉందనగా తనకు అతి ముఖ్యమైన మిత్రులకు ముందుగా గుర్తుచేసి మరే కార్యక్రమం పెట్టుకోవద్దని చెప్పాడు. గతంలో తన పుట్టిన రోజు 30 – 40 అతిథులతో చాలా ఘనంగా జరుపుకునే వాడు. కానీ భార్య చనిపోయిన నాటినుండి నిలిపివేశాడు.

అయితే ఈ సంవత్సరం పాత పద్ధతిలో కాకుండా, ముఖ్యమైన స్నేహితులతో సరదాగా గడపాలనిపించింది. నెలల కొద్దీ మిత్రులను కలిసే అవకాశం రావడం లేదు. ఆంజనేయులును ఆరు నెలల క్రిందట చూచాడు. మిగతా ఇద్దర్నీ చూచి దాదాపు సంవత్సరం పైబడింది.  చివరకు ఆప్తమిత్రులను కూడా సంవత్సరాల కొద్దీ చూడలేక పోవడం దౌర్భాగ్యం. ఎప్పుడో ఒకసారి ఫోనులో మాట్లాడడం తప్ప ఎదురెదురుగా కూర్చొని కబుర్లు చెప్పుకునే రోజులు పోయినాయి.  అందరూ వయస్సు దాటిన వాళ్ళే. ఎవరూ పెద్దగా బయట తిరిగే పరిస్థితిలో లేరు. అంతకు మించి ఎవరి బాధలు వాళ్ళకు ఉన్నాయి. చెప్పుకుంటే మానం పోయే, చెప్పకుంటే ప్రాణం పోయె అన్న చందాన ఉంది. రోజులు గడిచే కొద్దీ వీళ్ళలో ఎంతమంది రాలిపోతారో.

ఈ మధ్య మరో ఇద్దరు జిగిరీ దోస్తులు కాలధర్మం చెందారు. అప్పుడు కూడా వాళ్ళను చూడ్డానికి తాను పోలేక పోయాడు. ఎందుకంటే వాళ్ళతో తిరుగుతున్నప్పుడు వాళ్ళను చూచిన ఆకారం విన్నమాటలు తాలూకు జ్ఞాపకాలు అలాగే మిగిలి ఉండకుండా  చనిపోయినప్పుడు చూచే దృశ్యం పాత జ్ఞాపకాలను తుడిచిపెట్టేస్తుంది. మనసులో చివరికి అదే నిలబడిపోతుంది. అందుచేత ఆరోజు వెళ్ళకుండా తర్వాత వెళ్ళి వాళ్ళ పిల్లల్ని పలకరించి వచ్చాడు.

* * * * *

రాజశేఖరం తన పుట్టిన రోజుకు కావల్సిన అరేంజిమెట్స్ చేయడంలో ఉన్నాడు. తనకు తెలిసిన క్యాబ్ వాళ్ళకు ఫోన్‌చేసి తన మిత్రుల అడ్రసు లిచ్చి సాయత్రం నాలుగు గంటలకు అందర్నీ ఎక్కించుకొని తీసుకురమ్మని చెప్పాడు. రాజ్యంతో జరగవలసిన కార్యక్రమం వివరాలు చెప్పి వంట చేయడానికి ప్రత్యేకంగా ఒక వ్యక్తిని పిలిపించారు. రాజ్యం నాగమ్మ సలహాల మేరకు వంటాయన అన్ని పదార్థాలు తయారు చేస్తున్నాడు.

సాయంత్రం నాలుగు గంటలకు రాజశేఖరం మిత్రులు అయిదుగురు ఆంజనేయులు, గంగాధరం, సూర్యప్రకాష్, రంగనాథం, నాగరాజు వచ్చారు. అప్పటికే కుర్చీలు, పెద్ద టేబులు, సోడాలు, నీళ్ళు, తినుబండారాలు అన్నీ ఒక దాని తర్వాత ఒకటి వచ్చి చేరుతున్నాయి.

స్నేహితులందరూ ఒకరికొకరు తెలుసు కాబట్టి పరిచయం అవసరం లేకుండా ఒకరి తరువాత ఒకరు రాజశేఖరానికి హ్యాపీ బర్త్‌డే అని జన్మదిన శుభాకాంక్షలు ఒకటికి రెండు సార్లు చెప్పారు.

గంగాధరం "చాలా సంవత్సరాల తర్వాత మరలా నీ పుట్టినరోజుకు కలవడం చాలా సంతోషంగా ఉంది" అన్నాడు.

సూర్యప్రకాష్ "మన మంచి మిత్రులు నగేష్, సదానందం ఇద్దరూ మనమధ్య లేకుండా పోయారు" అంటూ ఆగి "మనంకూడా వాళ్ళని చేరేందుకు తయారవుతున్నాము" అన్నాడు.

"ఎవర్ని ఎప్పుడు పిలిస్తే, అప్పుడు వాళ్ళు పోవల్సిందే కదా! పోకన్ మానదు దేహము ఏ విధమున పోషించి రక్షించినన్, అన్న పద్యాన్ని రాగయుక్తంగా చదివాడు రంగనాథం.

"ఆ విషయాలు ఈ రోజు మాట్లాడుకునేవి కావు. చర్చకు పనికివచ్చే విషయాలు కావు. ఏదైనా జరిగితే ప్రేక్షక పాత్ర వహించి చూడాల్సినవే! ఎందుకులే ఇప్పుడు వాటిని గురించి ప్రసంగించడం. లెట్ అజ్ ఎంజాయ్" అన్నాడు నాగరాజు.

"మనం కోరుకున్నట్టు పుట్టడం, గిట్టడం జరిగితే ఈ ప్రపంచం మానవజాతి లేకుండా పోయి ఉండేది. మన కోరిక ప్రకారం అవి జరగవు కదా! అలాగైతే మన కిష్టం లేని వాళ్లందరిని మనం చంపేసి ఉండేవాళ్ళం. ఆ రీతిలో అందరూ ప్రవర్తించి చివరకు ఒకే ఒక్కడు మిగిలి వుండేవాడేమో! అయినా ఆ ఆలోచన విచిత్రంగా ఉంటుంది" అన్నాడు ఆంజనేయులు.

అటుపోతూ విన్న రాజ్యం "మాట్లాడుకునే దానికి, ఇంతకంటే మంచి విషయాలు మరేవీ లేవా నాయనా!, ఏం కావాలి ఏం తెమ్మంటారు!" అన్నది.

రాజశేఖరం "కాఫీ లేదా కూల్‌డ్రింక్స్ ఏదైనా తాగుదామా" అన్నాడు.

"పండుగరోజు కూడా పాత మొగుడేనా! ఇప్పుడు కాఫీ ఏంది! నాకు, నాగరాజుకు కాఫీలు పనికిరావు. ఉత్సాహం కావాలి. నీవు కావాలంటే నిమ్మరసం సోడాతో కలిపి తాగండి లేదా పళ్ళ రసం పుచ్చుకోండి" అన్నాడు గంగాధరం.

"అలాగే. రాజ్యం! నరేంద్రను మా సంగతి చూడ్డానికి పంపించు అన్నాడు. ఈలోగా ఒక కుర్రాడు గ్లాసులు, విస్కీ బాటిల్, నాలుగు ప్లేట్లలో వెజ్, నాన్‌వెజ్ మంచింగ్ ఐటమ్స్ అన్నీ అమర్చబడ్డాయి. మూడు గ్లాసుల్లో విస్కీ నింపి మిగతా రెండు గ్లాసుల్లో నింపడానికి నిమ్మరసం, బత్తాయిరసం, దానిమ్మ రసం బాటిల్స్ తెచ్చిపెట్టాడు.

రాజశేఖరం తన గ్లాస్‌లో దానిమ్మ రసం పోసుకున్నాడు. సూర్యప్రకాశం బత్తాయి రసం అందుకున్నాడు. నేను దానిమ్మ రసం పోసుకుంటే రుచి వాసన వేరైనా, విస్కీ రంగుతో మ్యాచ్ అవుతుందని నా ఉద్దేశ్యం అన్నాడు రాజశేఖరం. అందరూ చీర్స్ చెప్పుకుంటూ ఫర్ ది హెల్త్, వెల్త్ అండ్ డైలీ స్ట్రెంగ్త్" అన్నాడు గంగాధరం.

"ఇంకా ఏమి స్ట్రెంగ్త్. రోజురోజుకు నీరసం వస్తుంటే" అన్నాడు సూర్యప్రకాశం.

"క్షణక్షణం దిగజారడమే. నీవసలు ఏమీ తీసుకోవడం లేదా? పూర్తిగా మానేశావా" అన్నాడు గంగాధరం రాజశేఖరం వైపు చూసి.

"లేదు! మా ఆవిడ పోయినప్పటి నుండి దాని జోలికి పోలేదు" అన్నాడు

" 'బకం', 'సుఖం', 'పికం', 'బ్రహ్మాస్య', 'రావణ బ్రహ్మాస్య', 'కర్ణస్య', 'కుంబ కర్ణస్య', సప్తాహం డోసు మహిమాం" అన్న దానికి శ్లోకంలా చదివాడు గంగాధరం.

దీనకి అర్థం చెప్పమన్నాడు సూర్యప్రకాష్. "బకమనగా కొంగ. సాధారణంగా మధుసేవ చేసే వాళ్ళు తమ మొదటి రౌండ్‌లో కొంగలా వంగి ఏ గ్లాసులో ఎక్కువ తక్కువలు ఉన్నాయని చూడడం సహజం. రెండవ రౌండ్‌కు వచ్చే సరికి బకం సుఖం అవుతుంది. అనగా హాయిగా ఆహ్లాదంగా ఉంటుంది. మూడవ రౌండ్‌కు వచ్చేటప్పటికి ప్రతివాళ్ళు వేరేవాళ్ళతో పికం అనగా పక్షిలా కిచకిచమని ఆపకుండా మాట్లాడతారు. నాలుగో రౌండ్‌లో బ్రహ్మాస్య అనగా ఎవరు ఏమి చెప్పినా దానికి నిజం సత్యం, భేష్‌గా ఉంది అని బ్రహ్మజ్ఞానులు చెప్తున్నట్టు వింటారు. అంగీకరిస్తారు. ఇక ఐదవ రౌండ్‌కు రావణాసురునిలా క్షణం క్రింద అవునన్న దాన్ని మరలా కాదని ఘర్షణకు యుద్ధానికి దిగుతారు. ఇక ఆరవ స్థితిలో కర్ణునిలా ప్రతివాడు దానం, ధర్మం, త్యాగం చేయడానికి, వరాలు కురిపించడానికి ఉరకలేస్తారు. చివరగా కుంభకర్ణస్య స్థితిలో మాట్లాడడం కొట్లాడడం అన్నీ సమసిపోయి కూర్చున్న చోటనే వాలిపోతారు. ఇది దీని భావం.

ఈ మాటలు వినడంతో అందరూ సంతోషంతో చప్పట్లు కొట్టి గతంలో ఎన్నడూ ఈ కవిత్వాన్ని మాకు వినిపించలేదే అన్నదానికి "నేనూ ఈ మధ్యనే ఒకచోట విన్నాను. దాన్ని మీకు అందించాను" అన్నాడు.

"సూర్యప్రకాశం! ఈ మధ్య నీ కొడుకు కూతురు దగ్గరికి అమెరికా వెళ్ళి వచ్చావు కదా! ఎలావుంది"అన్నాడు గంగాధరం.

"వాళ్లకేమి వాళ్ళు బాగానే ఉన్నారు. అక్కడే ఉండేవాళ్ళకు యే ఇబ్బంది ఉండదు. అలవాటు పడిపోతారు. పంచమీ అంటే ఐదురోజులు ఆఫీసులో పనిచేసి (పాంచ్ దిన్‌కో బానిస) రెండు రోజులు ఇంట్లో పనిచేసుకొని (దో దిన్ కో నౌకరీ) ఖాళీ సమయాల్లో షాపింగు చేసుకొని సుఖంగా జీవితాన్ని గడిపేస్తారు. జీవితంలో వేరేవాళ్ళ కష్టాలను గురించి, కన్నీళ్ళను ఆలోచించేందుకు వాళ్ళకు తీరిక ఉండదు.

అందుచేత ఇతరుల బాధకు స్పందించే తత్వాన్ని వదిలి అద్వైతంలోకి జారుకుంటారు. తీరిక చిక్కితే నిద్రపోతారు. మనకు మాత్రం అదొక గుహ. బాలనాగమ్మ నాటకంలో, మాయల ఫకీర్ తన ప్రాణం చిలకలో పెట్టినట్టు, మన ప్రాణాల్ని వాళ్ళచేతుల్లో పెట్టుకుంటారు. ఆరు నెలలు ఆరు యుగాలుగా గడపి వచ్చాను" అన్నాడు.

రంగనాథం అందుకొని నా కూతురు దగ్గర ఆరునెలలు ఉందామని వెళ్ళి ఒక నెలరోజులకే టిక్కెట్టు క్యాన్సిల్ చేసుకొని, కొత్తటిక్కెట్టు కొనుక్కొని వచ్చేశాను. నావల్ల కాలేదు. ఒకరోజు ఒకనెలలాగా గడిచింది. పొద్దుపోదు. పలకరించే వాళ్ళు ఉండరు. ఒంటరిగా మనం ఎక్కడికీ పోలేం" అన్నాడు.

రాజశేఖరం "అందుకనే నేను ఒక్కసారి మినహా ఎంత బతిమిలాడినా ఆ ఛాయలకు పోలేదు. ఇక్కడున్న సంతానం ఇలా ఏడుస్తుంటే అక్కడ ఎట్లుంటుందో అని ఆవైపుకు కన్నెత్తి కూడా చూడలేదు".

"హాయిగా నీవు ఇంటిదగ్గర పిల్లలతో, మనవడు మనవరాలుతో ఉండకుండా, ఈ ఫామ్ హౌస్‌లో ఎందుకు ఉండడం" అన్నాడు నాగరాజు.

అందులో రాజశేఖరం "నేను వాళ్ళకు అన్నిరకాలుగా అడ్డంగా ఉన్నానని కొడుకు కోడలు అనుకోవడం నాకు నచ్చలేదు. ఆస్తి అంతా నా పేరుమీద నా భార్యపేరుమీద ఉంది. అందుచేత కాస్త జాగ్రత్తగా మసలుతూ వచ్చారు. లేకపోతే నా చావు కుక్కచావుగా ఉండేది. అయినా భార్య లేకుండా భర్త, భర్తలేకుండా భార్య బిడ్డలను ఆధారం చేసుకొని ఉండడం దేవుడు వేసే శిక్ష. ఎక్కడో నూటికి కోటికి ఒకళ్ళిద్దరు బిడ్డలు ప్రేమతో చూచుకునేవాళ్ళుంటారు. మనకా అదృష్టం లేదు. నిజానికి వాళ్ళకంటే బయటి వాళ్ళు, కూలికి వచ్చినవాళ్ళు ఎంతో నయం" అన్నాడు.

తరువాత నాగరాజు "మా వియ్యంకుడిది భయంకరమైన జీవితం, ఆయన మొదటి నుండి బాడుగ ఇంట్లో ఉండేవాడు. కొడుకును చదివించడానికి తన ఆదాయాన్నంతా ఖర్చుచేసి చివరకు బాడుగ ఇంట్లో గడుపుతూ వచ్చాడు. కొడుకు ఆస్ట్రేలియాలో ఉన్నాడు. బాగానే సంపాదిస్తున్నాడు. ఇక్కడ భార్యాభర్తలు ఇద్దరూ ఉండేవాళ్ళు. తనకెలాగూ పెన్షన్ వస్తుంది కాబట్టి కొంతకు కొంత ఇబ్బంది లేకుండా గడుపుకుంటూ ఉండేవాళ్ళు. కొడుకు పదిహేను లక్షల రూపాయలు తల్లి దండ్రి

పేర జాయింట్ అకౌంట్లో వేసిపెట్టాడు. తండ్రి రాఘవరావు బ్యాంకులో ఎందుకు ఒక ఇల్లు కొనిపెట్టమని కోరాడు. కానీ కొడుకు ససేమిరా కాదన్నాడు. బ్రతికినా చచ్చినా స్వంత ఇంటి కల నెరవేర్చుకోవాలని కొడుకుకి నచ్చచెప్పడానికి శతవిధాలా ప్రాధేయ పడ్డాడు. కొడుకు దానిమీద వచ్చే వడ్డీని వారి ఆరోగ్య అవసరాలకు అత్యవసర వస్తువులకు వాడుకోమని చెప్పాడు.

చివరకు వియ్యపురాలు చనిపోయాక హాస్పెటల్ నుండి శవాన్ని బాడుగ ఇంటికి తీసుకురావడానికి ఇల్లు గల వాళ్ళు ఒప్పుకోకపోవడంతో హాస్పెటల్ నుండి అటే స్మశానానికి తీసుకపోయారు. చివరకు కొడుకు కొరివి పెట్టేందుకు కూడా రాలేకపోయాడు. నెల తర్వాత వచ్చి తండ్రిని చూచిపోయాడు. పిల్లలు ఎంత విచిత్రంగా ఉండాలో అంత విచిత్రంగా ఉన్నారు" అన్నాడు.

గంగాధరం "వింతేమిటంటే ఆస్తులు, భౌతిక సంపదలు, కీర్తిప్రతిష్ఠలు అన్నీ తల్లిదండ్రులనుండి బిడ్డలకు చెందుతాయి. భౌతికేతరమైన ప్రేమ, త్యాగం లాంటివి కొండపైన నుండి జలపాతంలా దొర్లుతాయి. తల్లి రక్త మాంసాలే కాక తన స్తన్యాన్ని ఎంతో సంతోషంతో పంచుతుంది. ఎత్తుకొని గోరుముద్దలు తినిపించి జోలపాడి ప్రతిక్షణం కంటిపాపలా రక్షించుకుంటుంది. ఇది మానవుల్లోనే కాదు చివరకు జంతువులు, పక్షులతో సహా అనేక జీవులలో కూడా సహజం. తండ్రి బిడ్డ చిటికెన వేలు పట్టుకొని నడిపిస్తూ, క్రమశిక్షణతో పెంచుతూ బిడ్డ అభివృద్ధికోసం సర్వశక్తులు ఒడ్డుతాడు. అయితే తండ్రి వయస్సు ఉడిగి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు తల్లిదండ్రులు చూపించిన ప్రేమ అనురాగంలో నూటికి ఒకటో వంతు కూడా పిల్లలు చూపక పోవడానికి కారణమేమిటి? అంతేకాదు ఇంకా విచిత్రమేమంటే తల్లిదండ్రులు సంపాదించిందంతా దోచుకొని వారిని నిరాశ్రయులుగా వదలి, భౌతికవస్తువుల్లా చూస్తూ, కనీసం ప్రేమను కూడా పంచకుండా హింసించేందుకు కారణం కూడా అర్థంకావడం లేదు" అని అడిగాడు.

దానికి నాగరాజు "మీకొక రహస్యం చెబుతాను. అది తల్లిదండ్రుల బలం బలహీనత ద్వంద్వ ప్రవృత్తి. మనిషి యొక్క బలం తన శక్తిని ధారపోసి సంపాదించడం, బిడ్డలను పోషించడం. బలహీనత బిడ్డలకొరకు త్యాగం చేయడం.

ఆ త్యాగం అంతా వన్‌వేలాగా తల్లిదండ్రుల నుండి పిల్లలకు చేరుతుంది. వాళ్ళు పైనుండి కిందకు వచ్చేదాన్నంతా ఒడిసిపట్టుకుంటారు. కాని పైకి పిసరంతా కూడా విసిరివేసే ప్రయత్నం చేయరు. సాధారణంగా ఏ వస్తుమార్పిడిలోనైనా, లేదా మారకంలోనైనా నీవు ఒక వస్తువిస్తే నేను మరొక వస్తువిస్తాను. లేదా డబ్బిస్తే నేను వస్తువు ఇస్తాను. నువ్వు పనిచేస్తే నేను జీతం ఇస్తాను. నీవు సేవచేస్తే పారితోషికం ఇస్తాను. నీవు ప్రేమ చూపిస్తే నేను ప్రేమ చూపిస్తాను. నీవు పగ పడితే నేను పగబడతాను. ఇది అంతటా జరిగే ప్రక్రియ".

మరలా " కానీ తల్లిదండ్రులు బిడ్డల దగ్గరకు వచ్చేసరికి ఇటునుండి అటు పోతుంది కాని, అటునుండి ఇటువైపుకు రాదు. భూమ్యాకర్షణ, విద్యుత్, మ్యాగ్నటిక్, న్యూక్లియర్ శక్తులన్నింటినీ ఒకచోట చేర్చినా వీళ్ళ స్వార్థం శక్తి ముందర పనిచేయవు. న్యూటన్ మూడవ సిద్ధాంతం తల్లిదండ్రుల ప్రేమ, బిడ్డల స్వార్థం మధ్య – యాక్షన్ రియాక్షన్ – విషయంలో తన ఉనికిని కోల్పోయింది" అన్నాడు.

గంగాధరం "నాగరాజా! నీవు సత్యానికి అతి సమీపంలో ఉన్నావు. చాలా చక్కని మాట చెప్పావు. అయితే నా ఉద్దేశ్యం, మనమందరం మన స్వార్థం చేతనే మన బిడ్డలను ప్రేమించలేదా! వాళ్ళను కూడా స్వార్థపరులను చేసి వాళ్ళు చేస్తున్న తప్పులకు వాళ్ళను లోలోపలే కుళ్లిపోయేట్టు చూస్తున్నాము. పైపెచ్చు మనల్ని కుళ్ళిన కోడిగుడ్లలా తయారుచేసేదానికి కావల్సిన తెలివిని, స్వార్థాన్ని జతచేశాం.

పుట్టిన నాటి నుండి వీడు బాగా చదువుకోవాలి, డాక్టర్ కావాలి, ఇంజనీర్ కావాలి, ఐ.ఏ.ఎస్. కావాలి, రాజకీయ వేత్త కావాలి, వ్యాపారస్తుడు కావాలి, మన బిడ్డలు అందరికంటే ఎత్తు ఎదగాలి, ప్రతివాడిచేత శభాష్ అనిపించుకోవాలి అని కలలు కని మనం చేసిన దౌర్భాగ్యపు ప్రయత్నాలు లెక్కలేనన్ని. మనలో చాలామంది వాళ్ళ బిడ్డలు అడిగినవి కాదనకుండా లంచగొండులుగా, అవినీతి పరులుగా మారి మన బిడ్డలు గీచే గీతలు ఇతరుల బిడ్డల గీతలకంటే పెద్దవిగా ఉండాలనే తపనతో తపస్సు చేయలేదా! అదీ కాక వేరే వాళ్ళ బిడ్డలు ఏమాత్రం ఎదిగారన్నా సహించలేక కుళ్ళిపోయి కుంచించుకునిపోలేదా. ఈ పాపం ఊరికే పోతుందా! వీటన్నింటినీ చూచినప్పుడు భగవంతుడు ఉన్నాడు, పాపం ఉంది. ఆ పాపానికి శిక్ష అనుభవించాలి

అన్న సిద్ధాంతాలు నమ్మాలనిపిస్తుంది. ఒక తరం తల్లిదండ్రులను మరొక తరం వాళ్ళు తన్ని తగలెయ్యడం మానవుడి మస్తిష్కం వికసించినప్పటి నుండి జరుగుతున్న ప్రక్రియే. కాదంటే గత శతాబ్దంలో ఇది ఎవరెస్టు శిఖరం అంత ఎత్తుకు ఎదిగిపోయింది. ప్రతివాడు ఆ శిఖరాగ్రిని తాకాలని తపన పడేవాడే. అందుచేత మనం చేసిన తప్పులకు వాళ్ళు ఇచ్చే పారితోషం, ఇదికాక వేరే ఏముంటుంది? ఒకవేళ అది వేరుగా ఉంటే ప్రకృతి ఎలా సహిస్తుంది. భగవంతుడు చూస్తూ ఎలా వూరకే కూర్చొని ఉంటాడు?

అదీగాక మన తర్వాత తరంవాళ్ళ బాగోగుల కొరకు మనం, మన ముందు తరాలు అంటే మన తల్లిదండ్రులను భిక్షగాళ్ళుగా, దిక్కులేని వాళ్ళుగా, వాళ్ళ ఆస్తులను సొంతం చేసుకొని, వాళ్ళను బికార్లు చేసినప్పుడు ఈ జ్ఞానం ఎక్కడికి పోయింది?

అసలు పాపపుణ్యాలు అనేవి వుంటే మన తల్లిదండ్రులకు మనం చేసిన అన్యాయానికి, మన బిడ్డలకు చేసే అపాత్రదానానికి రెండింటిని కలిపి భగవంతుడు వేసే శిక్ష లేదా ప్రకృతి మన బిడ్డలలో జొరబడి వాళ్ళచేత వేయించే శిక్ష చాలా తక్కువ అనిపిస్తుంది.

ముందు తరాల వాళ్ళు సంపాదించిన దాన్ని వాళ్ళు కూడా అనుభవించకుండా అడ్డుపడి దాన్ని రాబోయే తరాలకోసం మనం గడ్డితిని దాచిపెడుతున్నాం. నేను ఇలా మాట్లాడుతుంటే నన్నొక ఉగ్రవాదిగా, బిడ్డల మీద ప్రేమలేని వాడుగా ముద్ర వేస్తారు. నేను ఎంతోమందిని చూశాను. ఒక తల్లిదండ్రికి ఒక్కరు లేదా నలుగురు బిడ్డలు ఉండనీయండి. అందరూ ఆడబిడ్డలయినా లేక మొగ బిడ్డలైనా లేదా రెండూ రకాలున్నా మనం న్యాయబద్ధంగా, పంచి ఇచ్చామనుకోండి వాళ్ళల్లో ఏ ఒక్కరికీ తృప్తి ఉండదు. ప్రతి బిడ్డా మిగతా వాళ్ళ కంటే ఎక్కువ కోరుకుంటాడు. దానికి అనేక కారణాలు. నేను ఇంటికి పెద్దవాడిని గదా! చిన్నవాడిని గదా! మా అత్తగారికి ఆస్తిలేదు కదా! నాకు ఉద్యోగం లేదుకదా! నా భర్త తెలివిగలవాడు కాదు కదా! నాకు అందరూ ఆడబిడ్డలు కదా! నా బిడ్డలకు చదువు లేదు కదా! ఇలా వెయ్యి కారణాలు చూపించి ప్రతివారు తమకు ఎక్కువ రావాలని కోరుకుంటారు. నిజానికి తమకు ఎక్కువ కావాలని కాదు, అవతల వాళ్ళకు తక్కువ రావాలి. ఇది వాళ్ళకు

తృప్తినిచ్చే అంశం. అందుచేత ఏ ఒక్కరూ తృప్తిలేక అందరూ అసంతృప్తితో, కొరతతో తల్లిదండ్రులను దగ్గర రానీయ్యరు. అవకాశం వస్తే చీల్చి చెండాడుతారు.

నిజం చెప్పాలంటే, ఇలాంటి అసంబద్ధపు అక్రమ పనులకు ఎంత శిక్షవేసినా తక్కువే. ప్రతివాళ్ళు తమ బిడ్డలకు స్వార్థం నూరి ఉగ్గుపాలలో వసతో కలిపి పట్టడం లాంటిది. అది వాళ్ళను తల్లిదండ్రులకు సేవచేయలేని పరిస్థితుల్లో ఉంచి వాళ్ళ మనస్సులను హింసించడం ఎంత పొరబాటు పనో, మనం ఎన్నడూ అర్థంచేసుకోలేము" అంటూ అందరివైపు చూశాడు నాగరాజు. తాను చెప్పినది నిజమా? కాదా! వాళ్ళ ముఖ కవళికలు ఎలావున్నాయి అని తెలుసుకోవాలని.

అందుకు సూర్యప్రకాశం "అవును అది నిజమే. మనమే వాళ్ళను మనసులేని మరమనుషులుగా, రోబోట్స్‌గా తయారుచేసి మనమీద ప్రేమ చూపించడం లేదని ఏడవడం ఎందుకు? తల్లిదండ్రుల ఆస్తులను కబ్జా చేసుకుంటున్నారనీ వృద్ధాశ్రమల్లో చేర్పించారనీ, తల్లిదండ్రులు చనిపోయినా చూడడానికి రాలేదనీ, కర్మకాండలు జరిపించడం లేదనీ, తద్దినాలు, శ్రాద్ధాలు పెట్టడం లేదనీ, మందులు మాకులు కొనివ్వడం లేదనీ అన్నింటికి టైము లేదంటున్నారనీ, తమ బిడ్డలకు మాత్రం అన్ని కార్యక్రమాలు జరుపుతున్నారని, ఇప్పుడులేని టైము అప్పుడు ఎక్కడ నుంచి వచ్చిందని, తప్పులు పట్టడం దెప్పిపొడవడం చేస్తున్నారు. వాళ్ళేదో తప్పు చేస్తున్నారని ఆగిత్తం చేస్తున్నారు. ఎందుకు? మనం చేసినదే వాళ్ళుకూడా చేస్తున్నారని సంతోషించాల్సింది పోయి బాధపడడం ఎందుకు? చిన్నప్పుడు చదువుకోలేదా! ఆవు చేలో మేస్తే, దూడ మాత్రం గట్టున మేయాలా? ఇదెక్కడి న్యాయం.

ఒక్కమాట చెబుతాను. దేవుడంటే నాకు నమ్మకం లేదు. కానీ ప్రకృతిని నేను గౌరవిస్తాను. 'ఎవ్వరు చేసిన కర్మ వారనుభవింపక తీరదన్న వాక్యం' కంటే గొప్పవాక్యం ఏదీ లేదని నా మనస్సు పదే పదే చెబుతుంది. ఇందులో ఒక తిరకాసు ఉన్నది. తెలిసి చేసినా, తెలియక చేసినా, తెలిసి పట్టుకున్నా, తెలియక పట్టుకున్నా, నిప్పు, తప్పు కాలక మానవు.

మనం చేసిన తప్పులకు ఫలితం మనం అనుభవిస్తున్నాము. అలాగే మనబిడ్డలు కూడా అనుభవిస్తున్నారు. వాళ్ళు మనకు ప్రేమను అందించలేదని పడే బాధకన్నా,

వేరేవిధంగా వాళ్ళు పడే బాధను చూసి మనం మరీ బాధపడుతున్నాము. ఈ పాపాన్ని ఏదో ఒక రూపంలో కడుక్కోవాలి. అది ధర్మం, అది న్యాయం, అది చట్టం. పుణ్యాన్ని అనుభవించినప్పుడు, పాపాన్ని కష్టాన్ని నష్టాన్ని భరించకుండా తీరుతుందా? ఇది ఒక ప్రవాహం. ఇదేరీతిలో మన తల్లిదండ్రులు బాధపడలేదా?

అనారోగ్యంతో ఉన్న బిడ్డలు పుట్టడం, చదువు సంధ్యలు లేకుండా జులాయిగా తిరగడం, తల్లిదండ్రులను ఎదిరించడం లాంటివి వాళ్ళు చేసిన పాపాలకు అనుభవించే ప్రాయశ్చిత్తం అనిపిస్తుంది. దానికి దేవుడిని నిందించి లాభంలేదు. దేవుడు ఉన్నాడో లేదో! లేదనుకున్న వాళ్ళకు జరిగే చెడ్డలేదు. ఉన్నాడనుకున్న వాళ్ళకు జరిగే మంచిలేదు. చేసిన మంచికి చెడ్డకు ఫలితం సమానంగా ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించలేనంతకాలం, మనం తరాతరాలను చెడగొడుతూనే ఉంటాం. వాళ్ళను కష్టపెట్టి మనం కష్టపడి నష్టపోతాం. ఈ జీవితం ఒక పాపాల సమాహారం. దీనికి కొన్ని పుణ్యాల వారధిని తయారు చేయనంతకాలం ఈ ప్రపంచం ఇలాగే నడుస్తుంది. మనం తరాల అంతరాల్ని పెంచుకుంటూ పోతుంటాము" అన్నాడు.

గంగాధరం అందుకొని "నీవు చెప్పింది నిజం సూర్య! నీవు చెడ్డవాడు కావాలని పాపం చేయాలని కోరుకుంటే నువ్వు మంచివాడవు ఎలా అవుతావు? నీవు చేసేది పుణ్యంగా ఎలా మారుతుంది?

ఇది మనము చేసిన తప్పు.

ఇది మన బిడ్డలచేత చేయిస్తున్న తప్పు.

ఇది మనకు జరిగిన తప్పు.

మీకు ఒక రహస్యం చెబుతాను. అది ఒక ఆటమ్ అనగా పరమాణువు లాంటిది. దాన్ని పేల్చినప్పుడు ప్రళయాన్ని సృష్టించి సర్వనాశనం చేస్తుంది. "యూంగ్ లేదా జంగ్" అనబడే ఒక మానసిక తత్త్వవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ శిష్యుడు మనలో కాన్సస్, సబ్‌కాన్సస్, అన్‌కాన్సస్ అని మూడు అరలు ఉంటాయి అని చెప్పాడు. మనం పుట్టిన లగాయితు సబ్‌కాన్సస్ అరలో కొన్ని కోట్ల కోట్ల జ్ఞాపకాలు ఇమిడి ఉంటాయి. అవకాశాన్ని బట్టి, అవసరాన్ని బట్టి అవి బయట పడ్డప్పుడు వాటి శక్తి

అపారంగా ఉంటుంది. అలాగే ఉదాహరణకు మన సంతతికి అన్నివసతులూ కల్పించాము. ఎంతో మంచి చేశాము. కాని, అనేక సార్లు కోపంతో తిట్టడం, దండించడం చదువుకోమని మందలించడం, వాళ్ళకు ఇష్టమైన పనులను చేయనీయకుండా ఉండడం, కష్టమైన వాటిని చేయమని బలవంతం చేయడం వలన వాళ్ళ మనుసుల్లో అవి దాక్కుని, వాళ్ళు స్వతంత్రంగా ప్రవర్తించే అవకాశం కలిగినప్పుడు అది 'పగ' రూపంలో ప్రత్యక్షమై తల్లిదండ్రులను అనేక రకాలుగా హింసకు గురిచేస్తుంది అని నాకు అనిపిస్తుంది. లేకపోతే బిడ్డలు తమ బిడ్డల్ని ప్రేమగా చూచి తల్లిదండ్రులను అసహ్యించుకోడానికి మరో కారణం ఉండదని అనిపిస్తున్నది" అన్నాడు.

ఇప్పటి వరకు ఆంజనేయులు కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తూ వుండి "ఇది చాల నిజం అనిపిస్తున్నది, అయినా మా బిడ్డలకు చదువు రాకపోవడం నన్ను ఇబ్బందులకు గురి కాకుండా చేసిందనిపిస్తుంది. ఎవరి వ్యాపారం వాళ్ళది. పిలిస్తే పలుకుతారు. లేకుంటే వాళ్ళ దోవ వాళ్ళది" అన్నాడు.

ఇంతలో నరేంద్ర వచ్చి "ఇంకేమైనా కావాలా అని అమ్మాయి అడుగు తున్నారు," అని అన్నాడు.

"ఏమీ అవసరం లేదు" అని అన్నాడు రాజశేఖరం.

గంగాధరం "అడక్కుండానే అన్నీ వస్తుంటే అడగాల్సిన పనేముంది" అన్నాడు.

మరలా కొంచెం సేపు తర్వాత నరేంద్ర "పొద్దుపోతున్నది. భోజనాలు వడ్డించమంటారా" అని అడగమన్నారు.

రాజశేఖరం "అరగంటలో భోజనాలకు వస్తాము" అన్నాడు. నరేంద్ర లోపలికి వెళ్ళాడు.

రాజశేఖరం "నాలుగు గంటల నుండి ఒకే విషయం మీద మాట్లాడుకొని, ఇరుక్కుపోయామనిపిస్తోంది. అయినా ఇది ప్రస్తుత పరిస్థితుల్లో మనందరికీ అవసరమైందే. అయినా ఒక కొలిక్కి రాలేదు. మీరు మాట్లాడిన దాంట్లో నిజం ఉంది. అయితే ఈరోజుల్లో కూడా చాలా తక్కువ శాతం అయినప్పటికీ మంచి

కుమార్తెలు, కుమారులు తల్లిదండ్రులను చూచుకునేవారున్నారు. అందుకు తల్లి దండ్రుల క్రమశిక్షణ కావచ్చు, లేదా వాళ్ళు చేస్తున్న తప్పులు బిడ్డలు చేయకూడదనే పట్టుదల కావచ్చు లేక తప్పుచేయడానికి సంఘాన్నీ ఇతరులను చూచి భయం కావచ్చు" అని మాట్లాడుతూ వుంటే గంగాధరం కల్పించుకొని.

"లేరని చెప్పడం లేదు రాజశేఖరం! నువ్వు చెప్పిన విధంగా అది చాలా కొద్దిశాతం. నీకు ఇంకొక మహత్తరమైన సత్యం చెబుతాను విను. ఒక భార్య భర్తతో కుటుంబం ఉందనుకుందాం. వాళ్ళకు బిడ్డలు లేరు. అలాగే ఇంకో కుటుంబంలో కేవలం మగబిడ్డలు ఉన్నారు. మరొక కుటుంబంలో కేవలం ఆడబిడ్డలు ఉన్నారు. మరొక కుటుంబం బిడ్డలు లేక దత్తత తీసుకున్నారు అనుకుందాం.

వివరంగా చెప్పాలంటే అసలు బిడ్డలు లేనివాళ్ళు, కేవలం కొడుకులే ఉన్నవాళ్ళు, కేవలం కూతుళ్ళే ఉన్నవాళ్ళు, కూతుళ్ళు కొడుకులు ఉన్నవాళ్ళు, దత్తత తీసుకొన్న వాళ్ళు మొత్తం ఐదు రకాల జాతుల తల్లిదండ్రులు ఉన్నారు అని అనుకుందాము.

పై ఐదు రకాల వాళ్ళ బిడ్డలు ఒకరిని పోలి మరొకరు ఉండరు. పైగా వాళ్ళమధ్య జరిగేది గతంలో మనం చర్చించిన విధంగా ఒక వ్యాపారం. వాళ్ళ తల్లిదండ్రులు ఆస్తులు, ప్రేమ ఇస్తారు. బిడ్డలు కూడా కొంత ప్రేమ ఇవ్వవచ్చు, లేకపోవచ్చు.

ఇటువంటివి ఐదు గాదు ఒక లక్ష కుటుంబాలు ఉన్నాయని అనుకుందాం. ఈ లక్ష కుటుంబాలు తలా ఒక కుక్కను పెంచుకున్నారు అనుకుందాం. ఈ లక్ష కుక్కలు తమ యజమానులను, ఇంట్లో అందరినీ సమానంగా ప్రేమించి రక్షిస్తాయి. వాటి ప్రేమలో, రక్షణలో ఎలాంటి తేడాలు ఉండవు. కాని, మన ఉదాహరణలోని లక్షల మంది బిడ్డల ప్రవర్తనలో వైవిధ్యం కొట్టొచ్చినట్టు ఉంటుంది. వారి మధ్య ప్రేమానురాగులు వివిధరకాలుగా పొంతన లేకుండా ఉంటాయి. నాకనిపించేది ఏమిటంటే అసలు ప్రకృతిలోనే లోపం ఉంది. నీరు, పల్లం ఎరుగు అన్నట్టు, ప్రేమానురాగాలు తల్లిదండ్రుల నుండి పిల్లలకు చేరినట్లు క్రింద నుండి పైకి వెళ్ళే అవకాశం లేదు. ట్యాంకులోని నీరు కిందకు వస్తుంది. కాని, క్రింద బోరులోని

నీళ్ళు మోటారు సహాయంతో ట్యాంకులోనికి పోతాయి. అలాంటి సాంకేతిక పరిజ్ఞానం తల్లిదండ్రుల, బిడ్డల మధ్య ఉండదు. అయితే ఈ వ్యవస్థను నాశనం చేయడానికి అందరూ కారణభూతులే. కాని, తాత అవ్వకు, మనుమలు మనుమరాండ్రుకు మధ్య వారధిగా ఉండే తల్లిదండ్రులలో మార్పు రావాల్సి ఉంది. వాళ్ళ ఆలోచనలు, చర్యలు, ప్రేమలు, అటు ముందుతరాన్ని, ఇటు రాబోయే తరాన్ని నాశనం చేస్తూ ఉండడం ఇప్పుడు జరుగుతున్న తంతు. అయినా బిడ్డల్ని ప్రేమించే వాళ్ళు, తల్లిదండ్రుల్ని ప్రేమించలేకపోవడం, పైపెచ్చు కష్టపెట్టడం మంచి చెడ్డా ద్వంద్వాలతో తయారైన జీవుడు మంచిని సంతానికి పంచి చెడ్డను వాళ్ళ తల్లిదండ్రులకు అందిస్తున్నాడు. ఇది ఒక విచిత్రం. ఇది ఒక అంతుపట్టని రహస్యం.

సృష్టిలోనే ద్వంద్వం ఉంది. ప్రకృతిలో ఒకవైపు లోతైన సముద్రం, మరొక వైపు ఎత్తైన పర్వతాలు ఉన్నట్లే, ఇదికూడా" ఇంకేదే మాట్లాడబోతుంటే రాజ్యం చొరవతీసుకొని వచ్చి, "వండినవి చల్లారి పోతున్నాయి నాయనా" అని అందర్నీ డైనింగ్ టేబుల్ దగ్గరకి తీసుకెళ్ళి రుచికరమైన భోజనాన్ని పెట్టింది. అందరూ సంతోషంగా రాజశేఖరానికి కృతజ్ఞతలు చెప్పి, రాజ్యంకు ఆశీర్వచనాలు పలికి ఎవరి ఇళ్ళకు వాళ్ళు కారులో కదిలారు.

* * * * *

# 10

ఒకరోజు మూడు గంటల ప్రాంతంలో సతీష్ తోటకు వచ్చాడు. రాజశేఖరం ఖచ్చితంగా బ్యాంకుకు పోతాడని తెలుసు. అందుకు తానే కారు పంపించాడు. ఇదే అదను అనుకొని తోటకు వచ్చాడు సతీష్. రాజ్యం నాగమ్మ ఇద్దరూ ఏదో పనులో ఉండి సతీష్ రాకను గమనించలేదు. సతీష్ వచ్చి వరండాలో కూర్చున్నాడు. పది నిమిషాలు చూచి రాజ్యాన్ని కేకవేశాడు. రాజ్యం వచ్చి "ఎంతసేపు అయ్యింది వచ్చి" అన్నది.

"పదిహేను నిమిషాలు దాటింది. ఇంకెవరైనా వచ్చి ఏమైనా తీసుకొని పోతే కూడా ఇంతేకదా! ఇద్దరిలో ఒకరు బయట ఉండొచ్చు కదా?" అన్నాడు.

"ఇక్కడికి ఎవరు వస్తారు? అంత ధైర్యమా!" అన్నది.

"నేను వచ్చానుగా" అన్నాడు.

"మీ ఇంటికి మీరు రావడంలో విచిత్రమేముంది. కుక్క కూడా అరవలేదు చూచారా! కాదంటే సంతోషంతో మూలుగుతున్నది" అన్నది.

మరల "ఉండండి! టీ తెస్తాను" అంటుంటే

"నాకు టీ అక్కర్లేదు" అన్నాడు.

రాజ్యం "ఏం కావాలి. కాఫీ, మజ్జిగ, కూల్‌డ్రింక్. పోనీ టెంకాయనీళ్ళు తాగుతారా!" అన్నది.

"అవేవీ అక్కరలేదని నీకు తెలుసు" అన్నాడు.

"నాకు అర్థంకావడం లేదు. ఏం కావాలో నాకు చెప్పకపోతే ఎలా తెలుస్తుంది" అన్నది.

"నీకు భగవంతుడు చాలా తెలివి  ఇచ్చాడు. నా నోటితో చెప్పించాలనా? నేను ఇంతకుముందే చెప్పాను కదా! నీవు కావాలి" అని లేచి చేయి పట్టుకోబోయాడు.

"ఇది మంచిది కాదు, నీవు నాకు అన్నయ్యవు, నేను మీ నాన్నను నాయనా అని తప్ప వేరే విధంగా పిలిచి ఎరుగను" అంటుంటే

"నాయనా! నాయన ఎలా అవుతాడు? నీవు మా అమ్మకు పుట్టావా? మా నాయనకు పుట్టావా? అయినా అదంతా నాకు తెలియదు. నాకు పిచ్చెక్కుతున్నది. నీ అందాన్ని చూస్తుంటే మతిపోతున్నది" అన్నాడు.

"ఇది తప్పన్నయ్యా! నేను పెళ్ళి కావల్సిన దానిని. నీకు పెళ్ళి అయ్యి ఇద్దరు పిల్లలున్నారు".

"ఇదంతా నాకు తెలియదు. నాకు నువ్వు కావాలి అంతే" అంటూ మరల దగ్గరకి వచ్చి చేయి పట్టుకోబోయాడు. రాజ్యం గబగబా దొడ్లోకి పోయి నాగమ్మ దగ్గర కూర్చొంది. అరగంట అయ్యింది. బయటకు రాలేదు. సతీష్‌కు ఏమి చేయాలో తెలియలేదు. ఇంతలో రాజశేఖరం కారులో నుండి దిగాడు.

రాజశేఖరం "నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అన్నాడు.

"ఏం రాకూడదా!" మీరు వెళ్ళారా లేదా అని ఈవైపే పోతూ లోపలికి వచ్చాను" అన్నాడు. రాజశేఖరం "రాజ్యం!" అని కేకవేశాడు. నాయన ఎప్పుడు వస్తాడా అని కాచుకొని కూర్చున్న రాజ్యం ఆయన గొంతు వినగానే పరుగెత్తుకుంటూ వచ్చి నీళ్ళగ్లాసును అందించి "టీ తెస్తాను నాయనా!" అన్నది.

"తీసుకొని రామ్మా" అన్నాడు.

"ఇంట్లో పనివాళ్ళు నాయనా, బాబాయ్ అని పిలుస్తుంటే మేము ఎలా పిలవాలో తెలియడం లేదు" అన్నాడు సతీష్ కోపంగా.

"ఎవరు ఎలా పిలవాలనుకుంటే వాళ్ళు, వాళ్ళ వాళ్ళ ప్రేమాభిమానాలను బట్టి పిలుస్తుంటారు. చెడ్డగా ఏమీ అనడం లేదు కదా! తిడితే చింతించాలి కాని మంచిమాట మాట్లాడితే బాధపడడం ఎందుకు. అయినా ఏమన్నది, నాయనా

అనేకదా అన్నది. పెద్దవాళ్ళు చిన్నవాళ్ళను నాయనా బాబూ బుజ్జి చిన్ని అని అంటారు. చిన్నవాళ్ళు కూడా పెద్దవాళ్ళను నాయనా బాబూ అని అంటారు, అసలు నీకెందుకు తప్పుగా తోచిందో నాకర్థం కావట్లేదు" అన్నాడు.

సతీష్‌కు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. అందుచేత రాజ్యం తెచ్చిన టీ తాగి, వస్తానని చెప్పి గబగబా కారెక్కాడు.

* * * * *

రాజ్యం "నాయనా! చిన్నన్నయ్య ఫోను చేస్తున్నాడు" అని పెద్దగా కేకవేసింది. రాజశేఖరం ఫోన్ రిసీవర్ అందుకున్నాడు. అవతల నుంచి నితీష్ "డాడీ! వచ్చేనెల మొదటి వారంలో దీప్తి పిల్లలతో వస్తున్నాను. మీ ఆరోగ్యం ఎలావుంది?"

"మంచి వార్త చెప్పావు నాన్నా! చాలారోజులు అయ్యింది మిమ్మల్ని చూచి, అందరూ బాగున్నారు కదా! ఉద్యోగం అంతకు ముందుదేనా లేక ఏదైనా మారావా!" అన్నాడు రాజశేఖరం.

"కంపెనీ అదే కాదంటే ప్రమోషన్ వచ్చింది. ఒక నెల సెలవు తీసుకొని వస్తున్నాము. అందరం బాగున్నాము. మీకు ఏమి తీసుకురావాలనో తెలియడం లేదు. ఏమైనా కావాలంటే చెప్పండి. రాజ్యం బాగుందా, కోటయ్య బాగున్నాడా" అని అడిగాడు.

"అంతా బాగున్నారు. నీవు రావడమే మాకు ఆనందం. అంతకంటే నాకేం కావాలి. పైగా అక్కడ వుండేవన్నీ ఇప్పుడు ఇక్కడ కూడా దొరుకుతున్నాయి కదా! మీరు త్వరగా రండి! మీకోసం ఎదురుచూస్తుంటాను" అన్నాడు. "ఉంటాను" అంటూ నితీష్ ఫోన్ పెట్టేశాడు.

రాజశేఖరం ఆనందంతో "రాజ్యం! మంచి కాఫీ పట్రా! నితీష్ రెండు వారాల్లో వస్తాడట, నువ్వు మీ నాన్న ఎలా ఉన్నారని అడిగాడు" అన్నాడు.

సాధారణంగా భోజన సమయంలో కాఫీ అడగడు. తను కూడా సాధారణంగా అవకాశం ఇవ్వదు. సంతోషమైన వార్త విన్నందుకు కాఫీ తాగాలనిపించి ఉంటుంది

అని ఐదు నిమిషాల్లో కాఫీ తీసుకొని వచ్చి కప్పు చేతికి అందిస్తూ "అందరూ బాగున్నారని చెప్పారా!" అని అడిగింది.

"అందరూ బాగున్నారు. త్వరలో వస్తున్నారుగా!" అని అన్నాడు.

రాజశేఖరం కాఫీ తాగడం పూర్తయ్యాక రాజ్యం "నిన్న సతీష్ అన్న వచ్చి ఏదేదో మాట్లాడాడు" అని అన్నది.

"ఏమన్నాడు?" నేను చెప్పలేను. నీవు నా అన్నయ్యవు, మిమ్మల్ని నాయనా అని పిలుస్తాను అని చెప్పాను. అందుకు నీవు మా అమ్మకు పుట్టావా? మా నాన్నకు పుట్టావా? నేను నీకు అన్నకావడానికి అని తొందరపడపోతున్నప్పుడు నేను లోపలికి వెళ్ళి నాగమ్మ దగ్గర కూర్చొన్నాను. ఇంతలో మీరు వచ్చారు" అన్నది.

"అందుకే ఎక్కడో ఒకచోట మూడుముళ్ళు పడితే గొడవ పోతుంది" అని అన్నాడు రాజశేఖరం. ఈ సమస్య ఎంతదూరం పోతుందో, ఏ సమస్య వస్తుందో అని వేయి కళ్ళతో గమనిస్తున్నాను" అన్నాడు.

రాజశేఖరం తన మిత్రుడు గంగాధరానికి ఫోన్‌చేసి "వీలైతే  రేపు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో రావడానికి వీలవుతుందా, కారు పంపుతాను. నీతో నాకు అర్జంటు పని ఉంది" అన్నాడు.

అవతల నుండి "ఒక చిన్నపని వుంది. దాన్ని వాయిదా వేసుకొంటాను. అవసరం వుంటే తప్ప నీవు అడుగవు కదా! ఆరోగ్యం బాగుంది కదా? నేను వస్తున్నాను కాబట్టి ముఖాముఖి మాట్లాడుకుంటాం" అన్నాడు గంగాధరం.

"నువ్వు ఆదుర్దా పడవలసిన పనిలేదు. ఆరోగ్యం బాగుంది. వేరే విషయాలు మాట్లాడాలి. నీవైతే వాటిని చక్కబెట్టగలవు. అందుకని పిలుస్తున్నాను" అని ఫోను పెట్టేశాడు రాజశేఖరం.

సాయంత్రం మూడు గంటలకు టెన్షన్‌గా వచ్చాడు గంగాధరం. రాజ్యం మంచినీళ్ళు ఇచ్చి కాఫీ తాగుతామంటే ఇద్దరికీ కాఫీ తెచ్చి యిచ్చి, వాళ్ళు మాట్లాడుకుంటుంటే తనెందుకులే అని లోపలికి వెళ్ళిపోయింది.

రాజశేఖరం గంగాధరం వైపుకు తిరిగి "రాజ్యం తెలుసు కదా! నా బంగారు తల్లికి ఏదైనా మంచి సంబంధం చూస్తావని నిన్ను పిలిచాను. ఈ మధ్య ఒక సంబంధం చూచాము. అయినా అబ్బాయి ఎందుకో కాదనుకున్నాడు" అని జరిగిన విషయం చెప్పాడు.

"అందుచేత ఈ పని నీకు అప్పచెబితే నీకున్న పరిచయాలలో ఎక్కడైనా ఒక మంచి కుర్రాణ్ణి చూస్తావని పిలిచాను. రోజులు గడిచే కొద్దీ అనేక ఇబ్బందులు తలెత్తుతాయి" అన్నాడు.

గంగాధరం "మీకు ఎలాంటి సంబంధం కావాలి" అన్నాడు.

అందుకు రాజశేఖరం "పెళ్ళికి రాజ్యం కండీషన్స్ ఏమంటే అబ్బాయి, ఇక్కడికి వచ్చి కాపురం పెట్టాలి. వాళ్ళ నాన్నను నన్ను తాను చూసుకోదలచి ఇలాంటి కండీషన్ పెడుతున్నది. తాను వెళ్ళిపోతే మమ్మల్ని చూచేవాళ్ళు ఉండరని తన బాధ" అని అంటూ...

కొంచెం ఆగి "రాజ్యం రూపురేఖలు మీకు తెలుసు. ఆరు సంవత్సరాలు క్రింద వాళ్ళ నాయన పేరుతో రెండు ఎకరాలు రిజిష్టర్ చేయబడి ఉంది. తాను ఎన్నో ఏళ్ళుగా ఈ ఎస్టేట్ చూచుకుంటూ వచ్చినదానికి జీతం కాకుండా ఆ భూమిని రాసిచ్చాను. ఈ మధ్యకాలంలో ఒక ఆరు ఎకరాల భూమిని మా తోటకు పక్కనే ఉన్నదాన్ని కొన్నాను. దాంట్లో కోటయ్య డబ్బు కూడా ఉంది. ఏది ఏమైనా నాకు తల్లిలా సేవచేసినందుకు రాజ్యం పేరు మీద ఆరు ఎకరాలు రిజిష్టరు చేయించాలి. దానికి డాక్యుమెంటు రైటర్‌తో మాట్లాడి వీలైతే రెండు మూడు రోజుల్లో ఆపని పూర్తి చేయాలి. ఎవరికి ఎవరు? ఏదైనా జరగరానిది జరిగితే ఆ పిల్ల దిక్కులేనిదవుతుంది. అది నాకిష్టం లేదు. వాళ్ళున్న ఇల్లు కూడా తనపేరు మీద రిజిష్టరు చేయించాలి. అయినా ఇంకా నా పేరుతో ముప్పై ఎకరాలు దాకా ఉంటుంది" మరలా ఆగి

"అందానికి అందం, మంచి ఆస్తి, చదువు, సంస్కారం ఉన్న అమ్మాయిని ఇస్తామంటే ఎవరైనా మంచివాళ్ళే వస్తారని నాకు నమ్మకం. నాలుగు రకాలుగా ప్రయత్నం చేస్తే కొంచెం మంచిసంబంధాన్ని, తెలిసిన సంబంధాన్ని చూడ్డానికి

వీలవుతుంది. నాకు ఆప్తులైన మిత్రులలో నువ్వు ఒకడివి. పైగా ఈ లౌకిక ప్రపంచంలో అన్నివిషయాలు ఎరిగిన వాడవని నీతో ఈ విషయాలన్నీ చెబుతున్నాను. నాకు ఈ విషయంలో నీ పూర్తి సహాయ సహకారాలు కావాలి. అబ్బాయిని చూచి పెళ్ళి నిశ్చయంచేసే బాధ్యత నీమీద పెడుతున్నాను" అన్నాడు.

గంగాధరం "అయితే రాజ్యం కోటీశ్వరురాలన్నమాట. ఎవరైనా ఎగరేసుకు పోతారు. నాకు ఒక ఆలోచన ఇప్పుడే వచ్చింది. మా చెల్లెలు కొడుకు బి.ఎ వరకు చదివి ఉన్నాడు. ఏ ఉద్యోగంలో నైనా పదివేల కంటే పైన రాదు. అదికూడా కష్టమే. అందుకని వాడు ఆడియో వీడియో షాపు పెట్టుకొని ఉన్నాడు. ఈ ఊరే కాబట్టి ట్రాన్స్‌ఫర్ లాంటి గొడవలు ఏవీ ఉండవు. చూటడానికి బాగా ఉంటాడు. మీకే అభ్యంతరం లేదంటే ఈ సంబంధం రాజ్యానికి అన్నివిధాలా సరిపోతుందని అనిపిస్తున్నది. పైగా పిల్లవాడికి ఎలాంటి పోకిరీ చేష్టలు జులాయి పనులు లేవు. కష్టపడి పైకి రావాలనే తత్త్వం ఉండేవాడు. ఇంతెందుకు వారం వారం వచ్చి నన్ను పలకరించి ఏదన్నా విషయం ఉంటే నాతో చర్చించి నా సలహా తీసుకొని పోతుంటాడు. నిజానికి వాడు నా దగ్గరకు రావలసిన అవసరం ఏమీ లేదని నాకు తెలుసు. కాని చుట్టాలు పక్కాలు బంధుప్రీతి ఉన్నదనేదానికి ఇది నిదర్శనం. నేను మేనమామనైనా చాలా మర్యాదగా ప్రవర్తిస్తాడు".

మరలా "మీ కభ్యంతరం లేకపోతే నేను వాళ్ళ అమ్మానాన్నతో మాట్లాడతాను. వాళ్ళు కూడా నామాట జవదాటరు. అసలు అమ్మాయి అబ్బాయి ఒకరికొకరు నచ్చితే మిగతా విషయాలు ఆలోచిద్దాం. ఒకరోజు ఎప్పుడైనా ఏదైనా పని మీద నావద్దకు వచ్చినప్పుడు నన్ను వాడి స్కూటర్ మీద మీ దగ్గర దింపమనీ అర్జెంటు పని వుందనీ వాడికేమీ చెప్పకుండా తీసుకవస్తాను. అప్పుడు మీరు వాడిని చూచి మీ అభిప్రాయం చెబితే తర్వాత మిగతా విషయాలు మాట్లాడదాము. అప్పటికి వరకు ఈ విషయాన్ని మనిద్దరి మధ్యే ఉంచుకుందాం" అన్నాడు.

రాజశేఖరం "నాకు తెలుసు గంగాధరం, నువ్వు కార్యసాధకుడివి. పైపెచ్చు మనిద్దరి మధ్య విడదీయలేని స్నేహబంధం ఉంది. అందుకని నా మనసులోని మాటలు ఎవరికి చెప్పాలా అని సుదీర్ఘంగా ఆలోచించి నిన్ను ఎన్నుకున్నాను. నీవు

చెప్పిన విషయాలు నాకు అన్నివిధాలా బాగున్నాయనిపిస్తున్నది. ఎందుకంటే నీకు తెలిసిన కుర్రాడు, నీ మేనల్లుడు, అంతకంటే మంచి సంబంధం మనకు ఎక్కడ దొరుకుతుంది? పిల్లవాడు చక్కగా వ్యాపారం చేసుకుంటున్నాడు. నేను ఆలోచించేది కూడా ఇలాంటి సంబంధం కోసమే. నీకు ఎప్పుడు తీరిక చిక్కితే అప్పుడు నువ్వు అనుకున్న విధంగా ఈ రెండు కార్యక్రమాలు పూర్తిచేయి. నేను ఎక్కడికీ వెళ్ళను కాబట్టి నీవు ఎప్పుడైనా ఆ అబ్బాయిని తీసుకరావచ్చు. రెండవది రిజిస్ట్రేషన్ రెండు మూడు రోజుల్లో జరిగే విధంగా చూడు" అన్నాడు. "ఖర్చులకు ఏవైనా డబ్బు కావాలా" అన్నాడు.

"అవసరం లేదు. నాదగ్గర ఉందిలే తర్వాత తీసుకుంటాను" అన్నాడు గంగాధరం.

ఈలోగా రాజ్యం తెచ్చిన తినుబండారాలు తిని మజ్జిగ తీసుకొని బయలుదేరాడు గంగాధరం.

రాత్రి తొమ్మిది గంటల తర్వాత రాజశేఖరం కుర్చీలో కూర్చొని ఉన్నాడు. రాజ్యం కోటయ్య చెరొక వైపు నిలబడ్డారు.

రాజ్యం, "మీరు ఉదయం గంగాధరం అంకుల్‌తో మాట్లాడిన విషయాలు విన్నాను, ఇప్పుడు నా పేరున భూమి రిజిష్టేరు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది. అసలు భూమితో నాకు పనేమిటి. మీ ఆలోచనను మరొకసారి పరిశీలిస్తే బాగుంటుందని అనుకొంటున్నాను" అన్నది.

కోటయ్య "అమ్మాయి ఆలోచన సరైనదని నాక్కూడా అనిపిస్తున్నది అయ్యా!, మీరు ఆలోచించండి. అయినా ఆరు ఎకరాల భూమి ఇప్పుడు అమ్మాయి పేర రిజిష్టర్ చేస్తే మిగతావాళ్ళు అనేక రకాలుగా అనుకుంటారని నా ఉద్దేశ్యం. అదీకాక లేని పోని గొడవలకు దారితీసినట్టవుతుంది. ఈ విషయంలో నాకెందుకో జంకుగా ఉంది" అన్నాడు.

రాజశేఖరం "ఈ ప్రపంచాన్ని గురించి నీకు మీ నాయనకు కొంతే తెలుసు, ఏదైనా జరిగి నేను గుటుక్కుమంటే మిమ్ములను ఒక్కక్షణం కూడా ఇక్కడ

ఉండనీయరు. అందులోను సతీష్ పగబట్టిన పాము. నామీద మీకు నమ్మకముంటే నేను చెప్పినట్టు చేయండి. మీరు ఉండే ఇల్లు గిఫ్ట్‌గా మీకిచ్చినట్టు బయట ప్రపంచానికి తెలుస్తుంది. ఆ ఆరు ఎకరాలు భూమి గత నలభై ఏళ్ళుగా కోటయ్య కష్టపడి దాచిపెట్టుకున్న సొమ్ముతో కొన్నది. అది నేను ఇచ్చేది కాదు. కాదంటే అతనికి ఈ విషయాలన్ని తెలియవు కాబట్టి నాపేరు మీద రిజిష్టర్ చేయించి ఉంచాడు. ఆ భూమి నాది కాదు. దానిమీద నాకు హక్కులేదు. అంతేగానీ నేనేదో నా ఆస్తినంతా మీకు దాన ధర్మాలు చేస్తున్నాను అన్న ఊహ ఎవరికి వచ్చినా ఎవరన్నా దానికి నా జవాబు ఇదే. అందుచేత కోటయ్య భూమిని కోటయ్యకివ్వడానికి నా పెత్తనం ఏమిటి. రేపు ఏదైనా జరిగితే నా బిడ్డలు ఆ భూమిని మీకిస్తారా? నాకు తెలుసు. అందుచేత దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి".

మరలా "నాకు కొన్ని బాధ్యతలు ఉన్నాయి. వాటిని నిర్వర్తించకుండా నేను హరీ అంటే మీ గతి ఏమౌతుంది? అన్నివిధాలా ఆలోచించి నేను చేయవలసిన పనులను నెరవేరుస్తున్నాను" అని ఆపి వెంటనే "అయినా నేను చేసేదానికి మీరు అభ్యంతరం పెట్టడం ఏమిటి? నా ఆస్తిని నేను ఇష్టం వచ్చిన వాళ్ళకు ఇచ్చుకుంటాను. ఎవరు అడుగుతారు? అడిగేందుకు ఎవరికి హక్కు ఉంది. అందుచేత అనవసరమైన ఆలోచనలతో తండ్రి కూతుళ్ళు గుట్టును రట్టుచేయవద్దని, ఆ విషయం ఎక్కడా ఎవరితో ముచ్చటించవద్దని పదే పదే చెబుతున్నాను. అదీకాక రేపు పొద్దున కోటయ్య కష్టం చేయలేని పరిస్థితులలో ఉంటే ఊరికే కూర్చోబెట్టి ఎందుకు తిండిపెట్టాలి అని నీ భర్త అనడా? ఒకవేళ అంటే నీ దగ్గర జవాబు వుండదు కదా? కాదంటే అనవసరంగా భర్తతో నీవు తగవుబెట్టుకోవాలి. అందుచేత ఆయన పేరుతో కొంచెం, నీపేరుతో కొంచెం భూమి ఉండిపోతే ఎవరి పరిధిలో వాళ్ళు నడుచు కుంటుంటారు. అసలు ఏ కుమారుడైనా అల్లుడైనా మనదగ్గర ఆస్తి వుంటే చూపే గౌరవం వేరేవిధంగా ఉంటుంది" అన్నాడు.

కోటయ్య "మీరు చెప్పేవన్నీ అనుభవంతో చెప్పే మాటలు అయినా మీ గొప్ప మనస్సు నన్ను సిగ్గుతో తలవంచు కునేట్టు చేస్తున్నది. రాజ్యానికి కూడా మనస్సు సంతోషంగా లేదు" అన్నాడు.

రాజశేఖరం "రాజ్యం చిన్నపిల్ల, తనకు ప్రపంచం ఏమి తెలుసు. తనను వదిలేయి. మంచి మనస్సు అనే మాటకు మాకంటే నీకే ఎక్కువ అర్థం తెలుసు. నీ విశాల హృదయం ముందర మేమంతా చాలా అల్పులము. ఇప్పుడు అవన్నీ ఎందుకు. ఇంతెందుకు ఇంత ఆస్తి పలుకుబడి ఉండి కూడా నేను ఫామ్ హౌస్‌లో మీ పుణ్యమా అని సంతోషంగా కాలం గడుపుతున్నాను. అదే లేకుంటే నాగతి ఎలా వుండేదో నీవు ఒక్కసారి ఆలోచించి చూడు. ఇది మాయా ప్రపంచం. డబ్బుకు ఉన్న శక్తి మరొకదానికి ఉండదు. డబ్బుంటే అందరూ ఉంటారు. డబ్బు లేకపోతే పలుకరించేవారుండరు. ఇప్పుడు నా దగ్గర డబ్బుంది కాబట్టి ఇంకా నా బిడ్డలు నా మాట వింటున్నారు. లేకుంటే, పేడలో పుట్టి పేడలో పోయే పేడ పురుగులా జీవితం గడపాల్సి వచ్చేది. అందుకనే నేను ఆస్తిని పంచదలచుకోలేదు.

నేను బతికి ఉన్నంతకాలం ఇలానే జరిగిపోనీ. పంచానంటే నీ అబ్బకు నా అబ్బ ఏమౌతాడు అని అడుగుతారు. అప్పుడు మనం జవాబు చెప్పాల్సివస్తుంది. ఇన్నేళ్ళు నీవు సంపాదించినది పొదుపు చేసుకొని ఎందుకూ పనికిరాని భూమిని చదునుచేసి పంటలకు యోగ్యంగా చేసిన నీ శ్రమ వృథా అయిపోతే ఇక నీవు ఎందుకు పనిచేసినట్టు. అందుచేత నీకు ఆరు ఎకరాలు కాదు సగభాగం ఈ భూమిలో హక్కు ఉంది. మీరు కాదంటే సగం మీపేరిట వీలు రాసిపెడతాను. ఆపైన మీ ఇష్టం" అని ముగించాడు.

కొంచెంసేపు వాదోపవాదాలు, తర్జనభర్జనలు జరిగి మనసు అలసి పోయేంత వరకు మాట్లాడుకుని నిద్రాదేవిని ఆహ్వానించారు. మరుసటి దినం అనుకున్నది అనుకున్నట్టుగా గుట్టుగా ఇతరులెవరికి తెలియకుండా రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. నాలుగు రోజుల తర్వాత గంగాధరం మేనల్లుడితో పెళ్ళిచూపులు, మరొక వారం తర్వాత నిశ్చితార్థం జరిగిపోయింది. మంచిరోజులు లేవని నాలుగు నెలలు దాటిన తర్వాత ముహూర్తం పెట్టుకున్నారు.

* * * * *

# 11

నితీష్ అమెరికా నుండి వచ్చాడు. రాగానే భార్యాపిల్లలతో  తోటకు వచ్చి రాజశేఖరంతో ఒకరోజంతా గడిపాడు. తోటంతా సందడే సందడి.  ఆ వాతావరణాన్ని చూచి చాలా ఆనందించారు. కుక్కలను  పక్షులను నెమళ్ళను, రకరకాల చెట్లను, పూవులను పేరు పేరున అడిగి తెలుసుకొని ఆనందించారు.

నితీష్ పిల్లలతో    సతీష్ అన్నయ్య  ఇంట్లో రెండు రోజులు గడిపి భార్య తరపు చుట్టాలను చూడ్డానికి ప్రయాణమయ్యారు.  పదిరోజులు అన్ని ఊళ్ళు తిరిగి మరలా రాజశేఖరం తోటలో రెండు రోజులు గడిపారు.

నితీష్, సతీష్‌తో అనేక వ్యాపార విషయాలు మాట్లాడాడు. సతీష్‌తో ఒకటి రెండు రోజులు ఆఫీసుకు కూడా పోయి కొంత టైము గడిపి వచ్చేవాడు. సతీష్ తాను పెట్టిన కన్‌స్ట్రక్షన్ మెటీరియల్,  టైల్స్, సిమెంటు, స్టీలు షాపులన్నింటినీ నితీష్‌కు చూపించాడు. షాపులన్నీ చాలా చక్కగా అమర్చి తగినన్ని గోడౌన్‌లతో మూడుపువ్వులు ఆరుకాయలుగా నడుస్తున్నట్టు అనిపించింది  నితీష్‌కు. అయితే సతీష్ మాటల్లో పెద్దగా లాభాల్లేవు అన్నట్టు, కన్‌స్ట్రక్షన్ మెటిరియల్ వ్యాపారాలు లాభసాటిగా లేవనీ, బ్యాంకు వడ్డీలు వర్కర్స్ జీతాలు అన్నీ పోను కొంచెమే మిగులుతున్నదని చెప్పసాగాడు. మొదట తాను షాపు పెట్టినప్పటికీ నేటికీ పోటీ బాగా పెరిగిపోయిందని ఇప్పుడు టౌన్‌లో ముప్పై షాపులదాకా ఉన్నాయని తమ్మునితో సందర్భాన్ని బట్టి చెప్పసాగాడు. అంటే ప్రస్తుత వ్యాపారం పెద్ద లాభసాటిగా లేదని నితీష్‌ను నమ్మించాలని ప్రయత్నం చేయసాగాడు అన్న విషయం నితీష్‌కు అర్థమవుతున్నది.

నితీష్ ఒకరోజు ఉదయాన్నే గెస్ట్‌హౌస్ దగ్గరకు వచ్చాడు. అక్కడే నాన్నతో కూర్చొని బ్రేక్‌ఫాస్ట్ చేశాడు. రాజ్యం వంట రుచికి పులకరించిపోయాడు.

“నీ అదృష్టం బాగుంది డాడీ! నీవు తోటలో కాపురం పెట్టకుండా అన్నయ్య వాళ్ళ ఇంటిలో ఉంటే తిండికి వాచిపోయేవాడివి. నాకు రాజ్యం చేతివంట తింటుంటే చిన్నప్పుడు మనింట్లో ఉన్న వంటామె కళ్యాణమ్మ గుర్తుకు వచ్చింది. ఆరోజుల్లో ఎంత రుచిగా చేసేదో” అన్నాడు.

రాజశేఖరం “అవును రా! చల్లటి వేళలో ఆ మహాతల్లిని గుర్తు చేసుకున్నాం. చాలా బాగా వండేది. ఏది చేసినా ఎంతో రుచిగా ఉండేది. పైగా ఎంత ప్రేమగా వడ్డించేదో ఎవరికి ఏం కావాలో వాళ్ళకు తగిన విధంగా వంట వండేది. నిజమే! నీవన్నట్టు రాజ్యం కూడా చాలా రుచిగా చేస్తుంది” అన్నాడు.

కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడి చివరకు మనసులో ఉన్న మాటను బయటపెట్టాడు.

“డాడీ! నేను రెండుమూడు రోజులుగా సతీష్ అన్నయ్యతో షాపులకు వెళుతున్నాను. చాలా బాగా జరుగుతున్నాయి” అని ఇంకా ఏదో చెప్పబోతుంటే

రాజశేఖరం అందుకొని “పాత షాపు కదా! బ్రాండ్ నేమ్ ఉంది. స్టాండర్డ్ కస్టమర్స్ ఉంటారు. పైగా సతీష్ రూపాయి దగ్గర చాలా జాగ్రత్తగా ఉంటాడు” అన్నాడు.

నితీష్ “నేను చెప్పబోయేది కూడా అదే డాడీ! అంత బాగా జరుగుతుంటే, లాభాలు రావడం లేదనీ కాదంటే ఏదో జరిగిపోతున్నదనీ, ఏదో ఒకటి చేయాలి కదా అని చేస్తున్నాననీ, పది మంది మన వల్ల బ్రతుకుతున్నారని అంటున్నాడు అన్నయ్య” అన్నాడు.

రాజశేఖరం ఏమీ మాట్లాడలేదు. మరలా నితీష్ అందుకొని “లాభాలు లేకుంటే అంత కష్టపడి వ్యాపారం చేయడం ఎందుకు? నేను అన్నయ్య మాటల్లో నిజం ఉందనుకోవడం లేదు. మీరు ఏమనుకోనంటే ఒక మాట చెబుతాను డాడీ! అక్కడ జరిగే విషయాలు మీకు తెలియకూడదనీ, వారు చేసే పనులకు మీరు అభ్యంతర పెడతారనీ, మిమ్ములను చల్లగా ఇక్కడికి పంపించేసినట్టున్నారు”.

మరలా "స్వంతంగా కొన్ని ఆస్తులను కూడబెట్టుకున్నాడని విన్నాను. అది ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచాడు. బినామీ వ్యవహారాలు, వ్యాపారాలు చాలా జరుగుతున్నట్టున్నాయి. మీరు ఏమనుకున్నా నా మనసులోనున్నది చెప్పాలనుకున్నాను. ఎందుకైనా మంచిది పరకో పాతికో పంచుకుంటే పోదా" అన్నాడు.

"నేను ఉండగానే పంపకాలు మధ్యస్తాలు జరిగితే, నలుగురిలో పరువు పోతుందని నేను మెదలకుండా ఉన్నాను" అన్నాడు రాజశేఖరం.

"అయితే మీ తదనంతరం మా చేతికి చిప్ప ఇచ్చి, అప్పులు చూపిస్తే మాకు న్యాయం చెప్పే వాళ్ళు ఎవరుంటారు" నితీష్ అన్నాడు.

ఈవిధంగా ఉదయం ప్రారంభమైన చర్చ మధ్యాహ్నం భోజనం, సాయంత్రం ఫలహారం టీ త్రాగే వరకు సాగుతున్నది. చివరకు ఇద్దరూ ఒక తీర్మానానికి వచ్చారు. ఒక వీలునామా తయారు చేసి ఉన్న స్థిరాస్తిని అలానే వుంచి రాజశేఖరం తదనంతరం ఎవరిది వారు తీసుకునేట్టు, సతీష్ షాపు ద్వారా సంపాదించినదాట్లో లెక్కలు చూచి ఇప్పుడున్న ఆస్తి దామాషా ప్రకారం మూడూ భాగాలుచేసి అన్నదమ్ములు చెరొక భాగం తండ్రికి మరొక భాగం పంచుకునే నిర్ణయానికి వచ్చారు. తండ్రి భాగాన్ని ఆయన తదనంతరం నళినితో కూడా అందరూ పంచుకునేట్టు తీర్మానించారు.

రాబోయే రోజుల్లో సతీష్ షాపును తానే స్వంతంగా జరుపుకునేట్టు, నితీష్ తన భాగానికి వచ్చిన డబ్బుతో ఈ దేశంలోనైనా అమెరికాలోనైనా పెట్టుబడులు పెట్టుకునేట్టు ఆలోచనకు వచ్చారు.

ఇప్పుడు రాజశేఖరం ఉంటున్న తోటలోని ఆదాయం రాజశేఖరం భాగానికి వచ్చేట్టు రాసుకోవాలి. ఆయన తన ఇష్టప్రకారం ఎవరికి ఇచ్చుకున్నా అభ్యంతరం ఉండకూడదు. ఈవిధంగా ఒక వీలునామా వ్రాయించే ఏర్పాటు చేయాలని, ఈ విషయాన్ని సతీష్‌తో చెప్పి ఒప్పించాలని నిర్ణయించారు. దీనికి నితీష్ సతీష్‌తో చర్చ ప్రారంభించేందుకు తండ్రి ఆజ్ఞ తీసుకున్నాడు. కానీ దానికి సతీష్ అనేక అభ్యంతరాలు పెడతాడనీ, అయినా ఏదో ఒక రకంగా ఒప్పించాలనీ పట్టుదలతో అక్కడనుండి ఇంటికి ప్రయాణమయ్యాడు.

రెండు రోజులు తర్వాత ఆదివారం నాడు అన్నదమ్ములు, సతీష్ నితీష్ ఉదయాన్నే తోటకు వచ్చారు. సతీష్ వీలునామా విషయాన్ని ఎత్తితే వాళ్ళిద్దరికీ ఘర్షణ రావచ్చు. అది జీవితాంతం ఉంటుంది. అందుచేత తానే ఆ చర్చకు శ్రీకారం చుట్టాలనుకున్నాడు. రాజశేఖరం. ఒకవేళ వాళ్ళ మనసుకు కష్టం కలిగినా తనమీదనే కలుగుతుంది. కనీసం వాళ్ళు ఇద్దరైనా అభిమానంతో ఉంటే అదే చాలు. ఇప్పుడు ఎలాగూ పొంగిపోయేంత ప్రేమ లేదు. అందుచేత ఇద్దరినీ తోటకు రమ్మని ముందురోజే కబురు చేశాడు. బ్రేక్‌ఫాస్ట్ పూర్తయిన తర్వాత రాజశేఖరం మాట్లాడడం మొదలు పెట్టాడు.

"సతీష్! మొన్న నితీష్‌తో నేను చర్చించాను. ఇక్కడ షాపు వ్యవహారాలన్నీ నెత్తిన వేసుకొని రాత్రింబవళ్లు నీవు కష్టపడుతున్నావు. అందుకు నీకు వచ్చే వేతనం మీ తమ్ముడికి అమెరికాలో వచ్చే వేతనం కన్నా తక్కువే. అందుచేత స్థిరాస్తులను చరాస్థులను ఇద్దరికీ భాగాలు పెట్టి ఒక వీలునామా తయారుచేయాలనుకున్నాం. అది నా తదనంతరం మీరు తీసుకొని అనుభవించుకోవచ్చు. షాపు మొత్తం నీవు తీసుకుంటే, నితీష్ అమెరికాలో సంపాదనను తాననుభవిస్తాడు. చరాస్తులను ఇప్పుడే పంచుకోండి. నా ఖర్చులకు గాను కొంచెం క్యాష్ ఇచ్చి మిగతాది అంతా మీరు తీసుకోవచ్చు. ఈ తోట నా స్వంతం. దీనిలో ఫలసాయం అమ్ముకునేందుకు లేదా దానమిచ్చేందుకు నాకు అధికారం ఉంటుంది. నా తదనంతరం మీరందరూ సమానంగా తీసుకోవచ్చు. ఇది నా ఆలోచన. ఇంటికి పెద్దవాడవు. నీ ఇష్టం చెబితే తరువాత ఏదైనా ఆలోచన వుంటే నీ తమ్ముడికి అవకాశం ఇవ్వవచ్చు" అన్నాడు.

సతీష్ లోలోపలే సంతోషించాడు. ఇంతబాగా సులభంగా భాగపరిష్కారం అవుతుందని అనుకోలేకపోయాడు. షాపులు కష్టం లేకుండా తన వశం అవుతాయని, ఇకపై వాటిమీది లాభాలను అందరికీ పంచాల్సిన అవసరం లేదన్న దాంతో ఎగిరి గంతేయాలనిపించింది.

సతీష్ "మీరు మా మంచికోరేవారు. మీకెలా అనిపిస్తే అలా చేయండి" అన్నాడు. లోలోపలే తోటను ఎలాగూ నిదానంగా స్వంతం చేసుకోవచ్చు. అమెరికాలో ఉండేవాడు ఈ తోట దగ్గరకు రాలేడు, రానివ్వను కూడా అని అనుకున్నాడు.

రాజశేఖరం "మీ అభిప్రాయం ఏమిటి నితీష్" అన్నాడు.

"మీరు ఏది న్యాయమనుకుంటే అలాగే చేయండి డాడీ!" అన్నాడు.

లోలోపల అమెరికాలో తాను సంపాదించిన ఆస్తుల లెక్కలు అడగకుండా ఉంటే చాలు అనుకున్న నితీష్‌కు సులభంగా పని జరిగిపోయిందని అనిపించింది.

అందరూ ముచ్చట్లాడు కుంటూ మధ్యాహ్నం భోజనం పూర్తిచేశారు. ఇద్దరూ బయలుదేరుతుంటే రాజశేఖరం "రేపు ఆడిటర్‌ను పిలిచి వీలునామా డాక్యుమెంట్ తయారు చేయిస్తాను. తలా ఒక కాపీ ఇస్తాను. మీరు చదువుకొని మార్పులు చేర్పులు ఏదైనా కావాలనుకుంటే చేసుకుందురు" అన్నాడు. ఇద్దరూ సరేనని తలూపారు.

ఉదయం నుండి అక్కడ ఉన్నంతసేపు సతీష్ కళ్ళు రాజ్యంను వెతుకుతూనే ఉన్నాయి. పక్కరోజు ఆడిటర్ ద్వారా వీలునామా డాక్యుమెంట్ వ్రాయించి అసలు ప్రతిని తనవద్ద వుంచుకొని చెరొక నకిలీని అన్నదమ్ములకు ఇచ్చాడు.

నితీష్ భార్యాబిడ్డలతో అమెరికా వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఎవరికీ ఏ ఇబ్బంది లేదు. ఎవరి జీవితం వాళ్ళు గడుపుకొంటూ భవిష్య ప్రణాళికలను తయారు చేసుకుంటున్నారు.

* * * * *

నాలుగు నెలలు గడిచాయి. నిశ్చితార్థం రోజు తాంబూలాలు తీసుకున్న వెంటనే పెళ్ళి పనులకు శ్రీకారం చుట్టాడు రాజశేఖరం. పెళ్ళి ఆర్భాటంగా చేసేందుకు ఒక్కొక్కరికి ఒక్కొక్కపని అప్పజెప్పాడు. తోటలోనే పందిళ్ళు వేసి డయాస్ తయారుచేసి భోజనాలను ఎవరూ ఊహించనంత ఘనంగా పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేశాడు. పెళ్ళిపీటల మీద కన్యాదాతలుగా సతీష్‌ను అతని భార్యను కూర్చోమన్నాడు రాజశేఖరం. కాని తనకిష్టంలేదని కాదన్నాడు. నళిని తన భర్త ప్రకాశరావు పీటల మీద కూర్చున్నారు. పెళ్ళి రెండురోజులు జరిగింది. భోజనాలకు ఆ చుట్టుపక్కల వాళ్ళను తమ కమతంలో పనిచేస్తున్న అన్ని కుటుంబాల వాళ్ళను, తనకు ముఖ్యమైన స్నేహితులను, కోటయ్యకు ఎరుకలో వున్నవాళ్ళను అందర్నీ పిలిచి తృప్తిగా

భోజనాలు పెట్టి, కొంతమందికి వస్త్రాలు బహుమానాలు ఇచ్చి ఘనంగా కార్యక్రమం జరిపించాడు రాజశేఖరం. అయితే ఇంత హంగామా చేయడం సతీష్‌కు గాని నళినివాళ్ళకు గాని నచ్చలేదు. అయినా దీనికి కర్త కర్మ క్రియ ఎవరో పూర్తిగా తెలియని కారణంగా, గంగాధరం లాంటి వారి ద్వారా పెళ్ళికొడుకువాళ్ళే ఇలా జరగాలని కోరుకున్నారన్న రూమర్లు ఉన్నందున ఎవరూ ఏమీ మాట్లాడడానికి సాహసించలేదు.

రాజ్యం వాళ్ళు ఉన్న ఇంటిని పెంచి రిపేర్లు చేసి కొత్తగా తయారుచేశారు. దాదాపుగా అన్ని హంగులతో కొత్తగా తయారైన ఇంట్లో రాజ్యం తన భర్త రవిచంద్రతో కాపురం పెట్టింది. కోటయ్యకు రాజశేఖరానికి ఆనందం అంచులు దాటుతున్నది. వాళ్ళ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. వాళ్ళిద్దరి కళ్ళముందు రాజ్యం భర్తతో సంతోషంగా ఉందన్న విషయం అర్థమయ్యే కొద్దీ ఇద్దరు తండ్రులు ఆనంద సముద్రంలో తేలియాడుతున్నారు.

* * * * *

సముద్రం ఎంత పెద్దది అయినా, ఎండిపోవడంలేకపోయినా, అలలతో నిరంతరం ఘోషిస్తూ ఉండడం సహజం, అలానే జీవితం కూడా ఘర్షణ లేకుండా నడవదు. వచ్చే అల వస్తుంటే, పొయ్యే అల పోతూ వుంటుంది.

ఒకరోజు సాయింత్రం మూడు గంటల ప్రాంతంలో సతీష్ వచ్చాడు. రాజశేఖరం కుర్చీలో కూర్చొని ఏదో పుస్తకం చదువతున్నాడు. సతీష్ రాకను గమనించి బయటికి వచ్చిన రాజశేఖరం,

"రా కూర్చో! ఏమి ఇప్పుడు మంచి ఎండలో వచ్చావు?" అన్నాడు. అంతరాంతల్లోని పితృప్రేమ అలా మాట్లాడిస్తుంది కాబోలు అనుకుంటూ ఏమీ మాట్లాడకుండా కుర్చీలో కూర్చున్నాడు సతీష్.

నాగమ్మ ట్రేలో నీళ్ళగ్లాసు, మజ్జిగ గ్లాసు తీసుకొని వచ్చింది. "అక్కర్లేదు" అన్నాడు. "మీరు తీసుకుంటారా అయ్యగారూ" అన్నది. రాజశేఖరం మజ్జిగ గ్లాసు తీసుకొని కొంచెం కొంచెం చప్పరిస్తూ తాగుతున్నాడు. నాగమ్మను వెళ్ళమని చేత్తో చేసిన సంకేతంతో అక్కడనుండి కదిలి లోపలికి పోయింది.

సతీష్ “రాణిగారు లేరా! ఆమెకు ప్రమోషన్ వచ్చింది కదా! అందుకని ఇంటిపని నాగమ్మకు అప్పచెప్పిందా! అంతేలే! ఇప్పుడు ఆమె యజమానురాలు కదా!” అన్నాడు.

రాజశేఖరానికి సతీష్‌లో ఏదో అలజడి ఉందనీ, బాధ తొలుస్తున్నదని అర్థమయ్యింది. అయినా అనవసరంగా మాట్లాడి ఎందుకు వాతావరణాన్ని చెడగొట్టడం అని మజ్జిగ త్రాగడం పూర్తిచేసి గ్లాసు కిందపెట్టాడు.

రాజ్యం లోపలినుండి వచ్చి “బాగున్నారా అన్నయ్యా!” అని పలకరించింది.

“ఎవడే నీకు అన్నయ్య! రంకు బొంకు విద్యల్లో ఆరితేరిపోయావు. నాతో నీకు ఏమి సంబంధం ఉంటే నన్ను అన్నయ్యా అని పిలుస్తావు!” అన్నాడు.

కొంచెం ఆగి “నిన్ను అనుకొని ఏమి లాభం. ఈ ముసలోడు... ఇంక నాకు బూతులు వస్తాయి, చేసిన దరిద్రపు పనులను గురించి అనుకోవాలి” అని ఆగి మరలా మాట్లాడసాగాడు.

“అసలు మా ఆస్తిలో నీకు వాటా ఏమిటి? నీకు ఆరు ఎకరాలు ఎక్కడినుంచి వచ్చాయి. ఈయన గారు చేసిన నిర్వాకం కాకపోతే. అంత దానానికి నీకు అర్హత ఉందా? నీకు మా భూమిలో భాగం ఎందుకు ఇయ్యాలి? అసలు నువ్వు ఇక్కడ ఎందుకు ఉండాలి? పెళ్ళి అయిందానివి మొగుడుతో పోయి చావకుండా, ఇక్కడ ఉండడం ఏమిటి” అన్నాడు. రాజశేఖరం, రాజ్యం ఏమన్నా మాట్లాడితే వాడు ఇంకా రెచ్చిపోయే సూచనలు కనబడుతున్నాయని మౌనంగా ఉన్నారు.

సతీష్‌ను అంత కోపంగా ఎన్నడూ చూడలేదు రాజశేఖరం.

సతీష్ “అక్కడ కొంపలో వుంటే ఏదో ఒక రచ్చ ఉంటుందని ఇక్కడ తగలబెడితే, ఇంకొక రచ్చను లేవదీశాడు” అన్నాడు.

సతీష్ కుర్చీలోనుంచి లేచి రాజ్యం దగ్గరికిపోయి “నీ మొగుడితో వాళ్ళ కొంపలో కాపురం పెట్టుకోకుండా మాతోటలో తిష్టవేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?” అన్నాడు.

రాజశేఖరం "అది కోటయ్య ఇల్లు. వాళ్ళు ముప్పైఏళ్ళుగా అందులో ఉంటున్నారు. దాన్ని ఏనాడో వాళ్ళకు రాసి ఇచ్చి ఉన్నాను. వాళ్ళింట్లో వాళ్ళు ఉండడానికి ఎవరి పర్మిషన్ కావాలి? దానికి నీవు అభ్యంతరం పెట్టాల్సిన అవసరం ఏముంది? " అన్నాడు.

సతీష్ "ఈ ఇల్లు వాళ్ళకు రాసిచ్చేందుకు ఎవరికి అధికారం ఉంది" అన్నాడు.

"ఈ తోట నాది. వీలునామా అప్పుడే మర్చిపోయావా? ఇది నా భాగానికి తీసుకొన్నాను. మిగతా ఆస్తులను మీకు పంచి ఇచ్చాను కదా! ఇది నా యిష్టం నేనెవరికైనా రాసిస్తాను" అన్నాడు.

సతీష్ రాజశేఖరం దగ్గరకి వచ్చి కుర్చీలో కూర్చొని ఉన్నవాడిని చేయి పట్టుకొని "నీకున్న హక్కు నీవు ఉన్నంతవరకు అనుభవించేదానికి కాని ఇతరులకు దానధర్మాలు చేసేందుకు కాదు. నీ తదనంతరం ఈ ఆస్తి మాది" అన్నాడు.

రాజశేఖరం "నీవెవరురా మాట్లాడడానికి. నన్ను ప్రశ్నించే స్థితికి వచ్చావు. నువ్వనుకునే ఆరెకరాలు మనది కాదు. నలభై సంవత్సరాలుగా కోటయ్య కాయ కష్టం చేసి దాచిపెట్టుకొన్న డబ్బుతో కొనుకున్న భూమి. దానిమీద నాకు, మీకు హక్కులేదు. ఈ తోట నేను సంపాదించినది. నేను వేసిన బిచ్చం తీసుకొని పోవడానికి మాత్రమే మీకు అవకాశం ఉంది. హక్కుల గురించి అడిగేందుకు నీకు అర్హత లేదు. ఇవన్నీ నీవు ఎందుకు అడుగుతున్నావో, నీ మనసులో వున్న కుళ్ళు కుతంత్రం ఏమిటో చెల్లెలిలాంటి దాన్ని ఏ దృష్టితో చూస్తున్నావో నాకు తెలియంది కాదు" అని కుర్చీలోంచి ఉద్రేకంతో లేవబోతున్న రాజశేఖరాన్ని గట్టిగా పట్టుకొని మరలా కుర్చీలో కూలబడేట్టు తోశాడు సతీష్.

రాజశేఖరం లేవాలని ప్రయత్నం చెయ్యడం, సతీష్ గట్టిగా వెనుకకు నెట్టడంలో రాజశేఖరం కుర్చీలోంచి ద్రొర్లి కిందపడ్డాడు. వెనుకకు పడడంతో తలకు దెబ్బతగిలి నెత్తురు కారడం మొదలు పెట్టింది. ఇంతలో రాజ్యం "నాయనా! నాయనా! అని పెద్దగా అరుస్తూ నాగమ్మా త్వరగా రా!" అంటూ ఆయనను లేపే ప్రయత్నం చేస్తుంటే సతీష్ రాజ్యం జుట్టు పట్టుకొని పైకిలేపి చెంపమీద చెళ్ళున

రెండు దెబ్బలు వేశాడు. ఇంతలో నాగమ్మ రాజశేఖరాన్ని లేపి నిలబెట్టి తాగడానికి నీళ్ళ గ్లాసును అందించింది.

కుర్చీలో ఉన్న టవల్ నీళ్ళలో తడిపి, గాయం దగ్గర నెత్తురు రాకుండా వొత్తి పెడుతున్నది రాజ్యం. సతీష్ టవల్ పెరుక్కొని అవతలికి విసిరివేశాడు. మరలా తండ్రి మీదకు ఉరికి రెండు చేతులు గొంతు దగ్గర పెట్టి “ఇప్పుడు చెప్పు నాకు హక్కు లేదా? ఇప్పుడే ఇక్కడే నిన్ను చంపేస్తాను. దాన్ని కూడా వదలను” అని అరుస్తూ గొంతు పట్టుకొని పిసికే ప్రయత్నంలో పెద్దగా అరుస్తున్నాడు.

“చెప్పు లేకపోతే చంపేస్తాను. హక్కు ఉందంటేనే వదుల్తాను” అన్నాడు. కాసేపాగితే సతీష్ తండ్రిని చంపేసేట్టు ఉన్నాడు. ఈ భయంకర పరిస్థితిలో రాజ్యం పూనకం వచ్చిన దానిలా గబగబా లోనికి వెళ్ళి, కత్తిపీట తీసుకొని వచ్చి వెనుక నుండి సతీష్ వీపు మీద ఒక వేటు వేసింది. ఆ దెబ్బతో అరుస్తూ రాజశేఖరాన్ని వదిలి క్రిందపడిపోయాడు. నెత్తురు కారుతున్నది.

ఇంతలో రాజ్యం భర్త వచ్చాడు. పరిస్థితిని గమనించి కార్లో నిద్రపోతున్న డ్రైవరును లేపి, సతీష్‌ను రాజశేఖరాన్ని హాస్పెటల్‌కు తీసుకెళ్ళాడు. డాక్టర్ సతీష్‌ను ఐ.సి.యు. లోచేర్చి గాయానికి కుట్లువేసి చాలా రక్తం పోయినందున రక్తం ఎక్కించ సాగారు. రాజశేఖరం గాయానికి కట్టు కట్టారు.

రాజ్యం, రాజశేఖరం స్నేహితుడు గంగాధరానికి ఫోన్‌చేసి పిలిపించింది. గంగాధరం వచ్చి దీన్ని పోలీసుల దాకా పోనీయకుండా ప్రయత్నాలు చేయసాగాడు.

* * * * *

రాజశేఖరానికి సతీష్ ప్రవర్తనతో జీవితం మీద విరక్తి కదిలింది. గంగాధరం ద్వారా తన ఆప్తమిత్రులందరికీ తెలిసిపోయింది. మిత్రులు వచ్చి రాజశేఖరాన్ని ఓదార్చారు. ఇది అంతం కాదు ఆరంభం అయితే ఏంచేయాలి అన్న విషయం మీద పెద్ద చర్చ జరిగింది. పైపెచ్చు ప్రస్తుత పరిస్థితుల్లో అనేక కుటుంబాల్లో జరుగుతున్న ఘోరమైన సంఘటనలు ఉదహరిస్తూ మాట్లాడసాగారు.

సూర్యప్రకాశం "నీవు చాలా అదృష్టవంతుడివి రాజశేఖరం! బిడ్డలు తల్లిదండ్రులను తరిమివేస్తే లేదా వాళ్ళను అనేక రకాల హింసలకు గురిచేస్తే వేరే మార్గం లేక ఆత్మహత్యలకు పాలుపడుతున్నారు. నీ అదృష్టం రాజ్యం, ఆమె తండ్రి భర్త మిమ్మల్ని కంటికి రెప్పలా చూచుకుంటున్నారు. ఇప్పుడు నీవు ఏమాత్రం జంకినా నీ కుమారుడు. నీనెత్తిమీద కూర్చుంటాడు. అవసరమైతే పోలీసుల్ని కూడా ఆశ్రయిద్దాం" అని అన్నాడు.

ఈ సంఘటన వివరాలు తెలిసిన నితీష్ అమెరికా నుండి ఫోన్‌చేసి తండ్రిని ఆవిధంగా హింసించడం మంచిది కాదని సతీష్‌తో, కోపంతో, బాధతో కటువుగా మాట్లాడాడు.

ఇంత జరిగినా నళిని ఆవైపుకు రాలేదు. కానీ ఆమె భర్త ఆ సంఘటన జరిగిన రోజే హాస్పెటల్‌కు వచ్చి విచారించాడు. తండ్రి అన్నల మధ్య జరిగిన వీలునామా అగ్రిమెంటు వివరాలు తెలియడంతో, నళినికి ఎక్కడలేని కోపం అసూయతో వుంది. అందుచేత వాళ్ళకు ఎవరికీ ఫోన్ చేసి మాట్లాడడం లేదు. తండ్రి ఛాయలకు కూడా రావడానికి ఇష్టపడ లేదు. కాని తన తండ్రి మనస్సులో, తన భాగానికి వచ్చిన తోటలో, కొంత కూతురికి అల్లుడుకి ఇయ్యాలని ఉన్న విషయం నళినికి తెలియదు. నితీష్ తండ్రికి రోజు మార్చి రోజు ఫోన్ చేయసాగాడు. ఫోన్లో తండ్రితో "అవసరమైతే నేను వచ్చి రెండు వారాలు అక్కడ ఉండి అంతా సర్దుబాటు చేస్తాను మీరు బెంగపడవద్దు" అని ధైర్యం చెప్పాడు.

అయినా ఆస్తికోసం సతీష్ ఈ విధంగా ప్రవర్తించలేదు అన్నది తనకు మాత్రమే తెలుసు. రాజ్యం తనను తిరస్కరించడాన్ని సహించలేకపోయాడు సతీష్. తన అహం మీద దెబ్బ తగిలింది. ఆ విషయం పైకి చెప్పలేక ఆస్తి కారణంగా తాను ఈ చర్యలకు పాల్పడినట్లు అందరూ అసహ్యించుకుంటుంటే తనను తాను సమర్థించుకో లేని స్థితిలోకి వెళ్ళిపోయాడు. దీనికి అంతటికీ వాళ్ళ నాన్న రాణితో నడిపిన ప్రేమ కథ కారణమనీ, ఆనాడు పడ్డ బీజం ఈనాడు మహా వృక్షమైందనీ, దీనికి చాలా కార్యకారణ సంబంధం ఉందని ఎరిగిన వారు లేరు.

అయినా, ప్రేమ గుడ్డిది, "లవ్ ఈజ్ బ్లైండ్" లేకపోతే చరిత్రలో ఇన్ని యుద్ధాలు, సంఘర్షణలు, హత్యలు, ఆత్మహత్యలు, కష్టాలు, కన్నీళ్ళు ఉండేవి కాదు కదా! అసలు ప్రేమ అనే బ్రహ్మ పదార్థం లేకపోతే ఈ ప్రపంచంలో అనేకమంది బ్రహ్మచారులుగా, కుమారీలుగా జీవితాలను గడిపేస్తూ ఉండేవారేమో!

జరిగిన సంఘటనతో అందరూ తనను ఏవగించుకున్న కారణంగా తాను ముందుకు వేయాలనుకున్న అడుగును ఆలోచనను వెనక్కు తీసుకోవడానికి సతమతమౌతున్నాడు సతీష్.

రాజశేఖరం జీవన పయనం ఒడుదుడుకులు లేకుండా గడిచిపోతున్నది. రాజ్యం ఆడబిడ్డను ప్రసవించడం అందరికీ ఆనందమయింది. రాజ్యం తన అమ్మ రాణి మరలా తన కడుపున పడ్డదని సంతోషపడ్డది. రాజశేఖరం కోటయ్య మరలా రాణిని చూచినట్టుగా సంతోషపడి, అందరూ ఏక గ్రీవంగా 'రాణి' అని నామకరణం చేశారు. రాజశేఖరం కోటయ్య ఆ బిడ్డతో ఆడుకుంటూ తమ జీవితంలో పొందలేనివి, పోగొట్టుకున్నవి స్వంతం చేసుకుంటున్నారు.

* * * * *

# తరాలు అంతరాలు

మానవ జీవితంలో ఒక తరానికి, మరొక తరానికి అంతరం సహజం. ప్రతివ్యక్తి జీవిత పరిణామక్రమంలో బాల్య, యౌవ్వన, కౌమార, వార్ధక్య దశలుంటాయి. మొదటి తరం వ్యక్తులు వార్ధక్యంలో ఉన్నప్పుడు, రెండవ తరం  కౌమారంలో, మూడవ తరం బాల్య యౌవ్వన దశలలో ఉంటారు. బాల్యంలోని, యౌవ్వనంలోని ఆలోచనలకు ఆశయాలకు, కౌమార దశల్లోని ఆలోచనా సరళికి కర్తవ్యాలకు తేడా ఉంటుంది. ఈ క్రమంలో వార్ధక్యపు శారీరక మానసిక స్థితిగతులు అనేక మార్పులను సంతరించుకుంటాయి. ఇదంతా జీవుడు ప్రకృతి మధ్య జరిగే బేరసారాలు, స్పందన ప్రతిస్పందనలు. ఈ తేడాలను అధిగమించేందుకు, ప్రకృతి విధించే చట్టాలను ధిక్కరించకుండా వయస్సుకు తగిన రీతిలో నడుచుకుంటే ఆవేదనభరిత జీవితాల సమస్యలకు పరిష్కారాన్ని తెలుసుకోవచ్చు. అందుకే శంకరుడు 'సంసారం సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త' అని బోధించాడు. సంసారం సమస్య మానవునికి మాత్రమే వుంటుంది. మిగతా జీవులు తమ సంతతి యెడల అనుసరించవలసిన కర్తవ్యాన్ని పూర్తిచేసి చేతులు దులుపుకుంటాయి. కాని మనం భార్యా బిడ్డలకు జీవితాంతం అతుక్కొని ఉండాలనే ఆశతో గాలానికి తగులుకునే చేపలలా బ్రతుకుతుంటాము. దీనికి చెలియలికట్ట లేదని పిస్తుంది. ఈ నవల ఇతివృత్తం నేటి తరాల అంతరాలను తెలియజేయడమే.

---



Acharya Seshaiah Kandamuru, M.Com., Ph.D. is a retired Professor of Commerce and Management of Sri Venkateswara University, Tirupati. Primarily, he is a teacher at heart apart from being an administrator, researcher, consultant, trainer and a mentor. He was the Founder Secretary of Bharatiya Vidya Bhavan, Tirupati Kendra School and Ex-Honorary Director of Andhra Pradesh Productivity Council, Tirupati.

He has organized thousands of programmes covering Leadership, Motivation, Communication, Organizational Behavior (OB) and Entrepreneurial Development including PMRY and CMEY. His mission is to convert problematic and lethargic children into successful career oriented people. He is a recipient of "*Pratibha Puraskar*", "*Best Citizens of India*" "*Vijnana Vidvanmani*" and "*Siksha Ratna*". His mission is to solve the real and notional problems of people by mentoring parents, children, men and women of all ages and positions to come out of their utopian thinking that damages their health, wealth and relationships. He authored articles and books on Banking, Commerce, "21 Leadership Lessons" (Co-authored), "Fate & Free-Will", "Leadership Proverbs", "Communication Skills", "Personality Development", "Meet the Mentor and the Leader", "Sri Sreenivas Charitam" (Telugu Lyrics), "Nitya Jeevitamlo Bhagavad Gita" (Telugu), "Krishna", "పూర్ణిమ"(నవల), "జగన్నాటకం" (నవల). "Bala Kadha Sudha" (Children Stories - Telugu), "Brahmana Chaitanyam", "The Work Culture in Bhagavad Gita", "Lokagnanam", "A Story Book for Children" and "The Physics of Philosophy and The Philosophy of Physics" are under print.